అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 28-1-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 27 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50



విద్యార్థుల నిర్బంధం

ఢిల్లీ, అంబేద్కర్ యూనివర్సిటీల్లో జేఎన్‌యూ సీన్ రిపీట్ ...2లో

2,391 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి

- గురుకులాలు, ఐ అండ్ పీఆర్‌లో ఖాళీలు...
- ట్విట్టర్ ద్వారా వెల్లడించిన మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో మరో 2,391 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గురుకులాలు, సమాచార పౌరసంబంధాలశాఖల్లోని వివిధ పోస్టుల భర్తీకి అనుమతి ఇస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని ఆర్థికశాఖమంత్రి హరీశ్‌రావు ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నదని తెలిపారు. బీసీ గురుకుల విద్యాలయాల్లో 1,499 పోస్టులను గురుకులాల నియామక మండలి ద్వారా భర్తీ చేస్తారని పేర్కొన్నారు. దీనిలో 480 లెక్చరర్ పోస్టులు, 324 టీజీటీ, 235 పీజీటీ, 185 జూనియర్ లెక్చరర్, 60 ల్యాబ్ అసిస్టెంట్, 37 లైబ్రేరియన్, 33 ఆర్ట్-క్రాఫ్ట్-మ్యూజిక్ టీచర్, 30 కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్, 33 పీఈటీ, 10 ప్రిన్సిపల్ పోస్టులు ఉన్నాయి. వైద్య, ఆరోగ్యశాఖ నియామకమండలి ద్వారా మరో 63 స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. బీసీ గురుకుల విద్యాసంస్థల్లో గ్రూప్-3, గ్రూప్-4లో 12 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేస్తారన్నారు. బీసీ గురుకుల విద్యాసంస్థల్లో 417 జూనియర్ లెక్చరర్ పోస్టులను గురుకుల నియామక బోర్డు ద్వారా భర్తీ చేస్తారు. గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలో 87 టీజీటీ, ...5లో



ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం ఫిబ్రవరి 9న

హైదరాబాద్‌లో మహాధర్నా

వచ్చే నెల 3న అధికారులకు వినతిపత్రాలు

- సొంత జాగా ఉన్న వారి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి
- రాష్ట్ర బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించాలి : తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలను కేటాయిస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల తొమ్మిదో తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు ఆయన ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్ లోని గోల్కొండ చౌరస్తాలో తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ వేలాది మంది పేదలు ఇండ్ల స్థలాల కోసం గత ఆర్నెల్లుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నారని చెప్పారు. అధికారులు, పోలీసులు వారిపై దాడి చేసి గుడిసెలను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. రౌడీలతో బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములున్నా పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం లేదనీ, అవి రియల్ ఎస్టేట్ వ్యాపారులపరం అవుతున్నాయని విమర్శించారు. గుడిసెలు వేసుకున్న వారందరికీ అక్కడే ఇంటి స్థలాల పట్టా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూమి లేక కాదనీ, రాష్ట్ర ప్రభుత్వానికి మనసు లేకే ఇండ్లు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం లక్షలాది మంది దరఖాస్తు పెట్టుకున్నారని గుర్తు చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్లను పూర్తిస్థాయిలో కట్టలేదనీ, పూర్తయిన వాటినీ లబ్ధిదారులకు కేటాయించక పోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వాటి నిర్మాణాలు పూర్తయిన ప్రాంతాల్లో అర్హులైన పేదలందరికీ తక్షణం కేటాయించాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. సొంత జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షలు ఇవ్వాలన్నారు. అర్హులైన పేదలందరికీ 120 గజాల ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ప్రకటించాలని చెప్పారు. ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో వారంరోజులపాటు సర్వేలు, దరఖాస్తులు సమర్పించాలని నిర్ణయించామని వివరించారు. వచ్చే నెల మూడో తేదీన మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తామని అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య, ...5లో



బాలోత్సవం.. సృజనాత్మకం

పిల్లల ప్రపంచంగా మారిన సుందరయ్య విజ్ఞాన కేంద్రం

- వేలాదిగా తరలొచ్చిన చిన్నారులు
- పాటలతో అలరించిన విద్యార్థులు
- ఆకట్టుకున్న కోలాట, జానపద నృత్య ప్రదర్శనలు
- అబ్బురపరిచిన వైజ్ఞానిక ప్రదర్శన

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం తెలంగాణ బాలోత్సవం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. పిల్లల సృజనాత్మక కార్యక్రమాలతో బాలోత్సవం ఉట్టిపడింది. బాలబంధు బిరుదాంకితుడు, బాలసాహిత్యవేత్త చొక్కాపు వెంకటరమణ బాలోత్సవ జెండాను ఎగురవేసి ప్రారంభించారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. ఆ తర్వాత చిన్నపిల్లలంతా గాల్లో బెలూన్లను ఎగురవేసి సంబురాలు చేసుకున్నారు.

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్వీకే మెయిన్ హాల్‌లో ప్రారంభసభను ప్రముఖ సినీగేయ రచయిత, తెలంగాణ బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షులు సుద్దాల అశోక్‌తేజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ..నర్సరీ, ఎల్‌కేజీ నుంచే చదువుల పేరిట పిల్లలపై విపరీతమైన ఒత్తిడిని పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటపాటలు వేరుగాదనీ, అవి చదువులో భాగమని నొక్కిచెప్పారు. పిల్లలు ఆటపాటల్లో ఎంత చురుకుగా ఉంటే మానసికంగా అంత దృఢంగా తయారవుతారని చెప్పారు. తెలంగాణ బాలోత్సవం ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు సీహెచ్.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ..ఈ దేశం మీదే..ఈ ప్రపంచం మీదే..ఈ లోకం మీదే..మునుముందుకెళ్లండి అంటూ పిల్లలను ఆశీర్వదించారు. నిర్మాత, దర్శకులు, కోవిదా సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జి. అనూహ్యరెడ్డి మాట్లాడుతూ..జీవితంలో కష్టాలను చూసి భయపడొద్దని పిల్లలకు సూచించారు. వాటిని ఎదురొడ్డి ముందుకెళ్తేనే భవిష్యత్‌లో సుఖపడుతామని ...5లో

నేతలు గెలుస్తున్నారు.. ప్రజలు ఓడుతున్నారు..

దౌర్జన్యమే లక్ష్యంగా మారింది...

- దేశ రాజకీయాల్లో మార్పు తెస్తాం : సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్



గిరిధర్ గమాంగ్‌కు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ఎన్నికల్లో పార్టీలు, నేతలు గెలుస్తున్నారు కానీ ప్రజలు ఓడుతున్నారు...' అని సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్షన్లలో నిజంగా గెలవాల్సింది ప్రజలేనని ఆయన వ్యాఖ్యానించారు. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన వారు ప్రజా సేవ చేయాలి.. కానీ ఇప్పుడు దేశంలో కొన్ని పార్టీలకు దౌర్జన్యం చేయటమే లక్ష్యంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారాలంటూ ఆయన ఆకాంక్షించారు. ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్... శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గమాంగ్‌తోపాటు ఒరిస్సా మాజీ మంత్రి శివరాజ్‌పాంగి, నాయకులు హేమ గమాంగ, జయరామ్ పాంగి, రామచంద్ర హన్సద, బృందావన్, నబిన్ నందా, రతా దాస్, భగీరథ్ శెట్టి, మయాధర్ జేనా తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ... ఎన్నికల్లో ప్రజలు గెలిచే విధంగా దేశ రాజకీయాల్లో మార్పు తెస్తామని అన్నారు. ఈ రకమైన పరివర్తన రావాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. ఈ క్రమంలో తనపైనా, తమ పార్టీపైనా చాలా మంది ఇష్టారీతిన విమర్శలు చేస్తా రని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర ఆర్థికంగా నిలదొక్కుకున్న రాష్ట్ర మని గుర్తు చేశారు. అయితే గతంలో తెలంగాణ నుంచి ఉపాధి కోసం మహారాష్ట్రకు చాలా మంది వలసెళ్లేవారని వివరించారు. ఆ విధంగా వెళ్లిన వారు ఇప్పుడు వెనక్కి వస్తున్నారని వివరించారు. ప్రస్తుతం ...2లో

సత్యభామ జమున కన్నుమూత



వెండితెర సత్యభామగా తెలుగు ప్రేక్షకుల మదిలో సజీవంగా నిలిచిన మహానటి జమున. ఆత్మ విశ్వాసానికి, మహిళా సాధికారతకు ఆమె పక్కా కేరాఫ్ అడ్రస్. అగ్ర హీరోలకు దీటుగా నిలిచి ఐకానిక్ పాత్రలతో తెలుగు సినీ చరిత్రలో నటిగా స్వర్ణయుగాన్ని సృష్టించిన జమున ఇకలేరనే వార్త ఆమె అభిమానులతోపాటు సినీ పరిశ్రమలోనూ విషాదాన్ని నింపింది.

వివరాలు సినిమాలో..

గవర్నర్, సీఎం సహా పలువురి సంతాపం



2లో..

అంత్యక్రియల కోసం జమున భౌతికకాయాన్ని తరలిస్తున్న సినీ నటులు మురళీ మోహన్, మాదాల రవి తదితరులు.

ఒవెరా గ్రూప్ యజమానిపై చార్జిషీట్


- మోర్బీ బ్రిడ్జి కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొన్న పోలీసులు



గాంధీనగర్ : గుజరాత్‌లోని మోర్బీ బ్రిడ్జి కూలిన కేసులో 1,262 పేజీల చార్జిషీటును పోలీసులు సిద్ధం చేశారు. పరారీలో ఉన్న ఒరెవా గ్రూప్ ప్రమోటర్, అజంతా మాన్యుఫ్యాక్చరింగ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జైసుఖ్ పటేల్‌ను ప్రధాన నిందితుడిగా చార్జిషీటులో చేర్చినట్టు పోలీసులు శుక్రవారం తెలిపారు. గుజరాత్‌లోని మోర్బీ వంతెన కుప్పకూలడంతో చిన్నారులు సహా 135 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి ...5లో


కరోనా జీరో...

తొలిసారిగా నో పాజిటివ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసిన కరోనా కేసులు రాష్ట్రంలో తొలిసారి జీరోగా నమోద య్యాయి. ఈ మహమ్మారి మొదలైనప్పటి నుంచి 24 గంటల్లో ఒక్క పాజిటివ్ కేసు రాకపోవడం ఇదే మొదటి సారి. గురువారం సాయంత్రం ఐదు గంటల నుంచి శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు రాష్ట్రంలో 3,690 నమూనాలను పరీక్షించారు. వీరందరికి నెగెటివ్ రావడం గమనార్హం. ఇప్పటికే పాజిటివ్ వచ్చిన ఐదుగురు కోలుకోగా, మరో 19 మంది పాజిటివ్ వచ్చిన రోగులు ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు 3,83,86,215 నమూనాలను పరీక్షించగా, అందులో 8,41,486 మందికి పాజిటివ్ వచ్చింది. వీరిలో 8,37,356 మంది కోలు కున్నారు. 4,111 మంది మరణించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కోలుకుంటున్న వారి సంఖ్య 99.51 శాతంగా ఉన్నది. గతేడాది నవంబర్‌లో అత్యధికంగా 77 పాజిటివ్ కేసులు రాగా అతి తక్కువగా రెండొచ్చాయి. డిసెంబర్ నాటికి అత్యధిక పాజిటివ్ కేసుల సంఖ్య 15కు తగ్గగా, అతి తక్కువగా ఐదుగా నమోదైన సంగతి తెలిసిందే.



'నీళ్లు' నములుతున్నారు..!

ఖమ్మం నగర పరిసరాల్లో విచ్చలవిడిగా వెంచర్లు వెలుస్తున్నాయి. ముఖ్యంగా స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలోని ఖమ్మం రూరల్, అర్బన్, రఘునాథపాలెం, కూసుమంచి, చింతకాని, కొణిజర్ల తదితర మండలాల్లో వేస్తున్న వెంచర్లలో కనీస ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. 2017 నుంచి నేటి వరకు వేసిన అనేక వెంచర్ల మాటున పంటకాల్వలు కనుమరుగయ్యాయి. నగర పరిసర భూములు ఎకరం రూ.కోట్లలో పలుకుతుండటంతో కొద్ది పాటి స్థలాన్ని కూడా వదిలేందుకు రియల్టర్లు సుముఖంగా లేరు. పంట కాల్వలకు ఇరువైపులా 9 మీటర్ల బఫర్ జోన్ వదిలివేస్తేనే నీటిపారుదల శాఖ నో ఆబ్జక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌వోసీ) ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఆ నిబంధన సుడా పరిధిలో ఎక్కడా అమలు కావడం లేదు.

నీటిపారుదల శాఖల్లో పర్యవేక్షణ కరువు

- 'రియల్' ఆక్రమణలో పంటకాల్వలు
- బఫర్‌జోన్ వదలకుండా వెంచర్లు
- అధికారుల సంతకాలు సైతం ఫోర్జరీ!
- ఎన్‌వోసీల విషయంలో మాయాజాలం
- రాజకీయ ఒత్తిళ్లతో చర్యలు శూన్యం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రియల్టర్ల చేతులు తడుపుతుండటంతో నీటి పారుదలశాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. డీటీసీపీ లేఅవుట్ పేరేకానీ ఏ ఒక్కచోటా నిబంధనలకు అనుగుణంగా వెంచర్లు లేవు.

నకిలీ సంతకాలతో ఎన్‌వోసీలు..

ఖమ్మం రూరల్ మండలంలోని గుర్రాలపాడు, ఏదులాపురం, పెద్దతండా, ముత్తగూడెం తదితర రెవెన్యూల్లో కొందరు వెంచర్ల నిర్వాహకులు ఏకంగా అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి మరీ ఎన్‌వోసీలు సృష్టిస్తున్నా ఇటు సుడా.. అటు ఇరిగేషన్ అధికారులు మనదేమి పోతుందన్నట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల పంటకాల్వల్లో గ్రానైట్ వ్యర్థాలు పోయడం.. వెంచర్లలో వదలాల్సిన గ్రీన్‌బెల్ట్‌ను బఫర్‌జోన్‌లో కేటాయించడం.. పంటకాల్వలను పూడ్చడం.. కుచించివేయడం.. వెంచర్లకు అడ్డువస్తే కాల్వల దిశ మార్చడం.. అవసరమైతే నిరుపయోగం అనే పేరుతో ఏకంగా పూడ్చివేసి ఆక్రమించడం.. ఇవన్నీ షరామామూలే అయినా నీటిపారుదల శాఖ, సుడా అధికారులు కాసుల కక్కుర్తితో చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మీడియాలో కథనాలు వచ్చినప్పుడు హడావుడి చేయడం.. బఫర్‌జోన్ నిర్దేశించి మార్కింగ్ చేయడం.. ఆ తర్వాత వదిలివేయడం ఆనవాయితీగా మారింది. ఇదే అదనుగా భావించి ఏదులాపురం రెవెన్యూలోని శ్రీరామ్‌నగర్‌లో ఓ వెంచర్ నిర్వాహకుడు, హెచ్ఎల్‌సీ (హౌస్ లోన్ కన్సల్టెంట్) తోడై ఏకంగా నీటిపారుదలశాఖ డీఈ, పంచాయతీ సెక్రటరీల సంతకాలు ఫోర్జరీ చేసి ఎన్‌వోసీ నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ వేయడంతో పాటు బఫర్‌జోన్ లేకుండా ఏకంగా కాల్వలో నుంచే ప్రహరీగోడ నిర్మాణం చేపట్టడం విస్మయం గోల్పుతోంది. గుర్రాలపాడు రెవెన్యూలో ఇదే రియల్టర్లు వేసిన మరో వెంచర్ ఎన్‌వోసీకి విరుద్ధంగా ఉండటం గమనార్హం. ఇక్కడ పంటకాల్వ దిశ మార్చడంతో పాటు నక్షాకు విరుద్ధంగా రోడ్లు, కల్వర్టుల నిర్మాణం జరిగినట్టు ఇటీవల రెవెన్యూ సర్వేలో బయట పడింది. అయినా సంబంధిత రియల్ట ర్లపై ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది. తాజాగా ఇదే రియల్టర్లు ఆటో నగర్‌లో వేస్తున్న మరో వెంచర్ పైనా ఇలాంటి ఆరోపణలే వస్తున్నాయి.



కాల్వల దురాక్రమణలు..

లేఅవుట్ నిబంధనల ప్రకారం ఎటువంటి ...5లో

విద్యార్థుల నిర్బంధం

ఢిల్లీ, అంబేద్కర్ యూనివర్సిటీల్లో జేఎన్‌యూ సీన్ రిపీట్

- సెక్షన్ 144 విధింపు.. విద్యుత్ సరఫరా కట్
- మోడీపై బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనను నిషేధిస్తూ ఆదేశాలు
- వర్సిటీ యంత్రాంగాలు, పోలీసుల చర్యలు
- 24 మంది అదుపులోకి.. అయినా వెనక్కి తగ్గని విద్యార్థులు
- వీడియో లింక్‌తో ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలో వీక్షణ

న్యూఢిల్లీ : భారత్‌లోని అగ్రస్థాయి విశ్వవిద్యాలయాలైన ఢిల్లీ, అంబేద్కర్ యూనివర్సిటీలలో జేఎన్‌యూ సీన్ రిపీట్ అయింది. ప్రధాని మోడీపై బీబీసీ డాక్యుమెంటరీ సిరీస్‌ను వీక్షించడానికి సిద్ధమైన విద్యార్థులను వర్సిటీ యంత్రాంగాలు, పోలీసులు అడ్డుకున్నారు. బీబీసీ సిరీస్ ప్రదర్శనకు సిద్ధమైన ఢిల్లీ యూనివర్సిటీలో విద్యార్థులు అధిక సంఖ్యలో గుమిగూడటాన్ని, బహిరంగా స్క్రీనింగ్‌ను నిషేధిస్తూ సెక్షన్ 144 ను విధించారు. ఇటు అంబేద్కర్ యూనివర్సిటీలోనూ డాక్యుమెంటరీ ప్రదర్శనకు సిద్ధమైన వేళ యంత్రాంగం విద్యుత్ సరఫరాను నిలిపివేసింది.

సెక్షన్ 144 విధింపు.. విద్యార్థుల నిరసనలు

వర్సిటీ యంత్రాంగాల తీరు అక్కడి విద్యార్థుల్లో ఆగ్రహాన్ని తెప్పించింది. రెండు యూనివర్సిటీలలో విద్యార్థులు నిరసనలు చేశారు. నినాదాలు వినిపించారు. విద్యార్థుల నిరసనను అణగదొక్కేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. వీరిలో చాలా మంది విద్యార్థులను పోలీసులు నిర్బంధించారు. దీంతో వర్సిటీలో విద్యార్థులు, పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నది.


డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకోవడంలో భాగంగా విధించిన సెక్షన్ 144కు వ్యతిరేకంగా ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు ఆర్ట్స్ ఫ్యాకల్టీ వద్ద మరింత మంది గుమిగూడారు. వర్సిటీ యంత్రాంగం ఆదేశాలను వారు నిరసించారు. దీంతో పోలీసులు, యూనివర్సిటీ భద్రతా సిబ్బంది విద్యార్థుల పట్ల కఠినంగా ప్రవర్తించారు. ఢిల్లీ యూనివర్సిటీలో డాక్యుమెంటరీ ప్రదర్శనకు ప్రయత్నించినందుకు 24 విద్యార్థులను నిర్బంధించినట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు ధ్రువీకరించారు.

పోలీసులు, వర్సిటీ యంత్రాంగాలు తమ అధికార, అంగ బలాన్ని ఉపయోగించి డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకోవాలని చూసినా.. విద్యార్థులను ఆపలేకపోయాయి. జేఎన్‌యూ లో లాగానే.. డాక్యుమెంటరీకి సంబంధించిన క్యూఆర్ కోడ్ లింక్‌ను షేర్ చేసుకొని విద్యార్థులు తమ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలో వీక్షించారు. క్యాంపస్‌లో పబ్లిక్ స్క్రీనింగ్‌ను అనుమతించబడదని ఢిల్లీ యూనివర్సిటీ లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఒకవేళ విద్యార్థులు వారి ఫోన్లలోనే చూడాలనుకుంటే.. అది వారి విచక్షణ అని చెప్పాయి. వర్సిటీలలో అలాంటి ప్రదర్శనలకు అనుమతి లేదనీ, భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు మోహరింపు భారీగా ఉంటుందనీ, ఒక వేళ ప్రదర్శన (స్క్రీనింగ్) కోసం విద్యార్థులు గుమిగూడితే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ విషయంలో ఢిల్లీ పోలీసులకు తాను లేఖ రాసినట్టు, వారు (పోలీసులు) చర్యలు తీసుకుంటారని ఢిల్లీ యూనివర్సిటీ ప్రొక్టార్ రజిని అబ్బి తెలిపారు. ఇటు జామియా మిలియా ఇస్లామియాలో విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యుల అభ్యర్థన మేరకు తరగతులు బహిష్కరించారు. స్క్రీనింగ్‌కు కొందరు విద్యార్థులు ప్రయత్నించారనీ, యూనివర్సిటీ పూర్తిగా విఫలమైందని వైస్ చాన్సలర్ నజ్మా అక్తర్ వ్యాఖ్యలు చేసిన తర్వాతి రోజు విద్యార్థులు తరగతులు బహిష్కరించటం గమనార్హం.

ఈ యూనివర్సిటీలో డాక్యుమెంటరీ ప్రదర్శనకు ప్రయత్నించిన 13 మంది విద్యార్థులను ఢిల్లీ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్న విషయం విదితమే. గుజరాత్ అల్లర్లలో మోడీ పాత్రకు సంబంధించి బీబీసీ విడుదల చేసిన డాక్యుమెంటరీ " ఇండియా : ద మోడీ క్వశ్చన్" భారత్‌లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. దేశంలో ఎస్ఎఫ్ఐ మొదలుకొని పలు విద్యార్థి సంఘాలు ఇప్పటికే ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనను పలు యూనివర్సిటీల్లో జరిపాయి. మరికొన్ని వర్సిటీలు, విద్యాసంస్థలు, ఇతర ప్రదేశాల్లో ప్రదర్శించడానికి విద్యార్థి సంఘాలు ఇప్పటికే నిర్ణయించాయి. కాగా, ఈ డాక్యుమెంటరీని కేంద్రం ఐటీ నిబంధనల్లోని ఎమర్జెన్సీ అధికారాలను ప్రయోగిస్తూ నిషేధం విధించిన విషయం విదితమే.

హిండెన్‌బర్గ్ దెబ్బకు అదానీ షేర్ల విలవిల

- నాలుగో వంతు విలువ పతనం
- రూ.4 లక్షల కోట్లు ఫట్
- మార్కెట్లపై తీవ్ర ఒత్తిడి



రెండు సెషన్లలో అదానీ షేర్ల పతన తీరు	
అదానీ ఎంటర్‌ప్రైజెస్	-19.77%
అదానీ పోర్ట్స్	- 21.58%
అదానీ విల్మర్	-9.74%
అదానీ గ్రీన్	-22.46%
అదానీ పవర్	-9.72%
అదానీ ట్రాన్స్‌మిషన్	-27.08%
అదానీ టోటల్	-24.76%
ఏసిసి	-19.52%
అంబుజా సిమెంట్	-23.75%

న్యూఢిల్లీ : అదానీ గ్రూపు కంపెనీలు మోసపూరిత చర్యలతో స్టాక్స్ విలువను పెంచుకుంటాన్నాయని.. తప్పుడు ఎకౌంట్స్‌కు పాల్పడుతున్నాయని.. మనీ లాండరింగ్ చేస్తున్నాయని అమెరికన్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రిపోర్టు దెబ్బ అదానీ షేర్లకు పెను గాయాన్ని చేశాయి. ఆ రిపోర్ట్ ప్రభావంతో నాలుగోవంతు విలువ కోల్పోయాయి. రెండు సెషన్లలో అదానీకి చెందిన 10 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.4 లక్షల కోట్లు ఆవిరయ్యింది. హిండెన్‌బర్గ్ రిపోర్టుతో బుధవారం ఒక్క సెషన్‌లోనే రూ.1 లక్షల కోట్ల విలువను కోల్పోగా.. శుక్రవారం సెషన్‌లో దాదాపు రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. ఇంట్రాడేలో ఈ సూచీలు 5-25 శాతం క్షీణించాయి. హిండెన్‌బర్గ్ రిపోర్ట్ నిరాధారమైందని.. ఆ సంస్థపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని అదానీ గ్రూపు ప్రకటించినప్పటికీ.. ఇన్వెస్టర్లు విశ్వసించలేకపోయారు. మరోవైపు అదానీ గ్రూపు అవకతవకలపై తాము ఏ విచారణకు అయినా సిద్ధమని.. తమ రిపోర్టుకు కట్టుబడి ఉన్నామని హిండెన్‌బర్గ్ ప్రకటించడం అదానీ షేర్లను మరింత ఒత్తిడికి గురి చేసింది. జనవరి 24న అదానీ గ్రూపు కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ విలువ రూ19 లక్షల కోట్లుగా ఉండగా.. జనవరి 27 ముగింపు నాటికి రూ.15 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. అదానీ షేర్లలో అమ్మకాల వల్ల ఎల్ఐసి దాదాపు రూ.18వేల కోట్ల నష్టాన్ని చవి చూసింది. అదానీ గ్రూపులోని కంపెనీల్లో జనవరి 24 నాటికి ఎల్ఐసి పెట్టుబడి రూ.81,268 కోట్లుగా ఉండగా.. 27 నాటికి ఇది రూ.62,621 కోట్లకు పడిపోయింది. అదానీ గ్రూపు అవకతవకలపై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రిపోర్ట్‌ను అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడిదారుడు బిల్ అక్‌మాన్ సమర్థించారు. "ఆ రిపోర్ట్ అత్యంత విశ్వసనీయమైనది, చాలా లోతుగా పరిశోధించబడిందని" అక్‌మాన్ శుక్రవారం ట్వీట్ చేశారు.

ఎఫ్‌పిఒపై నీలినీడలు

అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.20,000 కోట్ల ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పిఒ) శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో పెట్టుబడులకు బుధవారం యాంకర్ ఇన్వెస్టర్లను స్పందన రాగా.. శుక్రవారం రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి అనాసక్తి వ్యక్తమయ్యిందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఎఫ్‌పిఒ జనవరి 31 వరకు కొనసాగనుంది. ఎఫ్‌పిఒలో ఒక్కో షేరును రూ.3,112 - రూ.3,276 ధరల శ్రేణిలో విక్రయించనున్నారు. తాజా ఆరోపణల నేపథ్యంలో ప్రస్తుతం షేరు ధర ఎఫ్‌పిఒ ధర కంటే కిందకు చేరి రూ.2,768 వద్ద నమోదవుతోంది. దీంతో ఈ ఎఫ్‌పిఒ ఫ్లాప్ కానుందని అంచనాలు వెలువడుతున్నాయి.

కుబేరుల్లో ఏడో స్థానానికి అదానీ..

హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు అత్యంత కుబేరుడైనా గౌతం అదానీ సంపద కీలకమైన 100 బిలియన్ల మార్క్‌కు దిగువకు పడిపోయింది. రెండు రోజుల్లో ఆయన కంపెనీల షేర్ల పతనంతో ప్రపంచ సంపన్నుల జాబితాలో అదానీ ర్యాంకింగ్ ఏడో స్థానానికి పడిపోయింది. ఇంతక్రితం ఆయన నాలుగో స్థానంలో ఉన్నారు. కొన్ని నెలల క్రితం ఓ దశలో రెండో స్థానానికి ఎగబాకగా.. చాలా కాలం మూడో స్థానంలో కొనసాగారు.

శాస్త్రీయతతో ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి

ఎమ్మెల్సీ అభ్యర్థి వినయ్‌బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాస్త్రీయతతో కూడిన ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ ఎ వినయ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 జీవోను బలవంతంగా ఉపాధ్యాయులపై రుద్ది వేల మందిని స్థానికేతరులుగా చేశారని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా సౌలభ్యం కోసం మారుమూల ప్రాంతాలకు కేటాయించి ఉపాధ్యాయులను బదిలీ చేసి ఇబ్బంది పెట్టారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఎన్ని రకాలుగా ప్రాతినిధ్యం చేసినా, బాధితులు ముట్టడించినా ప్రభుత్వం దిగి రాలేదని తెలిపారు. జీరో సర్వీస్‌తో బదిలీలు చేయాలంటూ టీపీటీఎఫ్, బీటీఎఫ్, యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఉద్యమించినా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కుట్రపూరితంగా పరపతికలిగిన వారికి దొడ్డిదారిలో ఇబ్బడిముబ్బడిగా రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలోనే వందల బదిలీలు ప్రభుత్వం చేపడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇది అన్యాయమనీ, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అక్రమ బదిలీలను రద్దు చేయాలనీ, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ (పీఎస్‌హెచ్‌ఎం) పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 317 జీవో బాధితులు, స్పౌజ్ టీచర్లందరికీ న్యాయం చేయాలని కోరారు.

మేటినటి జమున మరణం పట్ల

గవర్నర్, సీఎం సహా పలువురి సంతాపం

చిత్ర సీమకు తీరని లోటు : తమ్మినేని

- ఆమెది ప్రజా నాట్య మండలి కుటుంబం : నారాయణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలుగు సినీ సత్యభామ, మహానటి జమున మరణం పట్ల రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్, ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర సంతాపాన్ని తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. తొలితరం నటిగా వందలాది చిత్రాల్లో నటించిన జమున... తెలుగువారి అభిమాన తారగా వెలుగొందారని సీఎం పేర్కొన్నారు. తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడం, హిందీ భాషా చిత్రాల్లో కూడా నటించిన ఆమె.. ప్రేక్షకుల మనసుల్లో స్థానాన్ని సంపాదించుకున్నారని వివరించారు.

నటిగా కళా రంగానికి సేవ చేయటమేగాక పార్లమెంటు సభ్యురాలిగా కూడా ప్రజలకు సేవ చేయటం గొప్ప విషయమని నివాళులర్పించారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర చలన చిత్రాభివృద్ధి సంస్థ ఎమ్‌డీ అరవింద్ కుమార్ తదితరులు ఆమె మరణం పట్ల సంతాపాన్ని ప్రకటించారు.

జమున మరణం పట్ల సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. వామపక్ష భావజాలం కలిగిన ప్రజా నాట్య మండలి వ్యవస్థాపకులు గరికపాటి రాజారావు ద్వారా జమున కళారంగంలోకి అడుగుపెట్టారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో అనేక చిత్రాల్లో నటించిన ఆమె... మంచి పాత్రల ద్వారా ప్రజలకు చేరువయ్యారని పేర్కొన్నారు. పార్లమెంటు సభ్యురాలిగా కూడా సేవలందించిన జమున మరణం చిత్ర పరిశ్రమకు, అభిమానులకు తీరని లోటని తమ్మినేని ఈ సందర్భంగా తెలిపారు. ఆమె మరణం కళా రంగానికి తీరని లోటని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆమెది ప్రజా నాట్య మండలి కుటుంబమని తెలిపారు. తాను సీపీఐ కార్యదర్శిగా ఉన్నప్పుడు పీఎస్ఎమ్‌కు కార్యక్రమానికి రావాలంటూ కోరితే మఖ్దూం భవన్‌కు వచ్చారని గుర్తు చేశారు. జమున కుటుంబ సభ్యులకు నారాయణ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కూడా జమున మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు.

తెలంగాణ సాహితి, పీఎస్ఎమ్ సంతాపం...

జమున మరణం పట్ల తెలంగాణ సాహితీ, ప్రజా నాట్య మండలి తీవ్ర సంతాపాన్ని తెలిపాయి.



ఆమె కుటుంబ సభ్యులకు తెలంగాణ సాహితీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లభాపురం జనార్దన, కె.ఆనందాచారి, రాష్ట్ర నాయకులు రాంపల్లి రమేశ్, ప్రజా నాట్య మండలి ప్రధాన కార్యదర్శి కట్టా నర్సింహ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు సహచర్యంలో, ప్రజా నాట్య మండలిలో పని చేసిన జమున... ఆ తర్వాత సినిమా రంగంలోకి ప్రవేశించారని ఆనందాచారి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రముఖ నటిగా, మంచి మనిషిగా పేరు తెచ్చుకున్న ఆమె మరణం చిత్ర రంగానికి తీరని లోటని తెలిపారు. సినిమా హీరోలతో సమఉజ్జీగా అద్భుత నటనను ప్రదర్శించిన జమున తెలుగు కళారంగంలో చిరస్మరణీయురాలని నివాళులర్పించారు. పీఎస్ఎమ్ జాతీయ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి కూడా జమున మరణం పట్ల సంతాపాన్ని ప్రకటించారు.



జాతీయ మహిళా క్రికెట్ జట్టుకు పీర్జాదీగూడ అమ్మాయి

- అండర్ -15 డొమెస్టిక్ జట్టుకు గుగులోతు కావ్యశ్రీ ఎంపిక

నవతెలంగాణ-బోడుప్పల్

జాతీయ స్థాయి మహిళా క్రికెట్ జట్టుకు పీర్జాదీగూడ అమ్మాయి ఎంపికైంది. మేడ్చల్ జిల్లా పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ సాయి ఐశ్వర్యా కాలనీలో నివాసం ఉండే గుగులోతు కావ్య శ్రీకి అవకాశం దక్కింది. మూడో డివిజన్ కార్పొరేటర్ బైటింటి శారదాఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కావ్య శ్రీని శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా కావ్య శ్రీ మాట్లాడుతూ.. 'జాతీయ జట్టులో అవకాశం రావాలనేది క్రీడాకారుల కల. అలాంటి అవకాశం నాకు దక్కడం చాలా సంతోషం. సామాన్య జీవితం గడుపుతూ క్యాటరింగ్ పనిచేసే తల్లిదండ్రులు పట్టుదలతో నాకు శిక్షణ ఇప్పించి నా ప్రతి అడుగులో తోడుగా నిలిచారు. 2017లో అశ్విన్ అకాడమీలో శిక్షణ పొందడం ప్రారంభించా. ఎంఎస్డీ అకాడమీలో కోచ్ మహేష్, సహ కోచ్‌లు సతీష్, దుర్గాల సహకారంతో ఈ స్థాయికి చేరా. 2022-2023 డొమెస్టిక్ అండర్15 క్రికెట్ టీంలో బీసీసీఐ ప్రకటించిన తుది జట్టులో అవకాశం రావాడం చాలా సంతోషంగా ఉంది. భవిష్యత్తులో జాతీయ మహిళా క్రికెట్ జట్టులో స్థానం పొందేలా కష్టపడి ఆడుతా' అని తెలిపారు. పీర్జాదీగూడ 3వ డివిజన్ కార్పొరేటర్ బైటింటి ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ స్థాయి మహిళా క్రికెట్ టీంలో తమ డివిజన్ అమ్మాయికి స్థానం లభించడం చాలా సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కావ్య శ్రీ తల్లిదండ్రులు శ్రీనివాస్, సుజాత, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌డీఈ అప్రెంటిస్ అవగాహన వర్క్‌షాప్

హైదరాబాద్ : నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డీఈ) హైదరాబాద్‌లో జాతీయ అప్రెంటిస్ అవగాహన వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు ఆ సంస్థ తెలిపింది. తెలంగాణా రాష్ట్రంలో తొలిసారి ఎన్‌టీఎస్ఐ వద్ద నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ఐటిఐలు, జూనియర్ కాలేజీల్లోని 350 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఆ సంస్థ తెలిపింది. అప్రెంటిస్‌షిప్ సంస్కరణలు, శిక్షణల అమలును వేగవంతం చేయడానికి దేశవ్యాప్తంగా 250కంటే ఎక్కువ వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించింది. తద్వారా సంస్థలు, ఔత్సాహికులు, భాగస్వాముల నడుమ అప్రెంటిస్‌షిప్ సంస్కరణల పట్ల అవగాహన కల్పించనున్నారు. రీజినల్ డైరెక్టొరేట్, స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సంబంధిత ప్రాంతాలలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొంది.

నేతలు గెలుస్తున్నారు.. ప్రజలు ఓడుతున్నారు..

(మొదటిపేజీ తరువాయి)

మన రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు లేవు.. రైతు బంధు, రైతు బీమా తదితర పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో ఇవన్నీ సాధ్యమైనప్పుడు మహారాష్ట్ర, ఒరిస్సాలో ఎందుకు సాధ్యం కావని ప్రశ్నించారు. ఇవి ఆర్థిక సమస్యలు కాదు.. పాలకుల చిత్తశుద్ధి లోపం వల్ల తలెత్తిన సమస్యలని విమర్శించారు. రాజకీయ చిత్తశుద్ధి ఉంటే అన్నీ సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. రైతుల సమస్యలపై గిరిధర్ గమాంగ్ అనేక పోరాటాలు చేశారని కేసీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. దేశంలోని క్రియాశీల నాయకుల్లో ఆయన ఒకరని ప్రశంసించారు.

మత్స్యకారులంతా ఐక్యంగా ముందుకెళ్లాలి

- టీఎమ్‌కేఎమ్‌కేఎస్ క్యాలెండర్ ఆవిష్కరణలో ముఠాగోపాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మత్స్యకారులంతా ఐక్యతతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం(టీఎమ్‌కేఎమ్‌కేఎస్) క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. దేశంలోనే మత్స్య సంపద చాలా పెద్దదనీ, దేశ జీడీపీలో కీలకంగా ఉన్న ఆ రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పాలసీలు తీసుకురావాలని కోరారు. మత్స్యకారులకు ఉపాధి కల్పించాలన్నారు. మండల, డివిజన్, జిల్లా కేంద్రాలలో అధునాతనమైన చేపల మార్కెట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిధులు కేటాయించేలా చూస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు గోరింకల నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఠా విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి తేలు ఇస్తారి, రాష్ట్ర కమిటీ సభ్యులు గాండ్ల అమరావతి ముఠా.దశరథ్, మామిళ్ల జగదీష్, సిహెచ్ వెంకన్న, సంతోష్, తదితరులు పాల్గొన్నారు

షర్మిల పాదయాత్రకు పోలీసుల నిరాకరణ

- ఫిబ్రవరి 2 నుంచి చేయాలంటూ సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల శనివారం నుంచి ప్రారంభించే ప్రజాప్రస్థానం పాదయాత్రకు వరంగల్ పోలీసులు అనుమతిని నిరాకరించారు. వచ్చేనెల రెండో తేదీ నుంచి చేపట్టాలంటూ 15 షరతులతో కూడిన అనుమతినిచ్చారు. దీంతో ప్రజాప్రస్థానం పాదయాత్ర వచ్చేనెల రెండో తేదీన నర్సంపేట నియోజకవర్గం శంకరమ్మ తాండా నుంచి పున:ప్రారంభమవుతుందని షర్మిల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 3,512 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తయ్యిందని వివరించారు. నాలుగు వేల కిలోమీటర్ల మైలురాయి చేరుకునేలా సాగుతుందని పేర్కొన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిగిలిన ఎనిమిది నియోజకవర్గాల్లో పాదయాత్ర కొనసాగుతుందనీ, అనంతరం పాలేరు నియోజకవర్గంలోకి అడుగు పెట్టేలా రూట్‌మ్యాప్ తయారు చేశామని తెలిపారు. వచ్చేనెల మూడో వారంలో అదే నియోజకవర్గంలో ప్రజా ప్రస్థానం పాదయాత్ర ముగింపు సభను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇది కేసీఆర్ పాలనకు అంతిమయాత్ర అని విమర్శించారు. తమ గొంతు నొక్కేందుకు 15 షరతులు విధించారనీ, అయినా ప్రజా సమస్యలను తెలుసుకోవడమే తమ కర్తవ్యమని తెలిపారు.

పరిశోధన, అభివృద్ధి రంగాలకు నిధులు పెరగాలి

- మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో పరిశోధన, అభివృద్ధి రంగాలకు ప్రభుత్వాలు నిధులు పెంచాల్సిన అవసరమున్నదని రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు అభిప్రాయపడ్డారు. 'ట్రిబుల్ ఐటీ హైదరాబాద్' ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ టాక్ సిరీస్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిశోధన, అభివృద్ధి రంగాలకు ప్రభుత్వాలు ఇప్పటికీ నిధులు తక్కువగా వెచ్చిస్తున్నాయని తెలిపారు. సాంకేతికంగా భారతదేశం తనదైన ముద్ర వేసుకున్నప్పటికీ అంతర్జాతీయ స్థాయి ఉత్పత్తులు రాకపోవడానికి ఇన్నోవేషన్ లేకపోవడమే కారణమన్నారు. ఇన్నోవేషన్ ఇకో సిస్టమ్‌లో భాగస్వాములు కావాలని విద్యార్థులకు సూచించారు. దేశ భౌగోళిక, ఆర్థిక, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్నప్పుడే విజయం సాధించగలుగుతారని తెలిపారు. ఇప్పటికీ భారతదేశం అభివృద్ధి చెందుతున్న పేద దేశమంటూ, అత్యంత కీలకమైన వ్యవసాయం వంటి రంగాల్లో సాంకేతికత ఆధారిత పరిష్కారాలను చూపించాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. ఉన్నత విద్యా సంస్థల్లోని విద్యార్థులు తమ పరిశోధనలు, ఆలోచనలను మరింత పదును పెట్టాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. పరిశోధన-అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చేలా తమ పాఠ్య ప్రణాళికలను, విద్యా బోధన పద్ధతులను మార్చుకుంటే మరిన్ని మెరుగైన ఫలితాలు ఈ రంగంలో వస్తాయని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే అనేక ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు తమ అతిపెద్ద కార్యాలయాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. ప్రస్తుతమున్న 50 బిలియన్ డాలర్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమను 2028 నాటికి 100 బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ట్రిబుల్ ఐటీ హైదరాబాద్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ రాజిరెడ్డి, సభ్యులు జయేష్ రంజన్, అజిత్ రంగనేకర్, శ్రీని రాజు, చంద్రశేఖర్, ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ట్రిబుల్ ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రోబోటిక్స్, లాంగ్వేజ్ టెక్నాలజీ, కంప్యూటర్ విజన్, సస్టైనబిలిటీ, స్మార్ట్ సిటీస్ వంటి రంగాల్లో పలు స్టార్ట్ అప్స్ రూపొందించిన ప్రయోగాలను ఉత్పత్తులను పరిశీలించారు.

మార్చి 25లోగా

సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు పూర్తవ్వాలి

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధి హామీ చట్టంలో భాగంగా మంజూరైన సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను మార్చి 25లోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యేలా చూడాలని ఉన్నతాధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, డీఆర్డీఓలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని మంజూరైన పనులకు పాలనా, సాంకేతిక పరమైన మంజూరీలు పూర్తిచేసి సత్వరమే పనుల గ్రౌండింగ్ పూర్తిచేయాలని ఆదేశించారు. పనులన్నీ పూర్తిచేసి చెల్లింపుల కోసం ఎఫ్‌టిఓ జనరేట్ చేయాలని సూచించారు. తద్వారా మెటీరియల్ బడ్జెట్ నిధులు ఫిబ్రవరిలో వస్తాయని చెప్పారు. పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కొన్నిచోట్ల సెలవుల్లో ఉన్నప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగరాదని డీఈలను సమన్వయం చేసుకుని పనులు పూర్తిచేయించాలని సూచించారు. అవసరం మేరకు ఎప్పటికప్పుడు పనుల ప్రగతిపై సమీక్షలు జరపాలని ఆ శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ సంజీవరావును కోరారు. పనుల గ్రౌండింగ్ విషయంలో క్షేత్రస్థాయిలో సమస్యలుంటే వాటిని నమోదు చేసుకోవాలని కమిషనర్ హనుమంతరావుకు సూచించారు. అందుబాటులో ఉన్న నిధులు సద్వినియోగపరచుకోలేని చోటనే గ్రామపంచాయతీ భవనాలు నిర్మించాలని అధికారులకు సూచించారు. ఎట్టి పరిస్థితిలోనూ మార్చి 25 లోగా పనులన్నీ పూర్తి చేసి నెలాఖరులోగా అప్ లోడ్ పూర్తి చేయాలన్నారు.

నందమూరి తారకరత్నకు తీవ్ర అస్వస్థత

హైదరాబాద్ : నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం సినీ నటుడు నందమూరి తారకరత్న మసీదు దగ్గరకు వచ్చారు. అక్కడ ఒక్కసారిగా టిడిపి శ్రేణులు తోసుకోవడంతో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. హుటాహుటిన కుప్పంలోని పిఇఎస్ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. ఆయన వెంట సినీనటుడు బాలకృష్ణ వెళ్లారు. తారకరత్నకు గుండె ఎడమ వాల్వ్ 95 శాతం బ్లాక్ అయినట్లు, తీవ్ర ఉధృతిలో గుండెపోటు (మాసివ్ హార్ట్‌స్ట్రోక్) వచ్చినట్టు వైద్యులు తెలిపారని బాలకృష్ణ చెప్పారు. ఆంజియోగ్రామ్ చేశారని, స్టంట్ ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రాణభయం లేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారని చెప్పారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తీసుకెళ్దామని అనుకున్నామని, ఈ పరిస్థితిలో పేషెంట్‌ని తరలిస్తే రెండోసారి గుండెపోటు వచ్చే అవకాశం ఉందని చెప్పారని తెలిపారు. దీంతో, ఇక్కడే ఉంచి వైద్యం చేయిస్తున్నామని, బెంగళూరులోని నారాయణ హృదయాల నుంచి నలుగురు గుండె వైద్య నిపుణులు విమానంలో ఇక్కడికి వచ్చారని, తారకరత్న ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు వారు కూడా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

వీఐటీ వర్సిటీలో సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ 4.0

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (ఏపీటీఎస్), ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ (ఏపీఐఎస్), వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ 4.0ను శుక్రవారం నిర్వహించాయి. ప్రతిభావంతులైన చివరి ఏడాది విద్యార్థులు, గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు, నిపుణులను ఎంపిక చేసేందుకు దీన్ని చేపట్టాయి. సైబర్ సెక్యూరిటీ ఇంటర్న్‌షిప్, వివిధ రకాల భద్రతా కార్యక్రమాలను బహిర్గతం చేసేందుకు ఇది రూపొందించబడింది. వాటిలో వివిధ వాణిజ్య, ఓపెన్ సోర్స్ సాధనాలను ఉపయోగించి వివిధ నెట్‌వర్క్‌లు, వెబ్, మొబైల్ అప్లికేషన్లలో వల్నరబిలిటీ అసెస్‌మెంట్, పెనెట్రేషన్ టెస్టింగ్ ఉన్నాయి. ఏపీలో వివిధ కాలేజీల నుంచి 623 మంది విద్యార్థులు పోటీకి దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 128 మంది ఈనెల 25న వీఐటీ ఏపీ వర్సిటీ సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన ఫైనల్‌కు ఎంపికయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీటీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం రమణారెడ్డి మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కెరీర్‌లో పురోగతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ విజయరాఘవ నాయక్, ఐటీ ఈసీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జి జాకన్ విక్టర్, వీఐటీ ఏపీ వర్సిటీ వీసీ ఎస్‌వి కోటారెడ్డి, రిజిస్ట్రార్ ఎం జగదీశ్ చంద్ర, ఐఐఈసీ డైరెక్టర్ అమీత్ చవాన్, సైబర్ సెక్యూరిటీ సీఈవో గణేష్‌రెడ్డి, ఏపీటీఎస్ జనరల్ మేనేజర్ డి వెంకటాచలం, ఏపీఐఎస్ స్టార్టప్ ఎకోసిస్టమ్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్ శ్రీధర్ పాల్గొన్నారు.

మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి..

- ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలి
- రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీల ధర్నా
- గ్రాట్యుటీ, పెన్షన్ అమలు చేయాలని డిమాండ్
- మార్చిలో మూడ్రోజులు సమ్మె



నవతెలంగాణ- విలేకరులు

ఐసీడీఎస్‌ను రక్షించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రిటైర్ అయిన అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేసి, వేతనంలో సగం వేతనాన్ని పెన్షన్‌గా నిర్ణయించాలని కోరారు. తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ (టీచర్స్) అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, నూతన జాతీయ విద్యావిధానం చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. 2018లో కేంద్రం పెంచాలని వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం ఏరియర్స్‌తో కలిపి వెంటనే చెల్లించాలన్నారు. హెల్త్‌కార్డులు, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు అమలు చేయాలని, బకాయి ఇంక్రిమెంట్, ఇన్‌చార్జి అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కోరారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని.. పశ్చిమబెంగాల్, కేరళ తదితర రాష్ట్రాల్లో రిటైర్‌మెంట్ సౌకర్యాలు కల్పిస్తున్నారని, తమకూ అవి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీ టీచర్లకు రూ.5లక్షలు, హెల్పర్లకు రూ.3లక్షలు ఇవ్వాలన్నారు. సమస్యలను పరిష్కరించని ఎడల మార్చి 1,2,3 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. సిద్దిపేటలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పద్మ మాట్లాడారు. రాష్ట్రంలోని అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులోని ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. భువనగిరిలోని సీడీపీఓ ఆఫీసు ఎదుట అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఐసీడీఎస్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. సీడీపీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. నార్నూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సుభద్ర ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా, అనంతరం సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. వనపర్తి ఐడీసీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పుట్ట ఆంజనేయులు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా సీడీపీఓ ఆఫీసు ముందు ధర్నా నిర్వహించి అంగన్వాడీ పీడీ జరినా బేగంకు వినతిపత్రం అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీ శిశుసంక్షేమ అధికారి కార్యాలయం ముందు ధర్నా సీడీపీఓ సంగీతకు వినతిపత్రం అందజేశారు. కల్వకుర్తి పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మూడుగం రాజలింగం మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. వీరిలో బడుగు, బలహీనవర్గాలకు చెందినవారే ఎక్కువమంది ఉన్నారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అర్బన్ సీడీపీఓ ఆఫీస్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా అనంతరం సీడీపీఓకి మెమోరాండం అందజేశారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్‌గా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, నేషనల్ గైడ్స్ కమిషనర్‌గా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ రాజ్ కుమార్ కౌశిక్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ పదవిలో ఆమె ఒక ఏడాది కొనసాగుతారు. 2015 నుంచి ఈ సంస్థ రాష్ట్ర చీఫ్ కమిషనర్‌గా ఎమ్మెల్సీ కవిత సేవలందిస్తున్నారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా విద్యార్థుల భాగస్వామ్యం పెంచేలా కృషి చేస్తానని ఆమె చెప్పారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీసవేతనాలివ్వాలి

- ప్రభుత్వ విద్యాసంస్థల నిర్వహణకు నిధులు కేటాయించాలి
- సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కనీస వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ శాఖల్లో వివిధ రకాల పోస్టుల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులకు తక్కువ జీతాలను చెల్లిస్తున్నారని తెలిపారు. వారికి 2020 పేస్కేళ్లలోని కనీస మూలవేతనం చెల్లించేందుకు వీలుగా 2023-24 బడ్జెట్‌లో ప్రతిపాదించాలని కోరారు. కేజీబీవీల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు, కొన్నింటిలో ఇంటర్ తరగతులనూ నిర్వహిస్తున్నారని వివరించారు. సర్కారు బడుల్లోని స్కూల్ అసిస్టెంట్ వేతనం రూ.42,300 నుంచి రూ.1.15 లక్షల వరకు ఉందని తెలిపారు. కానీ కేజీబీవీ టీచర్లకు రూ.26 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పోస్టు కనీస మూలవేతనం రూ.42,300 చెల్లించాల్సి ఉందని వివరించారు. రెగ్యులర్ ఉపాధ్యాయులకు ఇంటి అద్దె భత్యం, కరువు భత్యం అదనంగా ఉంటాయని తెలిపారు. ఆరు నుంచి పదో తరగతికి బోధన చేసే టీచర్‌ను రెగ్యులర్‌గా నియమిస్తే ప్రభుత్వం రూ.53,742 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కానీ కేజీబీవీలో పనిచేస్తున్న వారికి రూ.26 వేలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తున్నదని వివరించారు. వారికి కనీస మూలవేతనం రూ.42,300 చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ) పెంచిన సందర్భంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకిచ్చే వేతనాన్ని పెంచేలా బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేయాలని కోరారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల నిర్వహణ మెరుగుదలకు 2022-23 బడ్జెట్ కంటే 50 శాతం అదనంగా వచ్చే బడ్జెట్‌లో ప్రతిపాదించాలని సూచించారు. ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పారిశుధ్యం, ఇతర సర్వీసు పనులను, గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లు చేయలేకపోతున్నాయని వివరించారు.

వచ్చే బడ్జెట్‌లో వాటి నిర్వహణలో భాగంగా సర్వీసు పర్సన్ల నియామకం కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూళ్లను నిర్మించి పదేండ్లయ్యిందనీ, వాటి భవనాల రంగు వెలసిపోయాయని తెలిపారు. ఆయా భవనాలకు రంగులు వేసేందుకు, మరమ్మతుల కోసం అదనపు బడ్జెట్ కేటాయించాలని పేర్కొన్నారు.

నాబార్డు ద్వారా రూ.3 వేల కోట్ల రుణం

- తక్షణం రైతులకు చెల్లింపులు
- పౌరసరఫరాల సంస్థ చైర్మెన్ సర్దార్ రవీందర్ సింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వానాకాలం సీజన్‌లో పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపుల కోసం నాబార్డ్ ద్వారా రూ. 3 వేల కోట్ల రుణం తీసుకున్నట్టు పౌరసరఫరాల సంస్థ చైర్మెన్ సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పౌరసరఫరాల సంస్థ బోర్డు సమావేశంలో రుణ సేకరణకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రుణ సేకరణ నిమిత్తం నిర్వహించిన టెండర్లలో నాబార్డ్ సింగిల్ టెండర్‌ను వేశాయి. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చిన రుణపరిమితి నిబంధనలకు అనుగుణంగా రుణ సేకరణ చేసినట్టు రవీందర్ సింగ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఏడాది వానాకాలంలో పౌరసర ఫరాల సంస్థ 9.65 లక్షల మంది రైతుల నుంచి రూ.13,189 కోట్ల విలువ చేసే 64.12 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. కాగా రూ.3 వేల కోట్ల రూపాయల్లో రూ.500 కోట్ల వరకు రైతులకు చెల్లింపులు చేయగా, మిగిలిన మొత్తం గతంలో తీసుకున్న స్వల్పకాలిక రుణాలను తిరిగి చెల్లించ డానికి ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

ఏఎమ్ టూ పీఎమ్

- టీఎస్ఆర్టీసీలో ఎక్స్‌ప్రెస్ పార్సిల్ సర్వీస్ ప్రారంభం
- వినియోగదారులకు మరింత చేరువవుతాం-ఎమ్‌డీ సజ్జనార్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్‌లో భాగంగా 'ఏఎమ్ టూ పీఎమ్' ఎక్స్‌ప్రెస్ పార్సిల్ సర్వీస్‌ను ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ శుక్రవారం ప్రారంభించారు. ఎంపిక చేయబడిన 99 కేంద్రాలకు ఒక కేజీ పార్సిల్ (రూ.5వేల వరకు విలువైనవి)ను కేవలం రూ.99 కే ఉదయం బుక్ చేస్తే, సాయంత్రానికి డెలివరీ చేసే సౌకర్యాన్ని కల్పించినట్టు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల లోపు (ఏఎమ్) పార్సిల్‌ను బుక్ చేస్తే, అదే రోజు రాత్రి 9 గంటలకల్లా డెలివరీ చేస్తారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత (పీఎమ్) పార్సిల్ బుక్ చేస్తే మరుసటి రోజు ఉదయం 9 గంటలకల్లా డెలివరీ చేస్తారు. దీనికే 'ఏమ్ టూ పీఎమ్' అని పేరుపెట్టారు. ఈ సర్వీసులకు నగదు, యూపీఐ పేమెంట్స్ చెల్లుబాటు అవుతాయి. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ 9154680020లో సంప్రదించవచ్చు. అలాగే టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం అధికారిక వెబ్‌సైట్ www.tsrtcparcel.in లో సంప్రదించవచ్చని ఎమ్‌డీ సజ్జనార్ తెలిపారు. ఈ సందర్భంగా బస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన లాజిస్టిక్ సర్వీసుల గురించి వివరించారు. ప్రస్తుతం ఈ-కామర్స్ యుగం నడుస్తున్నదనీ, దానికి తగినట్టే ఆర్టీసీ సేవల్ని విస్తరిస్తున్నామన్నారు. టైర్-3 సిటీలకు ఆర్టీసీ లాజిస్టిక్ సేవల్ని మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 'ఏఎమ్ టూ పీఎమ్' సర్వీసులు చిన్న వ్యాపారులకు ఉపయుక్తంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఎంపిక చేసిన రూట్లలోనే ఈ సేవలు ప్రస్తుతం అందుబాటులో ఉంటాయని వివరించారు. టిక్కెట్ ఆదాయానికి అదనంగా పెట్రోల్ బంకుల నిర్వహణ, లాజిస్టిక్స్, జీవా వాటర్ బాటిళ్ల మార్కెట్‌లోకి ప్రవేశించామని చెప్పారు. 2020 జూన్‌లో టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవల్ని ప్రారంభించామనీ, రోజుకు 14వేల పార్సిళ్లను గమ్యస్థానాలకు చేరుస్తున్నామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 37.31 లక్షల పార్సిళ్ల బట్వాడా చేశామన్నారు. సమీప రాష్ట్రాల్లోని 88 ప్రాంతాల్లో కూడా ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. 364 మంది ఏజెంట్ల ద్వారా 192 ప్రత్యేక వాహనాలతో కార్గో సర్వీసులు నిర్వహిస్తున్నామన్నారు. రవాణారంగంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయనీ, దానికి అనుగుణంగా అవసరాలను బట్టి బస్సు డిజైన్లలో మార్పులూ అవసరమని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖలు టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవల్ని వినియోగించుకుంటున్నాయనీ, ప్రయివేటు నుంచి కూడా ఊహించినదానికంటే ఎక్కువ రెస్పాన్స్ వస్తున్నదని వివరించారు. టీఎస్ఆర్టీసీ సేవలపై ప్రజలు, ప్రయాణీకులు, వినియోగదారులు సంస్థకు తప్పనిసరిగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలనీ, దీనివల్ల సేవల్ని మరింత విస్తృత పరచడంతో పాటు, మెరుగైన నిర్వహణ సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగాధిపతి సంతోష్‌కుమార్, హన్నా గ్రూప్ ఆఫ్ కన్సల్టెన్సీ ప్రతినిధులు త్రినాధ్‌బాబు, శ్రవణ్‌కుమార్, చీఫ్ మేనేజర్ (ఫైనాన్స్) పుష్పకుమారి, చీఫ్ మెకానికల్ ఇంజినీర్ రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం


బీబీసీ వర్సెస్ బీజేపీ

"ఇండియా: ద మోడీ క్వశ్చన్" -ఈ నెల 17న ప్రసారమైన ఈ డాక్యుమెంటరీ మొదటి భాగం దేశంలో ప్రకంపనలు సృష్టించింది. అవి ఇంకా కొనసాగుతుండగానే ఈనెల 24న రెండవ భాగమూ ప్రసారమైంది. ఇది మరింత అలజడి రేకెత్తిస్తోంది. ప్రత్యేకించి ఈ బీబీసీ ప్రొడక్ట్ బీజేపీని తీవ్రమైన కలవరానికి గురిచేస్తున్నట్టుంది. అందుకే ఈ డాక్యుమెంటరీని

"ఇంకా ఆకాశవాణీలు, దూరదర్శన్‌లు ఎందుకు? అందరూ బీబీసీ వైపు చూస్తున్నారు" అన్నారాయన. ఇప్పుడేమో అదే బీబీసీపై విరుచుకుపడుతున్నారు? ఈ తతంగమంతా చూస్తూ కూడా "వీరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆధారాలను పాతరేసినందున దోషులుగా చిక్కకుండా తప్పించుకున్నారే తప్ప నేరం చేయనందున కాదు" అనే అభిప్రాయాలను ఎలా కొట్టిపారేయగలం..!

తొలగించాలని ఒకవైపు సామాజిక మాధ్యమాలకు ఆంక్షలు విధిస్తూనే, మరోవైపు వీక్షకులపై నిర్బంధాలకు పూనుకుంటోంది. ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, మన హైద్రాబాద్ సెంట్రల్ యునివర్సిటీతో సహా దేశంలో పలు యూనివర్సిటీల్లో పోలీసులు ఈ ప్రదర్శనలను నిలిపేయడంతో పాటు, విద్యార్థులపై అసాంఘిక శక్తులు దాడులకూ తెగబడుతుండటం ఇందుకు నిదర్శనం.

ఇంతకీ ఈ బీబీసీ డాక్యుమెంటరీ ఏం చెప్పిందీ? బీజేపీ ప్రభుత్వమూ, పార్టీ ఎందుకింత బెంబేలెత్తుతున్నాయీ? ఒకసారి పరిశీలించాలి. "గుజరాత్ మారణకాండ రాజకీయ ప్రేరేపితమైనది. ప్రభుత్వ రక్షణలోనే విహెచ్‌పీ ఈ ఊచకోతకు నాయకత్వం వహించింది. వెల్లడైనదానికంటే ఎక్కువ హింస చెలరేగింది. దాదాపు రెండువేల మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, లక్షా ముప్పదిఎనిమిది వేల మంది నిరాశ్రయులయ్యారు. ఓ పథకం ప్రకారం జరిగిన ఈ హింసలో నిర్దిష్ట జాతి నిర్మూలనా లక్షణాలన్నీ ఉన్నాయి. శిక్షలేమీ ఉండవనే ప్రభుత్వ హామీ లేకుండా విహెచ్‌పీ ఇంత అరాచకానికి వొడిగట్టేది కాదు. దీనికి నేరుగా నాటి ముఖ్యమంత్రి నరేంద్రమోడీయే బాధ్యుడు." -స్థూలంగా భారత్‌లోని బ్రిటిష్ రాయబార కార్యాలయం నివేదిక సారాంశమిది. ఈ నివేదిక ఆధారంగానే బీబీసీ డాక్యుమెంటరీ రూపొందింది.



సాధారణంగా ఏ దేశంలోనైనా ఇలాంటి అవాంఛనీయమైన దారుణ ఉదంతాలు జరిగినప్పుడు, ఆ దేశంలో ఉన్న విదేశీ రాయబార కార్యాలయాలన్నీ ఆ సమాచారంతో తమ తమ దేశాలకు నివేదికలు అందిస్తాయి. అలా మన దేశంలోని బ్రిటిష్ రాయబార కార్యాలయం అందించిన నివేదికలోని అంశాలనే ఈ బీబీసీ డాక్యుమెంటరీ రూపంలో ప్రసారం చేసింది. బీబీసీ చెప్పింది అసత్యమైతే బీజేపీ ఖండించవచ్చు. తాము చెప్పదలచుకున్న సత్యమేదో వెల్లడించవచ్చు. అలా చేయకుండా ఇలా విపరీత పోకడలకు పోవడమేమిటి? దర్యాప్తు సంస్థలేవీ ఆధారాలు చూపలేకపోయాయనీ, సుప్రీం కోర్టు సైతం తమకు క్లీన్‌చిట్ ఇచ్చిందనీ చెప్పుకునేవారు ఇంతగా బెంబేలెత్తిపోవడమేమిటి? అంటే బీబీసీ చెప్పిందే నిజమా? అందుకే ఆత్మరక్షణలో పడిపోయారా? కాదంటే బీజేపీ ఈ చర్యలకు అర్థమేమిటి?

ఇదంతా ప్రధాని మోడీని అప్రతిష్టపాలు చేసే కుతంత్రమనీ, ఈ కథనం బ్రిటిషు వలసవాద దృక్పథాన్నే ప్రతిబింబిస్తోందనీ ప్రభుత్వంతో సహా పాలకనేతలంతా ఆరోపిస్తున్నారు. తప్పులేదు. తమ అభిప్రాయాన్ని చెప్పుకునే హక్కు, తమ వాదన వినిపించే అవకాశం వారికెప్పుడూ ఉంటుంది. కానీ సోషల్ మీడియాపై ఈ ఆంక్షలెందుకు? విశ్వవిద్యాలయాల మీద, వీక్షిస్తున్న విద్యార్థుల మీద ఈ ఆగడాలెందుకు? అయినా బీబీసీ చెప్పినంత మాత్రానికే వీరేమీ దోషులైపోరు. అలాగే న్యాయస్థానాలు తేల్చలేకపోయినంత మాత్రాన నిర్దోషులూ కారు. అసలు నిజాలను ప్రజలు తమ అనుభవం నుండి తేల్చుకుంటారు. ఎవరేమి చెప్పినా గుజరాత్ నెత్తుటి గాయాలు ఓ కాదనలేని సత్యం. అవి ఇంకా ప్రజల మది నుండి చెదిరిపోలేదు. "ముఖ్యమంత్రిగా మోడీ రాజధర్మం పాటించలేదు" అన్న నాటి ప్రధాని వాజ్‌పాయి మాటలు ఈ దేశమేమీ మరిచిపోలేదు. బిల్కిస్ బానోపై క్రూరమైన అత్యాచారం చేసి, ఆమె కుటుంబాన్ని కిరాతకంగా నరికి చంపిన నేరస్థులేమో విడుదలై వీధుల్లో తిరుగుతున్నారు..! ఆ కిరాతకాలకు ప్రత్యక్ష సాక్షిగా సత్యం కోసం నిలబడినందుకు ఐపీఎస్ ఆఫీసర్ సంజయ్‌భట్ మాత్రం యావజ్జీవ ఖైదీగా చెరసాల పాలయ్యారు. ఇవన్నీ ప్రజల గమనంలో లేవనుకుంటే పొరపాటు. కాబట్టి, ఈ రోజు కాకపోతే రేపైనా దోషులెవరో వారే తేలుస్తారు.

కానీ, మాట్లాడితే ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ గురించి, నాడు ప్రచార మాధ్యమాలపై, పౌరస్వేచ్ఛపై సాగిన నిర్బంధ విధానాల గురించీ విమర్శించే ప్రధాని నేడు తాను చేస్తున్నదేమిటి? నేడు పౌరసమాజంలో, సోషల్‌మీడియాలో ఈ బీబీసీ కథనంపై, బీజేపీ తీరుపై ఇంత చర్చ జరుగుతున్నా మన ప్రధాన స్రవంతి మీడియా నోళ్లు పెగలడం లేదెందుకు? ఈ సందర్భంలో నాటి ఎమర్జెన్సీ పరిస్థితులపై విచారణ జరిపిన జస్టిస్ షా చేసిన వ్యాఖ్య ఒకటి గుర్తుకు రాక మానదు. "ఇందిరాగాంధీ పత్రికల వారిని కాస్త వంగండి అని అడిగారు. కానీ వారు ఏకంగా ఆమెకు సాగిలబడ్డారు" అన్నారాయన. ఇప్పుడూ అదే జరుగుతోందంటున్నారు ప్రఖ్యాత పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్. "మన దేశంలో పత్రికలు, ప్రసార మాధ్యమాల పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఎప్పుడూ లేదని" విచారం వ్యక్తం చేస్తున్నారాయన. అంతెందుకు 2013లో మోడీ చేసిన ఓ ట్వీట్ కూడా ఇప్పుడు ప్రస్తావనకొస్తోంది. కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయన్న ఉద్దేశంతో... "ఇంకా ఆకాశవాణీలు, దూరదర్శన్‌లు ఎందుకు? అందరూ బీబీసీ వైపు చూస్తున్నారు" అన్నారాయన. ఇప్పుడేమో అదే బీబీసీపై విరుచుకుపడుతున్నారు? ఈ తతంగమంతా చూస్తూ కూడా "వీరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆధారాలను పాతరేసినందున దోషులుగా చిక్కకుండా తప్పించుకున్నారే తప్ప, నేరం చేయనందున కాదు" అనే అభిప్రాయాలను ఎలా కొట్టిపారేయగలం..!

గవర్నర్ ప్రసంగం రాజ్యాంగబద్ధమైనది

జనవరి 9, 2023న తమిళనాడు అసెంబ్లీలో శాసనసభ్యులను ఉద్దేశించి సాంప్రదాయంగా చేయాల్సిన తన మొదటి ప్రసంగ పాఠంలో గవర్నర్ ఒక ముఖ్యమైన, రాజ్యాంగ ప్రాధాన్యత గల ఒక పేరాను చదవకుండా దాటేయడంతో వివాదం చెలరేగింది.

ఆ పేరా తమిళనాడులో రాజకీయ, సాంస్కృతిక ప్రాధాన్యత గల ద్రవిడ నమూనా పాలనను సూచించింది. ప్రస్తుత గవర్నర్‌కు, ద్రవిడ నమూనా పాలన లేదా రాజకీయ లేదా దాని గత సాంస్కృతిక భావనకు ఎలాంటి భావోద్వేగపూరితమైన సంబంధం లేదు. అది ఆయన ఉపన్యాసాలు, పరిశీలనల ద్వారా స్పష్టంగా అర్థమవుతుంది. ఇక్కడ సమస్య ఒక ప్రత్యేకమైన రాజకీయ భావజాలం లేదా సాంస్కృతిక సాంప్రదాయం పట్ల గవర్నర్ ఇష్టాలు, అయిష్టాల గురించి కాదు కానీ, రాజ్యాంగ అధికారం తన రాజ్యాంగ సంబంధిత బాధ్యతల్ని నిర్వర్తించే క్రమంలో బాగా స్థిరపడిపోయిన, తప్పనిసరిగా పాటించాల్సిన రాజ్యాంగబద్ధమైన ఆచరణలను ఉల్లంఘిస్తుందా అన్నదే సమస్య.


పి.డి.టి.ఆచారి

ఇది పూర్తి ప్రసంగం

రాజ్యాంగంలోని ఆర్టికల్ 176 ప్రకారం, ప్రతి సంవత్సరం శాసనసభ మొదటి సమావేశాన్ని పురస్కరించుకుని శాసనసభ్యులను ఉద్దేశించి గవర్నర్ తప్పకుండా ప్రసంగించి, సమావేశ పిలుపునకు గల కారణాలను వారికి తెలియజేయాలి. ఈ ప్రసంగంలో సూచించబడిన అంశాలను శాసనసభ చర్చించాలని రెండవ

గవర్నర్లు కేవలం మంత్రిమండలి సలహా, సంప్రదింపులపై మాత్రమే తమ బాధ్యతలు నిర్వహించాలని, ఎన్నికైన ప్రభుత్వాన్ని లక్ష్యపెట్టకుండా స్వతంత్రంగా ఎలాంటి కార్యనిర్వాహక అధికారాలను చెలాయించలేరని సుప్రీంకోర్టు పేర్కొంది. "ఇలా నియమించబడిన వ్యక్తి రాష్ట్ర శాసనసభలను ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధులపై, ముఖ్యమంత్రి నాయకత్వం వహించే మంత్రి మండలి కింద పని చేసే ప్రభుత్వ కార్యనిర్వాహక వర్గంపై అధికారాన్ని చెలాయించ కూడదని" నబమ్ రిబియా కేసులో కోర్టు పేర్కొంది.

నిబంధన చెపుతుంది. ఇక్కడ "ప్రసంగం" అంటే పూర్తి ప్రసంగం. దాటవేయగా పోను మిగిలిన భాగం కాదు. అందువలన, శాసనసభ్యుల ముందు గవర్నర్ చదివేదే పూర్తి ప్రసంగం. దానిలో పేర్కొన్న అంశాలు మొత్తం సభలో సభ్యులందరూ తప్పకుండా చర్చించాలి.

ఇక్కడ, గవర్నర్ ప్రసంగంలోని అంశాలు మొత్తం చర్చించడానికి తగిన సమయం కలిగి ఉండే విధంగా మన రాజ్యాంగం శాసనసభకు నిర్దిష్టమైన మార్గదర్శకాలను జారీ చేస్తుంది. గవర్నర్ ప్రసంగానికి ఉండే ప్రాధాన్యతను రాజ్యాంగం నొక్కి చెపుతుంది.

శాసనసభను ఉద్దేశించి ప్రసంగించేందుకు గవర్నర్ శాసనసభ్యులు హాజరుకావాలని కోరవచ్చని చెప్పే ఆర్టికల్ 175ను పరిగణలోకి తీసుకుంటే మనకు ఇంకా స్పష్టమవుతుంది. ఆర్టికల్ 175 ప్రకారం తన ప్రసంగానికి హాజరుకావాలని గవర్నర్ కోరే అంశం, ఆర్టికల్ 176 వలె సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాల్సిన అంశం కాదు. ఆర్టికల్ 175 ప్రసంగంలోని అంశాలను చర్చించాల్సిన అవసరం లేదు కానీ, ఆర్టికల్ 176 ప్రకారం గవర్నర్ చేసిన ప్రసంగంలోని అంశాలపై ఖచ్చితంగా సభలో చర్చ జరగాలి. ఒకే రాజ్యాంగం ప్రకారం జరిగే రెండు ప్రసంగాల మధ్య ఉండే తేడాను మన రాజ్యాంగం కలిగి ఉండడం వెనుక ఉన్న కారణం ఏమంటే ఆర్టికల్ 176 ప్రకారం చేసే ప్రసంగంలో శాసనసభకు జవాబుదారీగా ఉండే ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, దాని కార్యక్రమాల గురించి ఉంటాయి. ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధులకు కార్యనిర్వాహక వర్గం జవాబుదారీగా ఉండడం అనేది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ముఖ్యసారం.

కాబట్టి, ప్రతి సంవత్సరం జరిగే శాసనసభ మొదటి సమావేశంలో శాసనసభ్యులను ఉద్దేశించి గవర్నర్ తప్పకుండా చేసే ప్రసంగం ద్వారా ప్రభుత్వం, ఆ సంవత్సరం తలపెట్టే ప్రధానమైన శాసనసభా కార్యక్రమాలు, గత సంవత్సరం తమ ప్రభుత్వం సాధించిన విజయాలు, భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాల రూపురేఖల వివరాలను తెలియజేస్తుంది. ప్రభుత్వం తన కార్యక్రమాలు, విధానాలను గవర్నర్ ద్వారా శాసనసభకు తెలియజేస్తుంది. ఆ విధంగా ఆర్టికల్ 176 అంత ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది.

గవర్నర్ ప్రసంగానికి రాజ్యాంగం అంతటి ప్రాధాన్యత ఇస్తుంటే గవర్నర్ దానిని తిరస్కరిస్తూ, ప్రసంగ పాఠంలోని కొన్ని భాగాలను చదవకుండా దాటేసి, తన స్వంత అభిప్రాయాలను జోడించవచ్చా?

ప్రసంగంలోని పేరాలను దాటేయడం అంటే గవర్నర్ ప్రభుత్వ ఆలోచనలను, భావనలను ఆమోదించడం లేదని అర్థం. ఆర్టికల్ 176 ప్రకారం గవర్నర్ చేసే ప్రసంగం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగం అనే విషయం భారతదేశంలో రాజ్యాంగ వ్యవస్థ గురించి ఎరిగిన వారెవరికైనా తెలిసిన విషయమే. ఆ ప్రసంగంలో గవర్నర్ వ్యక్తిగతమైన అంశాలకు తావులేకుండా కేవలం ఎన్నికైన ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు మాత్రమే ఉంటాయి. ఆ ప్రసంగానికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందిగానీ, గవర్నర్ బాధ్యత వహించడు. గవర్నర్ తన స్వంతంగా ఒక్క పదాన్ని కూడా మార్చకూడదు. కాబట్టి, ప్రసంగ పాఠంలోని కొన్ని భాగాలను ఉద్దేశ్యపూర్వకంగానే చదవకుండా గవర్నర్ ఆర్టికల్ 176కు విరుద్ధంగా వ్యవహరించాడు. శాసనసభ్యులు సృష్టించే అలజడి, గందరగోళం కారణంగా గవర్నర్ ప్రసంగ పాఠాన్ని పూర్తిగా చదవలేక పోవడం అనే విషయంవేరు. ప్రసంగంలో పేర్కొన్న అంశాలను విభేదించి, తన వ్యక్తిగత అభిప్రాయాలను చేర్చేందుకు రాజ్యాంగం గవర్నర్‌ను అనుమతించదు కాబట్టి ఆయన ప్రసంగంలోని కొన్ని భాగాలను ఉద్దేశ్యపూర్వకంగా దాటేయకూడదు.

కొన్ని ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో గవర్నర్ల చర్యలు తరచుగా విమర్శలకు గురవుతున్నాయి. రాష్ట్ర శాసనసభ తీర్మానించిన బిల్లును ఎటూ తేల్చకుండా తొక్కి పట్టడం, రాజ్యాంగం కల్పించిన ఎంపికల(ఆప్షన్స్)పై ఎలాంటి కసరత్తు చేయకపోవడం, మొత్తం శాసనసభ కసరత్తును నిలిపివేయడం అనేది రాజ్యాంగ ఉల్లంఘనే అని స్పష్టం అవుతున్నది. రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసిన బిల్లులను తొక్కిపట్టే అనుమతిని రాజ్యాంగం గవర్నర్ కు కల్పించలేదు. బిల్లుల ఆమోదం కోసం గవర్నర్లకు ఎలాంటి కాలపరిమితిని నిర్దేశించకపోవడం వల్ల ఆర్టికల్ 200లో ఉన్న ఏ ఎంపికలను పరిగణలోకి తీసుకోకుండా బిల్లును



తొక్కి పట్టవచ్చనే భావనలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఇది రాజ్యాంగ నిబంధనలను తప్పుగా అర్థం చేసుకోవడమే అవుతుంది. ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్ బిల్లుకు ఆమోదం తెలుపవచ్చు లేదా ఆమోదాన్ని నిలిపివేయడం లేదా బిల్లును వెనక్కి తిప్పి పంపవచ్చు. తిప్పి పంపించబడిన బిల్లును ఎలాంటి మార్పులు చేయకుండా మళ్ళీ అసెంబ్లీ తీర్మానం చేస్తే గవర్నర్ ఆ బిల్లును ఆమోదించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలన కోసం కూడా పంపవచ్చు. కానీ గవర్నర్ బిల్లులను తొక్కిపట్టి, అసెంబ్లీ చేసే శాసనాల కసరత్తును నిలిపివేయకూడదని ఆర్టికల్ 200 స్పష్టంగా తెలియజేస్తుంది.

ఇప్పుడొక బహిరంగ సవాల్

రాజ్యాంగ స్థానాలను ప్రశ్నించడానికి, సవాల్ చేయడానికి చేసిన ప్రయత్నాల కారణంగానే ఈ సమస్యలన్నీ ఉత్పన్నం అవుతున్నాయి. గవర్నర్లు

"మంత్రి మండలి సలహాకు వ్యతిరేకంగా వెళ్లే విధంగా గవర్నర్లను అనుమతించడం ద్వారా రాష్ట్రంలో ఒక సమాంతర పాలనను సమకూర్చే లక్ష్యం మన రాజ్యాంగానికి లేదని" షంషేర్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మన వ్యవస్థ యొక్క సమగ్రతను కాపాడాలనుకుంటే ఇలాంటి వివేకవంతమైన వ్యాఖ్యానాలను ఆలకించాలి. రాజ్యాంగ అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా హద్దులు దాటి, వ్యవస్థను దెబ్బతీయాలని అనుకుంటే, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది.

అకస్మాత్తుగా ముఖ్యమంత్రులను, రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శించడం మొదలుపెట్టారు. కొందరు గవర్నర్లు ఆఖరికి ముఖ్యమంత్రులపై దాడి చేయడానికి ప్రెస్ కాన్ఫరెన్స్‌లు కూడా నిర్వహిస్తున్నారు. గవర్నర్లకు సంబంధించిన అసంతృప్తి బహిరంగంగా వ్యక్తం అవుతున్నది. ఏ నిర్ణయాలు చేయక రాజ్‌భవన్‌లలో బిల్లులు కుప్పలు కుప్పలుగా పేరుకొని పోతున్నాయి. షంషేర్ సింగ్ (1974) నుండి నబమ్ రిబియా (2016) వరకు, గవర్నర్లు కేవలం మంత్రిమండలి సలహా, సంప్రదింపులపై మాత్రమే తమ బాధ్యతలు నిర్వహించాలని, ఎన్నికైన ప్రభుత్వాన్ని లక్ష్యపెట్టకుండా స్వతంత్రంగా ఎలాంటి కార్యనిర్వాహక అధికారాలను చెలాయించలేరని సుప్రీంకోర్టు పేర్కొంది. "ఇలా నియమించబడిన వ్యక్తి రాష్ట్ర శాసనసభలను ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధులపై, ముఖ్యమంత్రి నాయకత్వం వహించే మంత్రి మండలి కింద పని చేసే ప్రభుత్వ కార్యనిర్వాహక వర్గంపై అధికారాన్ని చెలాయించ కూడదని" నబమ్ రిబియా కేసులో కోర్టు పేర్కొంది.

"మనం అనుకుంటున్న విధంగా, రాజ్యాంగం సూత్రబద్ధంగానే ఉండాలని అనుకుంటే, గవర్నర్లు పూర్తిగా రాజ్యాంగబద్ధమైన గవర్నర్‌గా, రాష్ట్రాల పాలనాపరమైన విషయాల్లో జోక్యం చేసుకునే ఎలాంటి అధికారం లేదని" బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ పరిషత్‌లో అన్నారు.

"మంత్రి మండలి సలహాకు వ్యతిరేకంగా వెళ్లే విధంగా గవర్నర్లను అనుమతించడం ద్వారా రాష్ట్రంలో ఒక సమాంతర పాలనను సమకూర్చే లక్ష్యం మన రాజ్యాంగానికి లేదని" షంషేర్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మన వ్యవస్థ యొక్క సమగ్రతను కాపాడాలనుకుంటే ఇలాంటి వివేకవంతమైన వ్యాఖ్యానాలను ఆలకించాలి. రాజ్యాంగ అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా హద్దులు దాటి, వ్యవస్థను దెబ్బతీయాలని అనుకుంటే, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది.

("ద హిందూ" సౌజన్యంతో)
అనువాదం:బోడపట్ల రవీందర్,సెల్: 9848412451



ప్రయివేటుతో అభివృద్ధి... ఉద్యోగాలు సాధ్యమేనా?

ప్రపంచంలోని పెట్టుబడులలో ఎక్కువ శాతాన్ని దేశంలోకి ఆకర్షిస్తామని, తద్వారా 2025 నాటికి ఐదు లక్షల డాలర్ల ఆర్థికాభివృద్ధిని సాధిస్తామని, దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానానికి తీసుకెళతామని, లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని (సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామనే మాటను ఎప్పుడో చాపకిందికి నెట్టేశారు) మోడీ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేస్తున్నది. ప్రభుత్వరంగం అవసరం లేదని, ప్రయివేటు రంగంతోనే దేశాభివృద్ధిని సాధిస్తామని చెబుతున్నారు. అందుకోసం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేయటం, జాతీయ ద్రవీకరణ పథకం ద్వారా లీజుకివ్వటం తదితర విధానాల ద్వారా ఆర్థికవ్యవస్థ మొత్తాన్ని బహుళజాతి, కార్పొరేట్ సంస్థల చేతులలో పెడుతున్నారు. తమ యజమానులైన ద్రవ్య పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చటం, హిందూత్వ విధానాలను ముందుకు తీసుకుపోవటమే లక్ష్యంగా ఈ విధానాలను అమలు జరుపుతున్నారు.

బహుళజాతి కంపెనీల్లో భారీ తొలగింపులు

కేవలం లాభాలను పెంచుకోవాలనే లక్ష్యంతో కొన్ని బడాసంస్థలు ఏ విధంగా ఉద్యోగులను తొలగిస్తున్నాయో చూద్దాం. బడా సంస్థలలో ఒకటైన అమెజాన్ 18,000మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది మొత్తం ఉద్యోగులలో 6శాతం. సాఫ్ట్‌వేర్ సంస్థ సేల్స్‌ఫోర్స్ 8,000 (10శాతం) మందిని తొలగించింది. గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ 1.86లక్షల మంది ఉద్యోగులలో 5.35శాతం మందిని తొలగించింది. ట్విట్టర్ 50శాతం మందిని తొలగించింది. తన ఆస్తిలో 90శాతం దానం చేసినట్లు గొప్పగా ప్రచారం చేసుకున్న మార్క్ జుకర్‌బర్గ్ పోటీ పెరిగి ఆదాయం తగ్గిందనే పేరుతో మెటా (ఫేస్‌బుక్) నుండి 11,000మంది (13శాతం) ఉద్యోగులను లే ఆఫ్ చేశాడు. ట్విట్టర్‌ను కొనుగోలు చేసిన ఎలన్ మస్క్ ఆ సంస్థలోని 3,700మందిని (మొత్తం ఉద్యోగులలో 50శాతం), భారతదేశంలో పనిచేస్తున్న ఉద్యోగులలో 90శాతం మందిని లే ఆఫ్ చేశాడు. ప్రపంచంలో పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఒకటైన మైక్రోసాఫ్ట్ 3000మంది ఉద్యోగులను తొలగించింది. ఖర్చులను తగ్గించుకోవాలన్న పేరుతో అమెరికన్ కంపెనీ హెచ్‌పి 2025 నాటికి 6,000 మందిని (మొత్తం ఉద్యోగులలో 10శాతం) తొలగించటానికి పథకం రూపొందించింది. అదే పేరుతో జొమాటో 2022లో 600మందికి పైగా ఉద్యోగులను తొలగించింది. బెటర్ డాట్‌కాం సంస్థ 2021 డిసెంబరు నుండి 4,100 మందిని తొలగించింది. ప్రపంచంలో అతి పురాతనమైన కార్ల తయారీ సంస్థ ఫోర్డ్ 3,800 మందిని లే ఆఫ్ చేసింది. ఇదే దారిలో... రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్, రాబిన్‌హుడ్, నెట్‌ఫ్లిక్స్, యూనిలివర్, టెస్లా... వంటి అనేక సంస్థలు లే ఆఫ్ చేశాయి. దేశంలో విద్యారంగంలోని అతి పెద్ద కంపెనీ అయిన బైజూస్ 2500 మంది ఉద్యోగులకు లే ఆఫ్ ఇచ్చింది. ఈ సంస్థలన్నీ శత కోటీశ్వరుల చేతులలోనే ఉన్నాయి. లాభాలు సంపాదిస్తున్నాయి. అయినప్పటికీ కేవలం లాభాలను మరింతగా పెంచుకోవటం కోసమే ఉద్యోగులను తొలగిస్తున్నాయి.

ఉన్నవారినే తొలగిస్తుంటే కొత్త ఉద్యోగాలు ఎలా?

దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రయివేటీకరిస్తామని మోడీ ప్రకటించారు. ప్రయివేటు సంస్థలు ఉద్యోగులను ఏ విధంగా తొలగిస్తున్నాయో పైన చూశాం. ప్రయివేటీకరణ వలన దేశంలోకి పెట్టుబడులు వస్తాయని, తద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని చెబుతున్నారు. కాని బడా పెట్టుబడిదారులు దేశంలో ఏర్పాటు చేస్తున్న కొత్త పరిశ్రమలను వేళ్ళపై లెక్కపెట్టవచ్చు. విదేశీ పెట్టుబడిదారులు దేశంలో ఒక పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారంటే మా రాష్ట్రంలో పెట్టండి అంటే మా రాష్ట్రంలో పెట్టండి అని రాష్ట్రాల ముఖ్యమంత్రులు వెంట పడటం చూస్తున్నాం. ప్రయివేటీకరణ వలన పెట్టుబడులు వస్తాయనటం ఎంత బూటకమో ఇది స్పష్టం చేస్తున్నది. అయినా దేశంలోకి పెట్టుబడులు రావటం వలన కొత్త పరిశ్రమల ఏర్పాటు, కొత్త ఉద్యోగావకాశాల సంగతి కాసేపు పక్కనబెడ్దాం. కాని ఉన్న పరిశ్రమలు ప్రభుత్వం నుండి ప్రయివేటు వారి చేతుల్లోకి పోతే కొత్త ఉద్యోగాలెలా వస్తాయి? ప్రయివేటు సంస్థలు ఉన్న ఉద్యోగులనే తొలగిస్తుంటే కొత్తవారికి ఉద్యోగాలెలా ఇస్తాయి?

నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలంటే ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ-ప్రయివేటు సంస్థల మధ్య వ్యత్యాసం ఏమిటనేది ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నది. సంక్షోభం పేరుతో ప్రైవేటు సంస్థలు ఉద్యోగులను తొలగిస్తున్నా ఒక్క ప్రభుత్వరంగ సంస్థ కూడా ఉద్యోగులను తొలగించలేదు. కారణం ప్రభుత్వరంగ సంస్థలు కేవలం లాభాల కోసం మాత్రమే కాక, సామాజిక బాధ్యతతో పనిచేస్తున్నాయి. అందువలన ప్రయివేటు సంస్థల వలె కార్మికులు, ఉద్యోగులను తొలగించటం లేదు. ఉద్యోగులను తొలగించక పోయినప్పటికీ ఆ సంస్థలు నష్టాలపాలు కావటం లేదు. కేవలం లాభాలు తగ్గటం మాత్రమే జరుగుతుంది. ప్రయివేటు సంస్థలకు ఏ సామాజిక బాధ్యత లేదు కాబట్టే లాభాలు వస్తున్నప్పటికీ ఇష్టం వచ్చినట్లు ఉద్యోగులు, కార్మికులను తొలగిస్తున్నాయి.

కార్పొరేట్ సంస్థలతో అభివృద్ధి, ఉద్యోగ కల్పన జరగదు. బహుళజాతి, కార్పొరేట్ సంస్థలకు మన దేశాభివృద్ధి పట్టదు. వారికి లాభాలే ప్రధానం. లాభాలు వస్తాయనుకుంటే అభివృద్ధిని అడ్డుకోవటానికి, దేశాభివృద్ధిని దెబ్బ తీయటానికి కూడా వారేమాత్రం వెనుకాడరు. ఉద్యోగాల కల్పన సంగతి అటుంచి తమకు లాభాలు వస్తున్నప్పటికీ వాటిని ఇంకా పెంచుకోవటం కోసం ఉన్న ఉద్యోగులను కూడా తొలగిస్తారు. అటువంటి వారిని నమ్ముకొని దేశాన్ని అభివృద్ధి చేస్తామని, ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పటం అంటే కుక్క తోక పట్టుకొని గోదావరి ఈదినట్టే.

దేశంలో అభివృద్ధి జరగాలన్నా, నిరుద్యోగం తగ్గాలన్నా పెద్దసంఖ్యలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పడాలి. వాటికి ముడి సరుకులు, మార్కెట్, రుణాలు తదితరాలలో ప్రభుత్వం సహకారం అందించాలి. బడా సంస్థల నుండి ఎదురయ్యే పోటీ నుండి రక్షణ కల్పించాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎంత ఎక్కువగా ఏర్పాటైతే అంత ఎక్కువ మందికి ఉద్యోగాలు లభిస్తాయి. దేశాభివృద్ధి జరుగుతుంది. అంతే తప్ప ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ, విదేశీ పెట్టుబడులపై ఆశలు పెంచుకొన్నంత కాలం నిరుద్యోగం తగ్గదు. దేశాభివృద్ధి జరగదు.

- ఎ. కోటిరెడ్డి

మెయిల్ @ నవతెలంగాణ

'ఆన్‌లైన్' డిబెట్

సామాజిక మాధ్యమాల్లో రాజకీయ చర్చలు పెరిగాయి. ఎన్నికల సంవత్సరం కావడంతో ఆయా రాజకీయ పార్టీల మద్దతుదారులతో పెట్రేగి పోతున్నాయి. నువ్వా-నేనా అన్నట్టుగా దీర్ఘంగా చర్చలు జరుగుతున్నాయి. ధరల పెరుగుదల నుంచి ప్రతి విషయంపై ఎవరు కారకులనే దానిపై ఒకరిపై ఒకరు విరుచుకుపడుతున్నారు. సమస్యలకు రాష్ట్రంలోని బీఆర్ఎస్ సర్కార్ దే బాధ్యత అంటూ ఒకరు పోస్ట్ పెడితే, వెంటనే కాదు... కాదు కేంద్రంలోని బీజేపీ సర్కారే కారణమని మరొకరు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల నుంచి రాష్ట్ర విభజన హామీలు, వందే భారత్ ఎక్స్‌ప్రెస్... ఇలా ఒకటేమిటీ? దొరికిందే అంశమంటూ దానిపై డిబేట్‌లు కొనసాగిస్తున్నారు. ఆన్‌లైన్‌లో జరుగుతున్న ఈ చర్చలతో ఉపయోగ ముంటున్నా... కొన్ని సార్లు నాయకుల పట్ల వ్యక్తిగత వీరాభిమానం ప్రదర్శిస్తూ గుడ్డిగా సమర్థించుకునే వారు రెచ్చిపోతున్నారు. మధ్యలో శాంతిదూతల్లా ప్రవేశించే వారు అలాంటి చర్చలొద్దంటూ ముగింపు పలుకుతున్నారు. విద్య, వైద్యం, జీవనోపాధి, ఉద్యోగాల కల్పన తదితర ప్రజావసరాలపై జరుగుతున్న చర్చలు ఆయా రాజకీయ పార్టీల విధానాలను సామాన్యులు అర్థం చేసుకునే దిశగా ఉంటున్నాయి. అదే సమయంలో ఆయా చర్చలను పక్కదారి పట్టించేలా భావోద్వాగాలను రెచ్చగొట్టే అంశాలను చర్చకు పెట్టే వారు ఆయా గ్రూపుల్లోకి చేరి చర్చలను పక్కదారి పట్టిస్తున్నారు. వాట్సప్ గ్రూపుల అడ్మిన్ చర్చలను పక్కదారి పట్టకుండా నియంత్రిస్తే సామాన్యులు మరింత చైతన్య వంతులయ్యేందుకు సామాజిక మాధ్యమాలు దోహదపడే అవకాశముంది.

-కొత్తూరు ప్రియకుమార్

బడ్జెట్ ఎవరి కోసం?

భారతదేశ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు భయంకరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్న తరుణంలో ఫిబ్రవరి 1వ తేదీన 2023-24 సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్ ముందు ప్రవేశపెట్టనున్నారు. ఆర్థిక పరిస్థితి గురించి మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ... కోవిడ్ మహమ్మారి వల్ల, భారత ప్రభుత్వం దాన్ని ఎదుర్కొన్న వినాశకరమైన తీరుతో తలెత్తిన దారుణమైన ప్రభావాల నుండి దేశ ఆర్థిక వ్యవస్థ ఇంకా కోలుకోవాల్సి ఉంది.

గత బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుండి, ఉక్రెయిన్‌లో సైనిక ఘర్షణ తలెత్తడం, పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలతో అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితులు మరింత అధ్వాన్నంగా తయారయ్యాయి. అయినా, తాత్కాలికంగా ఏర్పడిన ప్రపంచ మాంద్యాన్ని ఎదుర్కొనడానికి భారత్ సన్నద్ధం కావాల్సి ఉంది. పైగా, తాత్కాలికంగా ఏర్పడిన ఆర్థిక మాంద్యాన్నే కాకుండా ప్రపంచీకరణ సిద్ధాంతంలో ఉన్న వైరుధ్యాల ఫలితంగా దీర్ఘకాలం కొనసాగే పెట్టుబడిదారీ సంక్షోభాన్ని కూడా భారత్ ఎదుర్కొనాల్సి ఉంది. వ్యవసాయ సంక్షోభం, వేతనాల స్తంభన, వీటికి తోడు అధిక వృద్ధి దశలతో పాటు పెరుగుతున్న నిరుద్యోగ సమస్య, ఉపాధి పొందిన కార్మికవర్గాన్ని కూడా తీవ్రంగా దోచుకోవడానికి దారి తీయడం, అసమానతల్లో తీవ్రమైన పెరుగుదల వంటి వైరుధ్యాలను భారతదేశ ఆర్థికాభివృద్ధి కూడా ప్రతిబింబిస్తోంది. ఈ పరిస్థితులపై ఆధారపడిన పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమం, ఈ పరిస్థితులు కల్పించిన డిమాండ్ సమస్యల కారణంగానే దాని ఊపును, ఉత్తేజాన్ని కోల్పోతూ వస్తోంది. కోవిడ్ మహమ్మారి తలెత్తడానికి ముందు కూడా ఈ పరిస్థితి నెలకొనడం కనిపిస్తోంది. తొలుత వేసిన ముందస్తు అంచనాల ప్రకారం, 2022-23లో భారతదేశ వాస్తవిక తలసరి జాతీయాదాయం కరోనా మహమ్మారికి ముందు 2019-2020 స్థాయి కన్నా కేవలం 2.4శాతమే అధికంగా ఉంటుండగా, సంవత్సరానికి కేవలం ఒకశాతం అంతర్లీన వృద్ధి రేటు ధోరణి కన్నా తక్కువగానే ఉండనుంది. ఇదే కాలంలో ద్రవ్యోల్బణ రేట్లలో తీవ్రమైన పెరుగుదల కూడా కనబడుతోంది. 2019-20, 2022-23 మధ్య మూడు త్రైమాసికాల్లో నామమాత్రపు జీడీపీ పెరుగుదల అనేది వాస్తవిక ఉత్పత్తి కన్నా ధరల్లో పెరుగుదల కారణంగా నమోదైంది. పారిశ్రామిక రంగంలో ఈ సంక్షోభం అత్యంత తీవ్రమైన రీతిలో ప్రతిబింబించింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 2022-23లో తయారీ రంగం కేవలం 1.6శాతమే వృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది. రికవరీ అనేది తీవ్రమైన అసమానంగా ఉంటుందని మోడీ ప్రభుత్వం అనుసరించిన వర్గ పక్షపాత దృక్పథం వల్ల తెలుస్తోంది. 2019-20, 2022-23 మధ్య కాలంలో నామమాత్రపు జీడీపీలో పెరుగుదల కన్నా ఎక్కువగా కార్పొరేట్, ఆదాయ పన్నుల ఆదాయాలు పెరగడమన్నది ఇందుకు రుజువుగా ఉంది. పన్నుల రేట్లు పెరగని పరిస్థితుల్లో ఇది జరిగిందంటే ఇందుకు గల ఏకైక మార్గం మొత్తం జాతీయాదాయాల్లో కార్పొరేట్ లాభాలు, అధిక ఆదాయాల వాటా పెరగడమే. ఫలితంగా, ఆదాయాల్లో మొత్తంగా ప్రతిష్టంభన నెలకొన్న పరిస్థితుల్లో భారతదేశ కార్మికవర్గం తీవ్రంగా నష్టపోయింది. పెరిగిన నిరుద్యోగం, తక్కువ వేతనాల కారణంగా ఈనాటి వారి ఆదాయాలు 2019-20లోని ఆదాయాలతో పోలిస్తే సగటు కన్నా తక్కువగానే ఉన్నాయి.

ఎలాంటి ముందస్తు ఆలోచన, ప్రణాళిక లేకుండా విధించిన లాక్‌డౌన్ లక్షలాదిమంది భారతీయులు కోవిడ్ కారణంగా మరణించకుండా నివారించలేకపోయింది. దీనికితోడు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించేందుకు మోడీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అనుసరించిన విధానం కూడా ఈ సంక్షోభానికి దోహదపడింది. 2022 నవంబరు వరకు ఆదాయాలు, ఖర్చుల్లో ధోరణులు చూస్తే, 2022-23లో జీడీపీలో కేంద్ర పన్నుల వాటా (శాతం) 2019-20లో కన్నా అధికంగా ఉండాలని సూచిస్తోంది. పైగా, వీటిల్లో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా గణనీయంగా అధికంగానే ఉండాలి. కేంద్ర పన్నుల ఆదాయాల్లో రాష్ట్రాల వాటా తగ్గడమే ఇందుకు కారణంగా వుంటుంది. మిగిలిన ఆర్థిక సంవత్సరానికీ ప్రస్తుత ధోరణే కొనసాగినట్లైతే, జీడీపీలో కేంద్ర ప్రభుత్వ వ్యయం కూడా 2019-20లో కన్నా తక్కువగా ఉండాలి. అదీకాకుండా, ప్రత్యక్ష పన్నుల ద్వారా అదనపు ఆదాయం లభిస్తున్నప్పటికీ, గతంలో పెంచిన చమురు ధరల పెంపులను ఇంకా పూర్తిగా తగ్గించలేదు. ఆ రకంగా, అసమానతల పెంపు ధోరణికి విరుగుడు చర్యలు తీసుకోవడానికి బదులుగా మోడీ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక విధానాలు అసమానతలను మరింత తీవ్రం చేశాయి. డిమాండ్ తగ్గినటువంటి పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరచ



డంలో ప్రభుత్వం విఫలమైంది. ఆర్థిక వాస్తవికతలను పట్టించుకోని వైనం గతంలో కూడా స్పష్టంగా కనబడింది. కానీ, కరోనా మహమ్మారి, దాని పర్యవసాన ఆర్థిక ప్రభావాలకు సంబంధించి పెను మానవ విషాదాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ ఆ విధానాన్నే కొనసాగించేందుకు పట్టుబట్టడం ఇందుకు సంబంధించి క్రూరమైన కారణంగా ఉంది. ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించే పేరుతో - ప్రభుత్వ ఆస్తులను మరింతగా ప్రయివేటీకరించడం, జాతీయాస్తుల మానిటైజేషన్ కార్యక్రమం, కొత్త వ్యవసాయ చట్టాలను ప్రవేశపెట్టేందుకు విఫల యత్నం, రక్షణ, బీమా వంటి రంగాల్లో మరింత విదేశీ పెట్టుబడులను

భారత ఆర్థిక భవితవ్యమనేది నిజాయితీగల ఆత్మనిర్భరతపై ఆధారపడి ఉంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో పోటీ పడేందుకు, కార్మిక వర్గాన్ని శాశ్వత దారిద్ర్యానికి నెట్టడం ద్వారా లాభాలను పిండేందుకు ప్రయత్నించడానికి బదులుగా... విస్తృతమైన దేశీయ మార్కెట్‌ను అందించడానికి కార్మిక వర్గ సామర్థ్యాన్ని మరింత స్వయంప్రతిపత్తితో కూడిన అభివృద్ధి పంథా కోసం ఉపయోగించుకోవాల్సి ఉంది.

అనుమతించడం వంటి ఇతర చర్యలు దీనికి తోడయ్యాయి. ఇవన్నీ కూడా కొద్దిమంది బడా పెట్టుబడిదారుల వద్దనే సంపద పోగుపడడమనేది బాగా పెరిగేందుకు మోడీ ప్రభుత్వం గుడ్డిగా నమ్మి అనుసరించిన నిబద్ధత లక్షణాలు. దానికి మత తత్వ రాజకీయాలను ముసుగుగా వాడుకుంటోంది.

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సుదీర్ఘమైన ఈ అంతరాయాలు, ఆటంకాలతో... భారత ఆర్థిక భవితవ్యమనేది నిజాయితీగల ఆత్మనిర్భరతపై ఆధారపడి ఉంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో పోటీ పడేందుకు, కార్మిక వర్గాన్ని శాశ్వత దారిద్ర్యానికి నెట్టడం ద్వారా లాభాలను పిండేందుకు ప్రయత్నించడానికి బదులుగా... విస్తృతమైన దేశీయ మార్కెట్‌ను అందించడానికి కార్మిక వర్గ సామర్థ్యాన్ని మరింత స్వయం ప్రతిపత్తితో కూడిన అభివృద్ధి పంథా కోసం ఉపయోగించుకోవాల్సి ఉంది. ఇందుకోసం, వారికి అనుకూలంగా పంపిణీని మార్చడానికి, రైతుల ఆదాయాలను మెరుగుపరచడానికి, ఉపాధిని సృష్టించగల డిమాండ్ విస్తరణను పెంచడానికి పన్నులను విధించడాన్ని, ప్రభుత్వ వ్యయాన్ని పెంచడాన్ని ఉపయోగించుకోవడం అనివార్యం. తద్వారా మెరుగైన ఆరోగ్య, విద్యా ఫలితాలను పొందేందుకు వీలు కల్పిస్తుంది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో, ఇటువంటి ప్రాధాన్యతలను ప్రతిబింబించగల కేంద్ర బడ్జెట్ కోసం పోరాడేందుకు, వనరుల కొరతతో ప్రభుత్వం ఇబ్బందులు పడుతోందన్న వాదనను తోసిపుచ్చేందుకు వామపక్షాలు నిబద్ధతతో ఉన్నాయి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)



పెండ్లి అనేది ప్రతి అమ్మాయి జీవితంలో చాలా ముఖ్యమైన సంఘటన. చక్కని చదువు, నిర్ణీత వయసు, ఆరోగ్యకరమైన జీవితానికి మూలమవుతుంది. అయితే ఎంతో సంతోషమయమైన జీవితాన్ని ఇవ్వడానికి బదులుగా పెండ్లి అనేది కొందరు అమ్మాయిల పట్ల శాపంగా మారుతోంది. ఎదిగీ ఎదగని శరీరం, అవగాహన లేని వయసు, ఏదీ నిర్ణయించుకోలేని మానసిక పరిపక్వత లేకపోవడం. ఇలా చాలా కారణాలు ఆడపిల్లల జీవితాలను అయోమయంలో నెట్టేస్తున్నాయి. దీనికి ముఖ్య కారణం ఇంకా మన దేశంలో కొనసాగుతున్న బాల్య వివాహాలు.

చితికిపోతున్న బాల్యం

దేశం, రాష్ట్రం ఎంతగా అభివృద్ధి చెందినా ఎన్నో విషయాల్లో ముందుకు వెళుతున్నా మహిళలు తమ భవితను గొప్పగా తీర్చిదిద్దుకుంటున్నా అదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. నాణేనికి రెండవ వైపున ఇంకా మూఢనమ్మకాలు, జీవితాలను చిన్నాభిన్నం చేసే సాంప్రదాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. వాటిలో బాల్యవివాహాలు ముఖ్యమైనవి.



చట్టం ఏం చెబుతుంది

బాల్య వివాహ నిరోధక చట్టం 1929లో వచ్చింది. కానీ చట్టం అమలులో లోపాలను సవరిస్తూ 2006లో మరింత పటిష్టం చేస్తూ అదనంగా రెండేండ్ల జైలు శిక్షను కూడా చేర్చింది. దీంతో బాలికను పెండ్లి చేసుకున్న వ్యక్తితో పాటు వధూవరుల తల్లిదండ్రులు, వివాహం చేసిన పెద్దలు, మత పెద్దలు, బంధువులు, ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్, పెండ్లికి సహకరించిన వారితో పాటు పెండ్లి జరిపించిన పంతులు, హాజరైన అందరిపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. వీఆర్వో, అంగన్వాడీ సూపర్వైజర్, తహసీల్దార్, ఎంపీడీవో, సీడీపీవో, ఆర్డీవో, కలెక్టర్, పోలీసులు, బాల్య వివాహాల నిరోధక అధికారులుగా ఉంటారు.

అవగాహన అవసరం

ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతోంది అంటే కొందరు అయ్యో.. అనుకుంటారు. ఈ బాల్య వివాహాన్ని ఆపాలి అనిపిస్తుంది కానీ ఎవరికి చెప్పాలి.. ఏంటి..? వంటి ప్రశ్నలతో సతమతం అయిపోయి "చివరికి ఏం చేస్తాం... ఆ పిల్ల రాత ఇలా ఉందేమో" అనుకుని తమదారిన తాము పోతారు కొందరు. అయితే బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నప్పుడు వాటిని ఆపడానికి ఎవరికి ఫిర్యాదు చేయాలి అనే విషయం తెలుసుకోవాలి ముందు.

ఎవరికి ఫిర్యాదు చేయాలి..?

బాల్య వివాహాలపై వీఆర్వో, అంగన్వాడీ సూపర్ వైజర్, తహసీల్దార్, ఎంపీడీవో, సీడీపీవో, ఆర్డీవో, కలెక్టర్, పోలీసులు, ప్రజాప్రతినిధులు వీరిలో ఎవరికైనా సమాచారం ఇవ్వొచ్చు. అలాగే 1098, 100 నెంబర్లకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేయవచ్చు. ఎవరైనా సరే... బాల్య వివాహాలపై సమాచారం ఇచ్చినపుడు ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచుతారు. కాబట్టి తమ పేరు ఎక్కడ బయటకు వస్తుందో అనే భయాన్ని, ఆందోళలనను వదిలిపెట్టి ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చు. దీనివల్ల ఓ ఆడపిల్ల జీవితం నిలబడుతుంది.



బాల్య వివాహాలు చేస్తే...

బాల్య దశలో వివాహాలు చేస్తే శారీరకంగా ఇబ్బందులు తలెత్తుతాయని స్త్రీ వైద్య నిపుణులు ఎప్పటి నుండో చెబుతూ వస్తున్నారు. ముఖ్యంగా మహిళల్లో రక్త హీనత వ్యాధి వస్తుందనీ, తద్వార వారికి పుట్టే పిల్లలకు మానసికమైన రుగ్మతలు వస్తాయని స్పష్టం చేశారు. కేవలం ఆ ఆడపిల్లకు మాత్రమే కాకుండా ఆ పిల్లకు పుట్టే బిడ్డకు కూడా లోపాలు తలెత్తే అవకాశాలు చాలా ఉంటాయి. బలహీనత, శారీరక లోపాలు, బుద్ధిమాంద్య లాంటి సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి. కాబట్టి వివాహాలు అనేవి ఆడపిల్లల జీవితాలకు శాపాలు కాకూడదు అంటే బాల్య వివాహాలు జరిపించకూడదు. ఆడపిల్లకు 18 ఏళ్ళు నిండిన తర్వాతనే పెండ్లి చేయాలి. నిర్ణీత విద్యార్హత దిశగా ఆడపిల్లను ప్రోత్సహించాలి.

కొన్ని పొదుపు సూత్రాలు పాటిస్తే...

డబ్బు సంపాదించడమే కాదు.. డబ్బు నిర్వహణ గురించి కూడా మహిళలకు తెలిసుండాలంటున్నారు ఆర్థిక నిపుణులు. అప్పుడే కుటుంబం ఆర్థికంగా దృఢంగా ఉంటుందంటున్నారు. అంతేకాదు.. మహిళలు ప్రతి దశలోనూ కొన్ని పొదుపు సూత్రాలు పాటించాలని సూచిస్తున్నారు. అవేంటో చూద్దాం...

- పెండ్లయ్యాక అందరు మహిళలు ఉద్యోగం చేయాలని లేదు. ఒక్కోసారి కుటుంబ బాధ్యతలు, ఇతర కారణాల రీత్యా వివాహం తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి గృహిణిగా కొనసాగాల్సి రావచ్చు. అలాంటప్పుడు సైతం ఇంట్లో ఉన్నా డబ్బు నిర్వహణపై దృష్టి పెట్టి ప్రతి రూపాయీ వృథా కాకుండా బడ్జెట్ వేసుకోవడం ఎంతో ముఖ్యమంటున్నారు. అందుకే నెలనెలా ఇంటి అవసరాలు, ఖర్చులకు సంబంధించి భార్యాభర్తలిద్దరూ చర్చించుకొని కొంత బడ్జెట్‌ను నిర్దేశించుకోవాలి. అందులో అత్యవసరమైన వాటికే ఖర్చు పెట్టి మిగిలిన మొత్తాన్ని వివిధ పొదుపు పథకాల్లో పెడితే నష్టభయం ఉండదు.. దీర్ఘకాలంలో వీటిని ఉపయోగించుకోవచ్చు. అలాగే గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్, ఈటీఎఫ్‌లలో పెట్టుబడి పెట్టచ్చు.



- అనుకోకుండా భర్తను కోల్పోవడం లేదంటే భర్త నుంచి విడిపోవడం.. ఈ రెండు సందర్భాల్లో సింగిల్ మదర్‌గానే మహిళలు తమ పిల్లల బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడు పిల్లల చదువు, పెండ్లి వంటి దీర్ఘకాలిక లక్ష్యాల పైనే ఎక్కువ దృష్టి పెట్టాలంటున్నారు నిపుణులు. అయితే అప్పటికే వీటికి సంబంధించిన పొదుపు పథకాల్లో డబ్బు జమ చేస్తుంటే వాటిని కొనసాగించడం.. అలాగే టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ వంటివి తీసుకోవడం.. అవసరమంటున్నారు. దీనివల్ల పిల్లల భవిష్యత్తు అవసరాలను తీర్చవచ్చు అంటున్నారు. దీంతో పాటు కనీసం ఆరు నెలలకు సరిపడా అత్యవసర నిధిని జమ చేసుకోవడమూ ముఖ్యమేనంటున్నారు. అలాగే మీ పెట్టుబడులు, వాటిలోని లాభ నష్టాల గురించి కూడా ఏ నెలకానెల చెక్ చేసుకోవడం మర్చిపోవద్దు.
- సాధారణంగా చాలామంది విషయంలో.. రిటైర్మెంట్ వయసొచ్చే నాటికే పిల్లల చదువులు, పెండిండ్లు, ఇంటి రుణం.. వంటి పెద్ద లక్ష్యాలన్నీ తీరిపోయి ఉంటాయి. కాబట్టి మిగిలిన సొమ్మును సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్, పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్, ఎఫ్‌డీ, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టుకోవచ్చు. అలాగే పన్ను రహిత బాండ్లలోనూ పెట్టుబడి పెట్టడం వల్ల ఎక్కువ రాబడి పొందడంతో పాటు.. రాబడిపై ఎలాంటి పన్ను ఉండదు. ఇలా మీరు పొదుపు చేసిన డబ్బును ఇటు మీ అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో మీ పిల్లలకూ అందించి సాయపడచ్చు.

బయటి వాటితో పనేముంది

కిచెన్ ప్లాట్‌ఫామ్, ఫ్లోరింగ్, గృహోపకరణాలు.. ఇలా ఇంటిని, ఆయా వస్తువుల్ని శుభ్రం చేయడానికి మార్కెట్లో దొరికే విభిన్న క్లీనింగ్ ఉత్పత్తుల్ని కొనుగోలు చేస్తుంటాము. ఇందుకు బ్రాండ్ పేరుతో బోలెడంత డబ్బు ఖర్చు పెట్టే వారూ లేకపోలేదు. అయితే వంటింట్లోనే సహజసిద్ధమైన క్లీనర్లుండగా బయటి వాటితో పనేముందంటున్నారు నిపుణులు. ఇంట్లో లభించే కొన్ని పదార్థాలనే ఇంటిని శుభ్రం చేయడానికీ ఉపయోగించచ్చంటున్నారు. అవేంటో తెలుసుకుందాం..

- కిచెన్ సింక్, ప్లాట్‌ఫామ్, కత్తులు, చాపింగ్ బోర్డు.. వంటి వాటిపై నిరంతరం తేమ ఉండడం వల్ల ఒక్కోసారి నీచు వాసన వస్తుంటాయి. అలాంటప్పుడు నిమ్మచెక్కతో వాటిని రుద్దితే అవి శుభ్రపడతాయి.. చక్కటి సువాసనా వెదజల్లుతాయి. అలాగే ఇత్తడిని మెరిపించడంలో దీనిలోని ఆమ్లగుణాలు సహకరిస్తాయి.
- వెనిగర్, నీటిని సమపాళ్లలో తీసుకొని స్ప్రే బాటిల్‌లో నింపుకోవాలి. శుభ్రం చేయాలనుకున్న వస్తువులపై ఈ మిశ్రమాన్ని స్ప్రే చేసి పొడిగుడ్డతో తుడిచేస్తే సరిపోతుంది.
- ఇక కుళాయి, షవర్‌హెడ్.. వంటివి మూసుకుపోయినప్పుడు.. వెనిగర్‌ను నేరుగా వాటి ఓపెనింగ్ దగ్గర స్ప్రే చేసి కాసేపు అలా వదిలేస్తే ప్రయోజనం ఉంటుంది.



- బేకింగ్ సోడా, నీళ్ల కలిపి పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. దీన్ని జిడ్డుగా ఉన్న ప్రదేశాల్లో, దుస్తులపై పడిన గ్రీజు మరకలపై అప్లై చేసుకొని కాసేపటి తర్వాత శుభ్రం చేసుకోవాలి. తద్వారా వాటి జిడ్డుదనం తొలగిపోవడమే కాదు.. దుర్వాసనలూ మాయమవుతాయి.
- కొన్ని పాత్రలు మాడిపోయినప్పుడు వాటిని ఎంత తోమినా ఆ మరకలు తొలగిపోవు. అలాంటప్పుడు కాఫీ పొడిని వాటిపై చల్లి.. కాసేపటి తర్వాత సాధారణంగా తోమితే ఫలితం ఉంటుంది.
- అల్లం, వెల్లుల్లి, ఉల్లిగడ్డ వంటివి కట్ చేసినప్పుడు చేతుల నుంచి అదో రకమైన వాసన వస్తుంది. అలాంటప్పుడు కాస్త కాఫీ పొడి రుద్దుకుంటే ఫలితం ఉంటుంది.
- పాత్రలు మాడిపోయినా, వాటిపై జిడ్డు మరకలైనా.. ఒకట్రెండు టీబ్యాగ్స్ నానబెట్టిన నీటిలో వాటిని వేసి రాత్రంతా అలాగే ఉంచాలి. మరుసటి రోజు తోమితే అవి శుభ్రపడతాయి.
- గాలి తగలడం వల్ల కొన్నాళ్లకు రాగి వస్తువులు నల్లగా మారతాయి.. అక్కడక్కడా మరకలు పడినట్లుగా తయారవుతాయి. ఇలాంటప్పుడు కొద్దిగా టొమాటో కెచప్‌ను ఒక టిష్యూ పేపర్‌పై వేసి దాంతో ఆయా వస్తువులపై రుద్ది.. ఆపై సాధారణ నీటితో శుభ్రం చేయాలి.
- బేకింగ్ సోడాను వేడి నీళ్లలో కలిపి మిశ్రమంగా తయారుచేసుకోవాలి. దీన్ని కిచెన్ క్యాబినెట్స్, ప్లాట్‌ఫామ్.. వంటివి శుభ్రం చేయడానికి ఉపయోగించచ్చు.


ఇట్ల చేద్దాం



చెంచా చొప్పున నారింజ పొడి, గంధం పొడి తీసుకొని దానికి రెండు చుక్కల నిమ్మరసం, రెండు చెంచాల గులాబీ నీళ్లు కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికీ, మెడకు రాసి అయిదు నిమిషాల తర్వాత కడిగితే ముఖం మెరిసిపోతుంది. చర్మంలోని మురికిని బయటకు పంపి మొటిమలు రాకుండా కాపాడుతుంది.

సృజనాత్మక శక్తుల నగరంగా హైదరాబాద్

- లిటరరీ ఫెస్టివల్‌లో వక్తలు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

సృజనాత్మక శక్తుల నగరంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రచారం చేయడమే హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ప్రధాన ఉద్దేశమని ఫెస్టివల్ డైరెక్టర్లు అమిత దేశాయ్, డాక్టర్ కిన్నెర మూర్తి, డాక్టర్ టి.విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న విద్యారణ్య హైస్కూల్‌లో 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్- 2023'ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ లిటరరీ ట్రస్ట్ సౌజన్యంతో అనేక సాహిత్య, సాంస్కృతిక, ప్రచురణ సంస్థల మద్దతుతో ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పండుగ దేశంలోని సాంస్కృతిక క్యాలెండర్‌లో ఒక విస్మరించలేని సంఘటనగా ఉద్భవించిందని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో సంస్కృతిక, కళాత్మక తత్వానికి.. అలాగే ఆధునిక సైబరాబాద్ శక్తివంతమైన సంస్కృతిని సూచిస్తుందన్నారు. సృజనాత్మక శక్తుల నగరంగా హైదరాబాద్‌కు ఒక బ్రాండ్ ఉందన్నారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ప్రతి ఏడాదీ జనవరి చివరి వారంలో నిర్వహించే ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ కార్యక్రమం అన్నారు. స్థానిక, జాతీయ, ప్రపంచ రచయితలు, కళాకారులను ఒకే వేదిక పైకి తీసుకురావడమే కాకుండా రచయితలు, పాఠకులు, కళాకారులు, ప్రేక్షకుల మధ్య వారధిగా పని చేస్తుందన్నారు. మరోవైపు ఔత్సాహిక రచయితలు, ప్రచురణకర్తలు, రచయితలతో సంభాషణలు, పఠనాలు, కథలు చెప్పడం, ప్యానల్ చర్చల వేదికలు, పిల్లల కోసం చర్చలు, ప్రదర్శనలు, సంస్కృతిక కార్యక్రమాలు ఈ ఫెస్టివల్‌లో ఉంటాయన్నారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ఒక మల్టీ డిసిప్లినరీ బహుళ శైలి ఈవెంట్ అనీ, దాదాపు 150 మంది స్పీకర్లు, రచయితలు, కళాకారులు, విద్వాంసులు, చిత్ర నిర్మాతలు, పాత్రికేయులు, విస్తృత శ్రేణి సృజనాత్మక రంగాలకు ఈ ఫెస్టివల్ ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు.

'నీళ్లు' నములుతున్నారు..!

(మొదటిపేజీ తరువాయి)

వెంచర్ వేసినా గ్రీన్‌బెల్ట్ వదలాల్సి ఉంటుంది. రూ.కోట్ల విలువైన భూముల్లో వెంచర్ వేస్తుండటంతో రియల్టర్లకు గ్రీన్‌బెల్ట్ వదలడం ఏమాత్రం రుచించడం లేదు. పక్కనున్న పంటకాల్వల్లో కొంతభాగమో.. కాల్వ నిరుపయోగంగా ఉంటే మొత్తానికే ఆక్రమించి దాన్ని గ్రీన్‌బెల్ట్ కింద చూపుతున్న ఉదంతాలు సైతం సుడా పరిధిలో వెలుగుచూస్తున్నాయి. ఏదులాపురం రెవెన్యూలో పీవీఆర్ గార్డెన్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఓ కాల్వను ఇలాగే ఆక్రమించేశారు. నీటిపారు దలశాఖ అధికారులు హెచ్చరించినా ఇక్కడ వృథా ప్రయాసే అవుతోంది. లక్ష్మీ బృందావనం వద్ద ఇదే పరిస్థితి. గుర్రాలపాడు రెవెన్యూలో 26-18 సర్వేనంబర్ల మధ్య పంటకాల్వను గ్రానైట్ వ్యర్థాలతో నింపుతున్నారు. 30 అడుగుల వెడల్పు ఉండాల్సిన కాల్వ కొన్నిచోట్ల మూడు, నాలుగు అడుగులకు కుచించుకుపోయినా నీటిపారుదల అధికారులు నిమ్మకు నీరెత్తినట్టే ఉన్నారు. దానికి సమీపంలోని ఓ వెంచర్‌లో బఫర్‌జోన్‌ను ఆక్రమించి గ్రీన్‌బెల్ట్‌గా చూపించినా సంబంధిత అధికారులకు పట్టడం లేదు. ఇలాంటి ఉదంతాలు ఖమ్మం నగర పరిసరాల్లో కోకొల్లలుగా ఉన్నా.. వెంచర్లలో బ్యాంక్‌లోన్‌లతో నిర్మాణాలు పూర్తయ్యేంత వరకూ అధికారులు చోద్యం చూస్తున్నారు. హెచ్ఎల్‌సీలు, వెంచర్ల యజమానుల ప్రలోభాలకు తలొగ్గి తీరా ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాక వచ్చి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. పైపెచ్చు రాజకీయ ఒత్తిళ్లనే సాకులు చూపుతుండటం గమనార్హం.



ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవు..

పంటకాల్వలు ఆక్రమించి, ఎన్‌వోసీకి విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా వాటిని కూలగొడతాం. ఏడాది కాలంగా ఎన్‌వోసీల బాధ్యత పూర్తిగా నేనే తీసుకున్నాను. అంతకుముందు డీఈలు, ఈఈలు, ఎస్ఈలు ఇలా ఎవరి సంతకాలు ఫోర్జరీ చేసినట్టు నా దృష్టికి తీసుకొస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. కాల్వలు, బఫర్‌జోన్‌లు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తాం. సంబంధిత యజమానిపై చర్యలు తీసుకుంటాం.

- శంకర్‌నాయక్, చీఫ్ ఇంజినీర్, ఖమ్మం జిల్లా.

టాస్క్‌ఫోర్స్ టీంలతోనే ఆక్రమణలకు అడ్డుకట్ట

నీటిపారుదల, రెవెన్యూ, పోలీసులు, సుడా అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ టీంలు ఏర్పాటు చేస్తేనే పంటకాల్వల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయొచ్చని ఓ నీటిపారుదలశాఖ అధికారి తెలిపారు. ఆక్రమణ దారులపై తమ శాఖ పరంగా జీవో 105 ఆధారంగా చర్యలు తీసుకున్నా ఏమాత్రం స్పందించడం లేదని వాపోతున్నారు. పోలీసులకు సైతం ఫిర్యాదు చేస్తున్నా వారు సైతం తమకు సహకరించే పరిస్థితి లేదని, పైపెచ్చు రాజకీయ ఒత్తిళ్ల అధికంగా ఉంటున్నాయని తెలిపారు. తమ సంతకాలు ఫోర్జరీ చేయడం, ఎన్‌వోసీ లకు విరుద్ధంగా వెంచర్లు వేస్తున్న విషయాన్ని పై అధి కారుల దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. ఇప్పటికే వీటిపై దృష్టిసారించామని, న్యాయపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఒవెరా గ్రూప్ యజమానిపై చార్జిషీట్

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. మూడు నెలల అనంతరం ఈ ఘటనకు సంబంధించి చార్జిషీట్‌ను రూపొందించారు. గతవారం నిందితునిపై అరెస్టు వారెంట్ జారీ అయ్యిందని.. అయితే అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఈ నెల 16న బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించినట్టు వెల్లడించారు. నిందితుని కోసం గాలిస్తున్నామనీ, వీలైనంత త్వరగా అరెస్టు చేస్తామని సీనియర్ పోలీస్ అధికారి అశోక్ యాదవ్ తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి మోర్బీ వంతెన మరమ్మతు, నిర్వహణ కాంట్రాక్టును అజంతా బ్రాండ్‌తో గోడగడియారాల తయారీ చేసే కంపెనీ ఒవెరా గ్రూప్‌కు రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా కట్టబెట్టిన సంగతి తెలిసిందే. పాత కేబుల్స్‌ను మార్చకుండా కేవలం కొద్ది పాటి మరమ్మతుతో ఒవెరా కంపెనీ 2022 అక్టోబర్ 30న బ్రిడ్జిని ప్రారంభించింది.

ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం ఫిబ్రవరి 9న హైదరాబాద్‌లో మహాధర్నా

(మొదటిపేజీ తరువాయి)

పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి నరసింహారావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి మాట్లాడుతూ 22 జిల్లాల్లో ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకున్నారని వివరించారు. ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలతోపాటు కేంద్రం కూడా రూ.ఐదు లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో సొంత ఇండ్లు లేక అసంఘటిత కార్మికులు, పేదలు, మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 58 జీవో ప్రకారం 120 గజాల్లోపు ఉన్న ఇండ్ల స్థలాలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరామ్ నాయక్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవి రమణ, కో కన్వీనర్ పి ఆశయ్య, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఉపాధ్యక్షులు వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

2,391 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

6ఆర్ట్- క్రాఫ్ట్-మ్యూజిక్ టీచర్ పోస్టులు ఉన్నాయి. సమాచార, పౌర సంబంధాల శాఖలో 166 పోస్టులను పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా భర్తీ చేస్తారు. దీనిలో 4 పీఆర్వో, 16 ఏపీఆర్వో, 82 పబ్లిసిటీ అసిస్టెంట్, 41 అసిస్టెంట్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్, 22 ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్ పోస్టులు ఉన్నాయని తెలిపారు.

గవర్నర్ బీజేపీ ప్రతినిధే...

వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ కే వాసుదేవరెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రిపబ్లిక్ డే రోజు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేసిన వ్యాఖ్యలు భారత రాజ్యాంగాన్ని కించపరిచేలా ఉన్నాయని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ కే వాసుదేవరెడ్డి అన్నారు. ఆమె వ్యాఖ్యల్ని ఖండిస్తూ శుక్రవారంనాడాయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రోటోకాల్ పాటించట్లేదని చెప్పిన తమిళ సై... ఏ ప్రోటోకాల్ ఉందని తెలంగాణ గురించి పాండిచ్చేరిలో విషం గక్కారని ప్రశ్నించారు. ఆమెకు కావాల్సింది దేశ ప్రధాని మోడీకి నమ్మిన బంటుగా ఉంటూ, బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ తెలంగాణ లో ఆ పార్టీ బలోపేతానికి జాతీయ నాయకురాలిగా పాత్ర పోషిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాజ్‌భవన్‌ను బీజేపీ అడ్డాగా మార్చేశారని విమర్శించారు. ప్రగతిభవన్‌కు రాజ్‌భవన్‌కు మధ్య ఆమే అంతరం పెంచుకున్నదని చెప్పారు.

బాలోత్సవం.. సృజనాత్మకం



(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. ప్రతివిద్యార్థీ టీచర్లను గౌరవించాలనీ, వారి మార్గదర్శకంలో ఎదగాలని సూచించారు. అయితే, చదువొక్కటే ప్రపంచంకాదని భావించి సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పిల్లలను భాగస్వాములను చేయాలని తల్లిదండ్రులను కోరారు. విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు రమేశ్ మాట్లాడుతూ..తన మాటలతో పిల్లలను చైతన్యపర్చారు. ఈలల వేయించారు. భవిష్యత్ మీదే అంటూ ప్రోత్సహించారు.

సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ..బాలోత్సవం ఎస్వీకేకు మాత్రమే పరిమితం కావొద్దనీ, దాన్ని జిల్లా, మండల, క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కి చెప్పారు. వచ్చే ఏడాది రాష్ట్రస్థాయి బాలోత్సవాన్ని ఎల్బీస్టేడియంలోనో, నిజాం కాలేజీ మైదానంలోనో నిర్వహించుకునే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పిల్లల్లో అద్భుతమైన సృజనాత్మకత దాగి ఉంటుందనీ, ఒక్కో రంగంలో ఒక్కొక్కరు చురుగ్గా ఉంటారని తెలిపారు. తల్లిదండ్రులు వారి శక్తిసామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన జీవితంతో పాటు ఎస్పీబాలసుబ్రమణ్యం జీవితంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. బాల్యస్మృతులను గుర్తుచేసుకున్నారు. కళలు, ఆటలు, చదువులు వేర్వేరు కాదని స్పష్టం చేశారు. నాలుగు గోడల మధ్య బందీ అయిన తరగతిగది ముఖచిత్రం, విద్యావిధానం మారాలని ఆకాంక్షించారు. 'నే సంపాదించిన ఆస్తులన్నీ ఇచ్చేస్తా...నే సంపాదించిన కీర్తిసంపదలన్నింటినీ ఇచ్చేస్తా..నా బాల్యాన్ని తెచ్చివ్వగలరా' అంటూ పాటగట్టి చిన్నారులను ప్రోత్సహించారు. 'ఒకటే జననం..ఒకటే మరణం..గెలుపొందే వరకూ..' అంటూ తాను రచించిన పాటను ఆలపించి పిల్లలను చైతన్యపర్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహణ కమిటీ కార్యదర్శి ఎస్.సోమన్న, నిర్వాహకులు భూపతి వెంకటేశ్వర్లు, అనుముల ప్రభాకర్, శాంతారావు, మమత, సుజావతి, మారన్న తదితరులు పాల్గొన్నారు. పిల్లల ప్రదర్శనలకు 36 మంది న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. 60 మంది వాలంటీర్లు తమ సేవలను అందించారు.

పిల్లలు స్వేచ్ఛా జీవులై

'మమ్మల్ని నాలుగు గోడలకే పరిమితం చేయకండి.. మాకంటూ స్వేచ్ఛనివ్వండి.. ఆడనివ్వండి.. ఆలోచించనివ్వండి.. తర్కించనివ్వండి.. మేమెంటో నిరూపించుకుంటాం' అంటూ చిన్నారులు తమలో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను బాలోత్సవం వేదిక సాక్షిగా ప్రదర్శించారు. తమ అద్భుతమైన వాగ్ధాటిని సైతం ప్రదర్శించారు. అందరూ అబ్బురపోయేలా శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. భగత్‌సింగ్, అల్లూరిసీతారామరాజు, గాంధీ, కర్ణుడు, ఫూలే, అంబేద్కర్ ఇలా విచిత్ర వేషధారణలతో వచ్చిన విద్యార్థులు ఏకపాత్రాభినయ పాత్రతో పంచ్ డైలాగ్‌లను విసురుతూ తామేంటో నిరూపించుకున్నారు. జానపద, అభ్యుదయం, సినీ, ఆధ్యాత్మిక పాటలను తమ గళాల ద్వారా వినిపించి అందరిచేతా చప్పట్లు కొట్టించారు. ఇంటర్నెట్ కాలంలో మనుషుల జీవిన విధానం ఎలా తయారైంది? అనే విషయాన్ని కండ్లకు కట్టినట్టు చూపారు. వర్షపు నీటిని నిల్వచేసుకుని ఇంటి అవసరాలకు, ఫిల్టర్ చేసి తాగేందుకు వాడుకునేలా ఏర్పాటు చేసిన ప్రదర్శన ప్రకృతి సంపదను ఎలా వాడుకోవాలనే ఆవశ్యకతను నొక్కిచెప్పింది. ఇలా ఒక్కటేంటి అక్కడ ఏర్పాటు చేసిన ప్రతి ప్రదర్శనా ఒక విజ్ఞాన దర్శినే. హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో ఏటేటా నీటి కాలుష్యం ఏవిధంగా పెరుగుతున్నది? మూసీ నదిలో కాలుష్య తీవ్రత ఎంత తీవ్రస్థాయికి చేరింది? పర్యావరణాన్ని ఏవిధంగా కాపాడుకోవాలి? తదితర అంశాలతో 'పర్యావరణ పరిరక్షణ' పేరుతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పిల్లలను ఆలోచింపజేసింది. బతుకమ్మ జానపద కళారూపాల ప్రదర్శనలతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.

పల్లె సుద్దుల పేరిట చిన్నారుల నోళ్ల నుంచి జాలువారిన మాటల ముత్యాలు ఆకట్టు కున్నాయి. భూ వివాదాలు, చిన్నచిన్న అంశాలకే కొట్టు కోవడాలు, తదితర అంశాలతో ప్రదర్శించిన లఘునాటికలు ఆలోచింపజేశాయి. స్వాతంత్ర్య సమరయోధులు, పలువురు ప్రముఖుల వేషధారణలతో మరికొందరు విచిత్ర వేషధారణలతో వచ్చి తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. హైస్కూల్ విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాలుపంచుకున్నారు. ఇవే కాదండోయ్. ఆకాశం నుంచి తారలు ఊడిపడ్డట్టుగా ఎస్వీకే దగ్గర ఒకేదగ్గర వేలాది మంది విద్యార్థులు పోగై అటూ..ఇటూ పరుగెడుతూ... నవ్వుతూ..ముచ్చటిస్తూ సందడి చేశారు. క్లాసు రూమ్‌ల బట్టీ చదువులకు కాస్త విరామం దొరికిందన్న సంతోషంతో మరోప్రపంచంలో విహరించారు.

ఏం సాధించారో శ్వేత పత్రం విడుదల చేయాలి: కూతాడి నరసింహ



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటై మూడేండ్ల కాలం పూర్తి అయిన సందర్భంగా సంబరాలు చేసుకోవడం కాదు ముందు జరిగిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు కూతాడి నరసింహ అన్నారు. శుక్రవారం పీర్జాదీగూడలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పాలకవర్గం ఏర్పాటైన నాటి నుండి నేటి వరకు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ప్రచార ఆర్భాటాలు తప్ప అభివృద్ధి జాడ ఎక్కడా లేదన్నారు. వరదలకు శాశ్వత పరిష్కారం చూపడం కోసం రూ.110 కోట్లతో ఎస్ఎన్డీపీ ప్రాజెక్టు ప్రారంభం చేస్తున్నామని గొప్పలు చెప్పిన పాలకవర్గం ఏడాది గడిచినా పనులు ప్రారంభించలేదన్నారు. సంబరాలు చేసుకునే ముందు మీరు ఇచ్చిన హామీలు చేసిన పనుల అభివృద్ధి విషయాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేటర్ పవన్ యాదవ్‌కు పితృ వియోగం

కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి సబిత



నవతెలంగాణ-బడంగ్ పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మామిడిపల్లి 12వ డివిజన్ కార్పొరేటర్ యాతం పవన్ యాదవ్‌కు శుక్రవారం పితృవియోగం జరిగింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి హుటాహుటిన మామిడిపల్లికి వెళ్లి యాతం యాదయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెంట బడంగ్‌పేట్ బీఆర్ఎస్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, నాయకులు ఆనందరెడ్డి, క్రిష్టారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యూసుఫ్ పటేల్, లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, అర్జున్, సాంబశివ తదితరులు ఉన్నారు.

కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్ పేట్

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్‌లోని పహాడిషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో రాచకొండ పోలీస్ కమిషనరేట్ సీపీ. డీఎస్ చౌహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లను మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటానికి కృషి చేస్తుందన్నారు. మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ పోలీస్ కమిషనర్ డీ.ఎస్. చౌహన్, డీసీపీ సన్ ప్రీత్ సింగ్, రాచకొండ డీసీపీ షీ టీం షేక్ సలీమా, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, పహాడి షరీఫ్ సీఐ కిరణ్ కుమార్, జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది, మున్సిపాలిటీ రిప్రజెంటేటివ్ వైస్ చైర్మన్ యూసుఫ్ పటేల్, కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కష్టారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్, మున్సిపల్ కమిషనర్ వసంత, కౌన్సిలర్లు శంషోద్దిన్, దస్తగిర్, పుష్పమ్మ కొండల్ యాదవ్, లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్, మజర్ అలి, అనుబంధ సంఘాలు, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నెంబర్స్‌పై నజర్

- నెంబర్ ప్లేట్స్ కనిపించకుండా వాహనదారుల ఎత్తులు
- ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో దాదాపు 90లక్షలకు పైగా జనాభా ఉండగా, 80లక్షలకుపైగా వాహనాలున్నాయి. వాటిలో 70శాతం ద్విచక్ర వాహనాలున్నాలుండగా మిగిలినవి కార్లు, ఆటోలు రోడ్లపై తిరుగుతున్నాయి. వీటికితోడు ప్రతిరోజు కొత్త వాహనాలు వందల సంఖ్యలో రోడ్లపైకి వస్తున్నాయి. వీరిలో చాలా మంది ట్రాఫిక్ నింబంధనలు పాటించడం లేదని పలు సర్వేలో తేలింది. వీరి నిర్లక్ష్యం మూలంగా గ్రేటర్‌లో అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు మద్యం సేవించి వాహనాలు నడిపిస్తుంటే మరికొందరు రెడ్ సిగ్నల్ పడినా దూసుకెళ్తున్నారు. ఇంకొందరు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్‌లో యద్ధేచ్ఛగా వెళ్లి ఎదురుగా వచ్చే వారిని ఢీ కొడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదం చేసిన వారిని పట్టుకోవాలని పోలీసులు ప్రయత్నిస్తే కష్టతరమవుతుంది. చాలా మంది వాహనదారులు నంబర్ ప్లేట్స్ లేకుండానే రోడ్లపైకి వస్తుండడంతో పోలీసులకు చిక్కడం లేదు. ఈ క్రమంలో రాచకొండ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

అందరినీ కలిచివేస్తోంది

ముఖ్యంగా ద్విచక్రవాహనాలతో రోడెక్కే యువకులకు పగ్గాలు లేకుండా పోతున్నాయి. వీరి ఆగడాలతో అమాయకులు మరణిస్తున్నారు. ఎలాంటి తప్పుచేయని వారు మృతి చెందడం అందరినీ కలిచివేస్తోంది. రోడ్డు ప్రమాదాల్లో తమ వారు మృతిచెందడం చూసి బాధిత కుటుంబీకుల రోదనలు అందరినీ కలచివేస్తుంది. కొందరు రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో తీవ్రంగా గాయపడడం, మరికొన్ని సంఘటనలో క్షతగాత్రులుగా మారుతున్నారు.

వంచివేయడం, రంగులు వేయడం..

పోలీసులు గుర్తించకుండా, లేదా జరిమానాలు పడకుండా కొందరు యువకులు వాహనానికి ఉన్న నెంబర్ ప్లేట్లను ఓ పక్కా వంచేస్తున్నారు. మరికొందరు రంగులు వేస్తున్నారు. ఇంకొందరు పెయింట్ పోయినట్లు నెంబర్‌ను తుడిచేస్తున్నారు. ఇలా చేస్తున్న వారే రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలపై దూసుకెళున్నారు. రోడ్డుపై ప్రమాదం చోటుచేసుకున్నా ఆగకుండా దూసుకెళ్తున్నారు. ముఖ్యంగా పోకిరీలు, నేరస్తులు, ఆకతాయిలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని పోలీసులు గుర్తించారు. నెంబర్ ప్లేట్స్ సరిగా లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

ఒకే రోజు 815 వాహనాల గుర్తింపు

సీపీ డీఎస్ చౌహన్ ఆదేశాలతో డీసీపీ డీ శ్రీనివాస్ పర్యవేక్షణలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఎల్బీనగర్, మల్కాజ్‌గిరి, భోనగిరి మూడు జోన్లల్లో దాదాపు 34 ప్రాదేశాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు, తిరిగి మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 815 వాహనాలను గుర్తించిన ట్రాఫిక్ అధికారులు 149 కేసులు నమోదు చేశారు.

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి



నగరంలో ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించే విధంగా చర్యలు చేపట్టామని, ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. పలు ప్రాంతాల్లో స్పీడ్ లిమిట్స్ ఆంక్షలు విధించామని, మరికొన్ని రహదారులపై స్పీడ్ లెజర్‌గన్‌లను ఏర్పాటు చేశమన్నారు. పరిమితికి మించి వేగంగా వాహనాలు వెళ్తే స్పీడ్ లెజర్ గన్‌లు పట్టేస్తాయని చెప్పారు. ముఖ్యంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రవాణాశాఖ నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్స్ సరిగా లేకుంటే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో డీసీపీ డీ.శ్రీనివాస్, ఏసీపీలు శ్రీనివాస్‌రావు, అంజయ్య, సైదులుతోపాటు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

– సీపీ డీఎస్ చౌహాన్

నెంబర్ ప్లేట్స్‌పై స్పెషల్ డ్రైవ్:ట్రాఫిక్ డీసీపీ

నవతెలంగాణ-హయత్ నగర్

వాహనదారులు తమ నెంబర్ ప్లేట్స్ ఉల్లంఘన పేరుతో కొందరు నేరాలకు పాల్పడిన ఘటనలతో రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు రాచకొండ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం ఆయన ఎల్బీనగర్‌లో ఉన్న ట్రాఫిక్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చలాన్లు తప్పించుకోవడా నికి వాహనదారులు తమ నెంబర్ ప్లేట్స్‌ను వంచడం, మాస్కులు పెట్టడం, స్టిక్కర్లు పెట్టడం, దండలు అడ్డుగా పెట్టడం లాంటివి చేస్తున్న వారు ఎక్కువగా చోరీలకు పాల్పడడం, చైన్ స్నాచింగ్ చేయడం లాంటివి జరుగుతున్నందున మొత్తం కమిషనరేట్ పరి ధిలో 17చోట్ల స్పెషల్ డ్రైవ్ చేపట్టగా 149 వాహనాలు సీజ్ చేశా మని, 815 వాహనాలపై చలాన్లు విధించామన్నారు. ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ అంజయ్య, భువనగిరి ట్రాఫిక్ ఏసీపీ సైదులు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, నాగార్జున, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

60 మంది వ్యక్తులపై కేసు నమోదు

నవతెలంగాణ-వనస్థలిపురం



వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ బాలు చౌహాన్, మహేష్ నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు హయత్ నగర్ స్పెషల్ మెట్రోపాలిటీ మెజిస్ట్రేట్ అతిగా మద్యం సేవించిన కుంట్లూరుకి చెందిన ఎన్ ప్రకాష్, దిల్‌సుఖ్‌నగర్‌కి చెందిన ఎన్.హరీష్, ఘట్కేసర్‌కి చెందిన ఏ.అభినవ్‌లకు రూ.3500 జరిమానా చొప్పున ప్రతి ఒక్కరూ ఒక్కొక్క రోజు ట్రాఫిక్ డ్యూటీ చేయాలని తీర్పుతోపాటు, మిగిలిన పట్టుబడిన వారికి చలానాలు విధించారు. మొత్తం లక్ష 83,500 చలానాలు విధించినట్టు ట్రాఫిక్ సీఐ బాలు చౌహన్ తెలియజేశారు.

అంగన్‌వాడీలకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని వినతి



నవ తెలంగాణ-సంతోష్‌నగర్

తెలంగాణలో 70 వేలమంది అంగన్వాడి ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరికి ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని చార్మినార్ ప్రాజెక్ట్ సీడీపీవో అధికారికి వినతి పత్రం సమర్పించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలపై చర్చించాలని, ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచే విధంగా కృషి చేయాలని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షురాలు ఎం.మీనా ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ చార్మినార్ ప్రాజెక్ట్ సీడీపీవో అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎం.మీనా మాట్లాడుతూ రాష్ట్రంలో 70వేలమంది అంగన్వాడి ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందినవారు ఎక్కువ శాతం ఉన్నారన్నారు. 40ఏండ్లకుపైగా ఐసీడీఎస్‌లో పనిచేస్తూ పేద ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు అయినా వీరికి కనీస వేతనం, పీఎఫ్ ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలు ఏవీ ప్రభుత్వం నేటికీ కల్పించలేదన్నారు దీనివల్ల అంగన్వాడీలు చాలా నష్టపోతున్నారన్నారు. పక్కనున్న తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అంగన్‌వాడీలను ఉద్యోగులుగా గుర్తించారన్నారు. తమిళనాడు, కర్నాటకలో హెల్త్ కార్డులు ఇచ్చారన్నారు. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్, పండగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో ఎలాంటి సౌకర్యాలు అంగన్వాడీ ఉద్యోగులకు ప్రభుత్వం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున రిటైర్మెంట్ బెనిఫిట్‌గా టీచర్లకు ఐదు లక్షలు, హెల్పర్లకు మూడు లక్షలు ఇవ్వాలని అనేక సంవత్సరాల నుండి అంగన్వాడిలు పోరాడుతున్నారని గుర్తు చేశారు. తమ సమస్యలను వెంటనే ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించి అంగన్వాడీలకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్ దుర్గా తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో పీర్జాదిగూడ

- రూ.264.97 కోట్లతో అభివృద్ధి పనులు
- మెట్రో నగరాలతో పోటీ
- ఫారిన్ డెలిగెట్స్‌ను ఆకర్షిస్తున్న కార్పొరేషన్
- మూడేండ్ల పాలకవర్గం.. ఎనలేని అభివృద్ధి ప్రస్థానం
- మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, టీమ్‌పై ప్రశంసలు



ఒకప్పుడు హైదరాబాద్ నగర శివారు గ్రామాలు నేడు దేశదేశాల ప్రతినిధులను ఆకర్షిస్తున్నాయి. కొత్త పాలకవర్గంతో కార్పొరేషన్‌గా ఏర్పడిన మూడేండ్లకే విశ్వజనీన ప్రగతిని సాధించి ఇతర దేశాల, రాష్ట్రాల ప్రతినిధులను ఆకర్షిస్తోంది. రాష్ట్ర, జాతీయ అవార్డులు సొంతం చేసుకొని మెట్రోనగరాలతో పోటీ పడుతోంది. నగరశివారులో ఉన్న పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిపై రాష్ట్రమంతా నేడు ప్రత్యేక చర్చ సాగుతోంది. ఈ తరుణంలోనే మూడో వార్షికోత్సవం జరుపుకుంటుంది. అంచెలంచెలుగా జరుగుతున్న పీర్జాదిగూడా అభివృద్ధిపై ప్రత్యేక కథనం.

– నవతెలంగాణ-బోడుప్పల్

హైదరాబాద్ నగర శివారు గ్రామాలు.. నిధుల కొరత, అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ప్రాంతం. అందుబాటులో లేని నాయకులు.. పట్టించుకోని లీడర్లు... అభివృద్ధి కోసం నిరసనలు. కార్పొరేషన్ తర్వాత.. అవే గ్రామాలకు వందల కోట్ల నిధులు. ఫారెన్ డెలిగేట్స్‌కు రీసెర్చ్ సెంటర్. ఐఏఎస్ అధికారులకు క్షేత్రస్థాయి పరిశీలన కేంద్రం. రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక అవార్డులు. చెత్తనుంచీ ఎరువులను ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగే ప్లాన్. మూడేండ్లకే సుదీర్ఘకాల అభివృద్ధి.. పాలకవర్గంపై సర్వాత్రా ప్రసంశలు.

ఇదీ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ జాతీయ స్థాయిలో ప్రభుత్వాలను, అధికారులను ఆకర్షించిన పని తీరు. కార్పొరేషన్ పాలకవర్గం కొలువుదీరి మూడేండ్లు పూర్తయిన సందర్భంగా పీర్జాదీగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, టీమ్ పనితీరుకు నిదర్శనమిది.

శివారు నుంచి సిటీతో పోటీకి..

పీర్జాదిగూడ 2019 జూలై 23న మున్సిపల్ కార్పోరేషన్‌గా ఆవిర్భవించింది. 2020 జనవరి 27న మేయర్ జక్క వెంకట్‌రెడ్డి లీడర్‌షిప్‌లో తొలి పాలకవర్గం కొలువుదీరింది. దీని అభివృద్ధికి పాలకవర్గం ముందు అనేక సవాళ్లు ఉండేవి. లక్షాపాతిక జనాభా, బస్తీలు, శివారు గ్రామాలు అన్నీ కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయి. కార్యవర్గం ఏర్పడ్డ తొలినాటినే ప్రత్యేక ప్రణాళికకు శ్రీకారం చుట్టారు మేయర్ వెంకట్‌రెడ్డి. స్థానిక వనరులను ఉపయోగించుకొని తిరుగులేని అభివృద్ధికి ప్లాన్ వేశారు. అలా నేటి వరకు రూ.264.97 కోట్లతో ఈ కార్పోరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టారు.

అర్బన్ లంగ్స్ రూపకల్పన

కార్పొరేషన్‌లో ముఖ్యంగా పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చారు. పిల్లల నుంచి పెద్దల దాకా ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో 1,250 మందికి ఒక పార్కును ఏర్పాటు చేశారు. మొత్తం 26 డివిజన్లలో సుమారు రూ.90.90 లక్షలు వెచ్చించి వంద పార్కుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో 85శాతం పార్కులు ప్రజలకు అందుబాటులోకి రాగా, మరో 15శాతం పార్కుల పనులు చివరి దశకు చేరాయి. ఇందులో చిల్డ్రన్స్ పార్కు, ఎడారి మొక్కలతో రాక్ గార్డెన్‌లు, టూరిస్ట్ స్పాట్లు, వీకెండ్ పార్కులు ప్రజలకు అనుగుణంగా అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన భాగ్యనగర నందనవనం, జటాయువు రిజర్వు ఫారెస్ట్‌లు పీర్జాదిగూడ పరిధిలో విస్తరించి ఉండటంతో ఇక్కడి ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందుతుంది. రూ.164లక్షలను వెచ్చించి సుమారు 31 ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు.

స్వచ్ఛ నగరంగా..

పరిసరాల పరిశుభ్రతలో కార్పొరేషన్ ప్రజలను పాలకవర్గం భాగస్వామ్యం చేస్తోంది. తడి, పొడి చెత్త సేకరణ 100 శాతం జరుగుతోంది. ఈ చెత్తను వేర్వేరుగా ఇంటిగ్రేటెడ్ గార్బేజ్ డంపింగ్ పార్క్‌కు తరలించి చెత్తను కూడా రీసైకిల్ చేసి వివిధ అవసరాలకు వాడుతున్నారు. ముఖ్యంగా ఈ డంపింగ్ పార్క్‌లో తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువులను ఉత్పత్తి చేయడం ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలుస్తోంది. సుమారు రూ.3.80 కోట్ల ఖర్చుతో ఈ డంపింగ్ పార్క్‌ను నిర్మించి సుదీర్ఘ కాల ఫలితాలను రాబడుతున్నారు. దీంతోపాటు రూ.1.03 కోట్ల నిధులతో ఎఫ్ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మించారు. కార్పోరేషన్ అనేక మెట్రో నగరాలతో పోటీ పడుతూ మలమూత్రాలను కూడా పునర్వినియోగం చేస్తుండటంతో స్వచ్ఛ సర్వేక్షణ్-2022లో ఓడీఎఫ్+ సిటీగా అరుదైన గుర్తింపును దక్కించుకుంది. మున్సిపాలిటీ పరిధిలో 100 శాతం ఇండ్లకు టాయిలెట్స్ నిర్మాణంతో పాటు ప్రజలు, బాటసారుల సౌకర్యార్థం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ పీర్జాదిగూడ ప్రాంతంలో రూ.114.5 నిధులతో సుమారు 13 (48 సీట్లు) పబ్లిక్ టాయిలెట్స్‌ను నిర్మించారు. ఇందులో ప్రత్యేకంగా మహిళలకు షీ టాయిలెట్‌ను కూడా నిర్మించారు.

ఆదర్శ వైకుంఠదామం...

గతంలో కులాలకు, మతాలకు వేరువేరుగా స్మశానవాటికలు ఉండేవి. కానీ సర్వ కులాలు, సకల మతాల ప్రజల కోసం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో రూ.3కోట్ల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్, మున్సిపల్ సాధారణ నిధులతో అధునాతన సౌకర్యాలతో మోడల్ వైకుంఠదామం నిర్మించారు. ఈ వైకుంఠదామం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచింది. అలాగే రూ.7.50కోట్లతో ఇంటిగ్రేటెడ్ మాంసాహార, శాఖాహార మార్కెట్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. రూ.87.85 లక్షల నిధులతో 88 స్ట్రీట్ వెండింగ్ జోన్ల (88 షాపులు)ను నిర్మించారు. రూ.12లక్షలతో కమ్యునిటీ హాల్‌ను, రూ.15లక్షలతో తెలంగాణ క్రీడా ప్రాంగణం నిర్మించారు. రాష్ట్రంలోనే ప్రథమంగా (స్థానిక సంస్థలలో) పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో రూ.30లక్షలతో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డిని, పాలకవర్గ సభ్యులను అసెంబ్లీ వేదికగా అభినందించారు. రూ.26లక్షల నిధులతో బస్తీ దవాఖానను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే రూ.12లక్షలతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్పోరేషన్ పరిధిలోని అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రూ.150లక్షల మున్సిపల్ నిధులను వెచ్చించి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.



ప్రజల దాహార్తిని తీర్చేందుకు..

మున్సిపాలిటీ పరిధిలో అనేక ఖాళీ స్థలాలను గుర్తించి పార్కులను, జిమ్‌లను ఏర్పాటు చేయడంతోపాటు సుమారు 64 ఖాళీ ల్యాండ్ పార్సిల్స్‌ను గుర్తించి రూ.540.2లక్షల నిధులతో కాపౌండ్‌వాల్స్‌ను నిర్మించారు. రూ.14.90కోట్ల నిధులతో పీర్జాదిగూడ పెద్ద చెరువుకు రిటైనింగ్ వాల్‌ను నిర్మించడంతోపాటు సందర్శకుల సౌకర్యార్థం బ్యూటిఫికేషన్, మౌళిక వసతులకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించాలనే సంకల్పంతో రూ.39.10 కోట్లతో రిజర్వాయర్లను నిర్మించడంతో పాటు అనుమతి ఉన్న ప్రతి ఇంటికీ అర్బన్ మిషన్ భగీరథలో భాగంగా నల్లా కనెక్షన్లు ఇచ్చారు. పీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్



కార్పోషన్ల పరిధిలోని వరద నీటికి శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.110కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు.

స్ఫూర్తిదాయకమైన ప్రగతి

మూడేండ్లలో స్ఫూర్తిదాయకమైన ప్రగతిని సాధించాం. మా సంకల్పానికి ప్రభుత్వ సహకారం తోడవడంతో నేడు పీర్జాదిగూడ ఒక మోడల్ సిటీగా మారింది. పీర్జాదిగూడను దేశంలోనే ఒక ఆదర్శవంతమైన నగరంగా అభివృద్ధి చేస్తామనే నమ్మకం ఉంది. పాలకవర్గ సమిష్టి నిర్ణయాలతో రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తాం. పెండింగ్‌లో పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది.

–జక్కా వెంకట్ రెడ్డి, మేయర్,
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్.

పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని శివసాయి నగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్‌తో కలిసి కాలనీ ప్రధాన ద్వారం వద్ద జరుగుతున్న బాక్స్ డ్రైన్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లెలగూడా నుంచి వచ్చే వరదనీరు ఈ కాలనీ గుండా ప్రవహిస్తూ వంగ శంకరమ్మ పక్క నుంచి కిందకు ప్రవహిస్తుందని, శివసాయి నగర్ ప్రధాన ద్వారం వద్ద అసంపూర్తిగా చేసిన పనులు వెంటనే ప్రారంభించి వచ్చే లైన్ సంధిని చెరువుకు అనుసంధానం చేస్తూ తూము నిర్మించాలని అధికారులను ఆదేశించారు. సకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేస్తే వరదనీటి నుంచి పూర్తి స్థాయిలో విముక్తి లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



నవతెలంగాణ -ఎల్బీనగర్

బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం లింగోజిగూడ డివిజన్ గ్రీన్‌పార్క్ కాలనీలో స్వచ్ఛ్ ఎల్‌బినగర్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రోడ్లు, కాలనీలోని చెత్త చెదారం శుభ్రం చేసి, జాతిపిత మహాత్మాగాంధీకి పూలమాల వేసి నివాళులర్పించారు. నిత్యం కాలనీలను శుభ్రపరిచే పరిశుధ్య కార్మికులను శాలువాలతో సామ రంగారెడ్డి సత్కరించారు. మాజీ మున్సిపల్ చైర్మన్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ ఆకుల రమేష్ గౌడ్ రెండో వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన స్వచ్ఛ ఎల్బీనగర్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతామన్నారు. స్వచ్ఛ భారత్ స్ఫూర్తిగా స్వచ్ఛ ఎల్‌బీనగర్ లక్ష్యంగా కార్యక్రమం చేపడుతున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎవరికీ వారు తమ బాధ్యతగా భావించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ్ భాస్కర్, కృష్ణంరాజు, ప్రవీణ్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, భోస్లే శ్రీనివాస్, పవన్‌కుమార్, రాజేష్‌గౌడ్, స్వయం ప్రకాష్, సూర్యప్రకాష్, రాములు గౌడ్, గట్టు రవి, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అధికార బలంతో దర్జాగా కార్పొరేటర్ కబ్జా

చర్యలు తీసుకోవాలని బాధితుల ఆవేదన



నవతెలంగాణ-బోడుప్పల్

అధికార బలంతో ఇతర వ్యక్తుల ప్లాట్‌ను దర్జాగా కబ్జా చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు మీడియా ముందు అవేదన వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 23వ డివిజన్ అన్నపూర్ణ కాలనీలోని సర్వే నెంబరు 51/ఎ/1 లో 266 గజాల స్థలాన్ని ఇప్పుడు డాక్యుమెంట్లతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 23వ డివిజన్ కార్పొరేటర్ నారెల్లపల్లి మధుసూదన్ రెడ్డి భార్య స్వాతి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించి అధికార బలంతో అనుమతులు పొంది నిర్మాణాలు చేపట్టారని వాపోయారు. తమకు చెందిన స్థలాన్ని అధికార బలంతో కార్పొరేటర్ కబ్జా చేసిన అంశంపై కార్పొరేషన్ కమిషనర్, పోలీసు స్టేషన్, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు బీరం ప్రవీణ్, కార్తిక్, సందీప్ రెడ్డిలు పాల్గొన్నారు. బాధితులకు మద్దతుగా సంపత్ రావు, ఓయూ జేఏసీ నాయకులు సుబ్బు నాయక్, శరత్ నాయక్, జిల్లా నాగయ్య, చెనగర బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఇండికేషన్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని వినతి



నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డ శ్రీ విరాట్‌నగర్ కాలనీలో ఉన్నటువంటి ఇండో బ్రిలియంట్ స్కూల్ యాజమాన్యంతో చర్చించిన విషయం కొన్ని రోజుల క్రితం స్కూల్ ఎదురు రోడ్డుపై వెళ్తున్న బాలుడిని టూ వీలర్ వెహికల్ తగిలిన విషయం గుర్తు చేస్తూ మరోసారి ఇలాంటివి ఘటనలు జరగకుండా స్కూల్ యొక్క చుట్టుపక్క ఆవరణలో స్కూల్ ఇండికేషన్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయవలసిందిగా కోరిన ఉప్పల్ హెచ్‌ఆర్సిసి కమిటీ సభ్యులు అధ్యక్షులు గగన్ కుమార్ సంయుక్త కార్యదర్శి కరుణాకర్ తదితరులు .

వేంకటేశ్వర స్వామి వారి కల్యాణంలో భాగంగా రథం ఊరేగింపు



నవతెలంగాణ-కాప్రా

శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, మంగాపురం కాలనీ, మౌలాలి, మీర్‌పేట్‌లో జరుగు వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణంలో భాగంగా రథం ఊరేగింపు ప్రారంభంలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు మనందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి, టెంపుల్ ఈఓ వెంకన్న, గుడి సభ్యులు గారి బుచ్చయ్య, సముద్రాల కృష్ణమూర్తి, మల్లేష్ గౌడ్,ఎర్ర సుధాకర్ మురళి చారి, మురళి కృష్ణ, బ్రమ్మ చారి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేసే మంచి పనులు వల్ల వ్యక్తులు చిరంజీవులు

- ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ. రమణ



నవతెలంగాణ-కల్చరల్

వ్యక్తులు చేసే మంచి పనులు వల్ల చిరంజీవులుగా సమాజంలో నిలిచి వుంటారని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ.రమణ అన్నారు. శ్రీత్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై కళా నిలయం సాంస్కృతిక సంస్థ నిర్వహణలో తెలంగాణ అభిమాని, విద్యార్థి నాయకుడు ఫణి భార్గవ్ జన్మ దిన సందర్భంగా ఆయన పేరిట నగదు పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని పురస్కారాలను జర్నలిస్టులు దామోదర్, అజయ్‌కుమార్, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాలేశ్వరం శంకరం, వేద పండితుడు వీణాపాణి శాస్త్రికి బహుకరించి మాట్లాడారు.

కుమారుడు ఫణిభార్గవ్ మరణాన్ని జీర్ణించుకొని తండ్రి ఆయన పేరిట ప్రతిభావంతులు, అవసరం ఉన్నవారిని ఎంపిక చేసి నగదును బహుకరించటం అపురూప దృశ్యం అన్నారు. ఫణి చిన్నతనం నుంచే సామాజిక చైతన్యంతో పది మందికి ఉపయోగపడే పనులు చేసి శాశ్వత యశస్సు పొందారని కొనియాడారు. కవి డాక్టర్ ఎం.కె.రాము అధ్యక్షత వహించిన సభలో సినీ విశ్లేషకులు సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ రెంటల జయ దేవ్, నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసులు ఫణి భార్గవ్ సేవా భావం రాజకీయ స్పృహ గురించి వివరించారు. సురేందర్ పుష్ప కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. నాట్య గురువులు ప్రవల్లిక, సుష్మ శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి.

అంబేద్కర్ ఆశయ సాధన కోసం పనిచేస్తాం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

అంబేద్కర్ ఆశయ సాధన కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నూతన సచివాల యానికి ప్రభుత్వం అంబేద్కర్ పేరు పెట్టిందని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలియజేశారు. మంత్రి మల్లారెడ్డి ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ పార్టీ నేత నల్లోల్ల కుమార్ మంత్రి మల్లారెడ్డిపై వాగ్వివాదం చోటుచేసుకుంది దళితులకు మోసం చేస్తున్న కెసిఆర్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు అంబేద్కర్ విగ్రహావిష్కరణలో దళితుల గురించి అంబేద్కర్ ఆశయాల గురించి చెప్పాల్సింది పోయి ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి గొప్పలు చెప్పే వేదిక ఇది కాదని మండిపడ టంతో మంత్రి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం పలువురు ప్రముఖు లకు కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రాపోలు రాములు, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు నక్క ప్రభకర్ గౌడ్, సినీ గేయ రచయిత మాష్టార్జి, కౌన్సిలర్లు, అంబేద్కర్, ఆదర్శ సంఘం నేతలు పొడువల్ల రవీందర్, మంచాల మహేందర్, బండెలా పరమేష్, రొంపి కుమార్, మీసాల భాస్కర్, పాల్గొన్నారు.

మెరిట్‌వై కార్యదర్శి అల్కేష్ కుమార్ శర్మచే పీసీబీ రీసైక్లింగ్ ప్రారంభోత్సవం



నవతెలంగాణ-కాప్రా 5

సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సి-మెట్) అనేది భారత ప్రభుత్వం యొక్క ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మెరిట్‌వై) ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తమైన శాస్త్రీయ సంఘం. ఇది మూడు ఆర్ అండ్ డీ ప్రయోగశాలలను పూణే, హైదరాబాద్ త్రిస్సూర్‌లో కలిగి ఉంది, ఇది క్లిష్టమైన ఎలక్ట్రానిక్ పదార్థాలపై వివిధ థ్రస్ట్ ప్రాంతాలపై దృష్టి సారిస్తుంది. సీ-మెట్, హైదరాబాద్ ల్యాబ్ అధిక స్వచ్ఛత, సెమీకండక్టర్లు మరియు లోహాలు మరియు మిశ్రమాలతో సహా వ్యూహాత్మక పదార్థాల అభివృద్ధిపై దృష్టి సారించింది. దేశంలో వనరుల సామర్థ్యం మరియు వృత్తాకార ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి పర్యావరణ అనుకూలమైన ఈ-వ్యర్థాల రీసైక్లింగ్ సాంకేతికతలను అభివృద్ధి చేయడం సీ-మెట్, హైదరాబాద్ యొక్క ప్రధాన థ్రస్ట్ రంగాలలో ఒకటి. భారతదేశం సంవత్సరానికి సుమారు 3.2 మిలియన్ టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేస్తుంది, ఇందులో బంగారం, పల్లాడియం, వెండి వంటి అనేక విలువైన పదార్థాలు ఉన్నాయి, ఇవి ప్రమాదకర పదార్థాలతో పాటు మానవులకు కోలుకోలేని ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తాయి. ఈ సందర్భం లో, ఆ సమస్యలను పరిష్కరించడానికి పర్యావరణ అనుకూల ప్రక్రియల అభివృద్ధి చాలా ముఖ్య మైనది. సి-మెట్ పీపీపీ మోడల్‌లో దేశంలోనే తొలిసారిగా ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ని ఏర్పాటు చేసింది. ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై సీఓఈ అన్ని రకాల ఈ-వేస్ట్ రీసైక్లింగ్ టెక్నాలజీలను అభివృద్ధి చేసింది. ఖర్చు చేసిన పీసీబీ లీ లోన్ బ్యాటరీ, శాశ్వత అయస్కాం తం మరియు ఎస్ఐ -సోలార్ ఘటాలు మొదలైనవి. సీఓఈ అభివృద్ధి చేసిన పీసీబీ రీసైక్లింగ్ సాంకేతికత సాంకేతిక సంసిద్ధత స్థాయి 6 దశలో ఉంది మరియు ఇప్పుడు వాణిజ్యీకరణకు సిద్ధంగా ఉంది. సీమెట్ రీసైక్లింగ్ టెక్నాలజీలను అభివృద్ధి చేయడమే కాకుండా వాటికి అవసరమైన ప్రాసెసింగ్ పరికరాలను రూపొందించింది మరియు రూపొందిం చింది. ఈ సదుపాయాన్ని మెరిట్‌వై కార్యదర్శి అల్కేష్ కుమార్ శర్మ ఐఏఎస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వనరుల సామర్థ్యం, కాలుష్యాన్ని తగ్గించడం, విలువైన పదార్థాల పునరుద్ధరణ మరియు ఆరోగ్య ప్రమాదాలను తగ్గించడంలో ఇ-వేస్ట్ మేనేజ్ మెంట్ పట్ల వృత్తాకార ఆర్థిక విధానం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఇ-వ్యర్థ పదార్థాలను రీసైక్లింగ్ కోసం బయటికి పంపే బదులు భారతదేశంలో తమ ప్లాంట్‌ను స్థాపించడానికి ఇ-వేస్ట్ రీసైక్లింగ్ పరిశ్రమలకు సహాయం చేయడానికి మంత్రిత్వ శాఖ స్పెక్స్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని ఆయన అన్నారు. స్వదేశీంగా అభివృద్ధి చేసిన ఈ-వేస్ట్ రీసైక్లింగ్ టెక్నాలజీలు ఆత్మనిర్భారతం మరియు వృత్తాకార ఆర్థిక వ్యవస్థకు భారతదేశం యొక్క మిషన్‌ను పూరించగలవని ఆయన పునరుద్ఘాటించారు.

అభివృద్ధి చేస్తాం...ఆశర్వదించండి

దమ్మాయిగూడా మున్సిపల్ చైర్‌పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

దమ్మాయిగూడా మున్సిపాలిటీ కోసం అభివృద్ధి చేస్తాం...ఆశర్వదించండని దమ్మాయిగూడా మున్సిపల్ చైర్‌పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం దమ్మాయిగూడ పాలకవర్గం మూడు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని నాలుగో సంవత్సరంలో అడుగు పెడుతున్న శుభ సందర్భంలో చైర్‌పర్సన్ , మున్సిపల్ కమిషనర్ .స్వామి కౌన్సిలర్లకు, కో ఆప్షన్ సభ్యులకు, అందరికీ శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందచేశారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్, కౌన్సిలర్లు నాను నాయక్, నాగయిపల్లి సుజాత, కొత్త హేమలత, మంగళపూరి వెంకటేష్, కొత్త సురేఖ, వరగంటీ వెంకటేష్, సంపన్ బోల్ స్వప్న, గోగుల సరిత,ముప్ప శ్రీలత,గురువెళ్ళి వెంకటరమణ, పాండాల అనురాధ, వసుపతి రమేష్ గౌడ్, మాదిరెడ్డి నరసింహారెడ్డి, రామారం శ్రీహరి గౌడ్, కో ఆప్షన్ సభ్యులు వాయిదా బేగం,వడియల రజిని, షేక్ శాదుల్, డిఈఈ .సుమతి, మేనేజర్ .వెంకటేశం, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి వైపు తెలంగాణ

ఉప్పల శ్రీనివాస గుప్తా

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రం సాధించాక సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి వైపు పయనిస్తుందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. శుక్రవారం నగరంలోని కంట్రీ క్లబ్లో సికింద్రాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 52వ ఇన్స్టాలేషన్ నైట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా వేణుమాధవ్, కోశాధికారిగా రాచకొండ శ్రీమును ఎన్నుకున్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉప్పల శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని అన్ని ప్రాంతా లాలో భివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి దేశంలోని ప్రతి ఒక్కరు తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, అమలు అవుతున్న ప్రజా సంక్షేమ పథకాలవైపు చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 24గంటల విద్యుత్ అందించడంతో పరిశ్రమలు వ్యాపారస్తులు నిరంతరాయంగా ప్రశాంతంగా వ్యాపారాలను కొనసాగించుకుంటున్నారని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు కేవలం వ్యాపారంలోని కాకుండా సామాజిక సేవలలోను ముందుంటారని తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఉప్పల శ్రీనివాస గుప్తను ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు శ్రావణ్ కుమార్, విఐఎస్ మాజీ అధ్యక్షులు ఉప్పల రాజేశ్వర్, మదన్మోహన్, సంపత్, చికోటి, శ్రావణికుమార్, వేణు మాధవులతోపాటు పలువురు సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీ బహుమతులు అందజేత



నవతెలంగాణ-కంటోన్మెంట్

టికెట్ హరిజన బస్తీలో హరిజన బస్తీ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ బహుమతులు అందజేశారు. పికెట్ హరిజన బస్తీలో హరిజన బస్తీ కమిటీ పిలుపుమేరకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సంక్రాంతి ముగ్గుల పోటీలో విజయతులను వారికి బహుమతులు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వేసిన ముగ్గులు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని వారిని అభినందించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన వారికి శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హరిజన బస్తీ కమీటీ నాయకులు గంగరాం,వెంకట్, వినోద్, మహిళలు హిమబిందు, స్వర్ణలతా, పద్మ, టిఆర్ఎస్ పార్టీ నాయకులు రావుల సతీష్ శ్రీనివాస్ సతీష్ , నరేష్ పాల్గొన్నారు.

బాలానగర్ జోన్ డీసీపీగా టి .శ్రీనివాసరావు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సైబరాబాద్ కమిషనరేట్ బాలా నగర్ జోన్ డీసీపీగా సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ పోలీస్ వి భాగంలో డీసీపీగా విధులు నిర్వహిస్తున్న టి. శ్రీనివాసరావు శుక్రవారం బదిలీపై వచ్చి షాపూర్ నగర్ లోని డీసీపీ కార్యాలయం లో బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ డీసీపీగా విధులు నిర్వహించిన సందీప్ గోనె బదిలీ పై వెళ్లాడు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిసిపి టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ శాంతి భద్రత విషయంలో రాజీ పడేది లేదని ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం బాలానగర్ జోన్ పరిధి పోలీస్ స్టేషన్ లోని ఇన్స్పెక్టర్లు. ఎస్సైలు. పోలీస్ సిబ్బంది. డిసిపిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

నాలుగు కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్లో ఉన్న రెండు చెరువులు పటేల్‌కుంట చెరువు నుండి హెచ్ఎంటి నగర్ చెరువు వరకు ఉన్న ఓపన్ నాలా పై మొత్తం ఏడు బ్రిడ్జిలు ఉండగా, అందులో నాచారం మెయిన్ రోడ్డుపై ఉన్నది ఒకటి ఇప్పటికే నిర్మించుకోవడం జరిగింది. అలాగే పటేల్‌కుంట చెరువు వద్ద బాక్స్ కల్వర్టు నిర్మాణం కూడా పూర్తి చేయడం జరిగింది. ఇప్పటికే సుమారు నాలుగు కోట్ల రూపాయలతో నాలుగు కొత్త బ్రిడ్జిలు నిర్మాణానికి నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాయి. కేవలం భవాని నగర్ నుండి వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి ఒక్కటి పాతది కావడంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు ఎక్కువయ్యాయి. నాలాలో కొట్టుకు వచ్చిన చెత్త మరియు గుర్రపు డెక్కలు ఈ బ్రిడ్జి కింద ఆగిపోయి ఉంటున్నాయి కాబట్టి ఈ బ్రిడ్జి స్థానంలో కొత్త 10 మీటర్ల విశాలమైన బ్రిడ్జి నిర్మించాలని జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ జీహెచ్ఎంసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకి వినతి పత్రం అందజేయడం జరిగింది .దానికి జోనల్ కమిషనర్ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-మల్కాజిగిరి

బిబి శక్తి మహిళా మండలి అధ్యక్షురాలు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ స్టేట్ అధ్యక్షురాలు కె.అనురాధ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శక్తి మహిళా మండల అధ్యక్షురాలు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు కే.అనురాధ రెడ్డి అన్నారు. మౌలాలి డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరంలో శుక్రవారం శక్తి మహిళా మండలి అధ్యక్షురాలు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ స్టేట్ అధ్యక్షురాలు కే.అనురాధ రెడ్డి ఆధ్వర్యంలో శక్తి మహిళా మండలి మెంబర్స్ కంటి వెలుగు శిబిరంలో పాల్గొని వారి కండ్లను టెస్ట్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా అనురాధ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ప్రారంభించిన కంటి వెలుగు పథకాన్ని పేద, మధ్యతరగతి ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించుకోవచ్చని, కంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి కండ్ల అద్దాలను కూడా ప్రభుత్వమే ఇవ్వడం ఆనందించదగ్గ విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ స్టేట్ ఫ్రెండ్స్ పుష్పకుమారి, సిఓ మహాలక్ష్మి, రమా, మాధురి, కవిత, విజయలక్ష్మి పద్మ ఎస్ కవిత, ఓ కవిత, వై కవిత, రేఖ, బుచ్చమ్మ సుశీల, టి.సుధ, వై.రమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వి విశ్వవిద్యాలయం మెరిట్ స్కాలర్ షిప్స్ కోసం రూ.10కోట్లు కేటాయింపు

నవతెలంగాణ - హైదరాబాద్

ఆర్వి విశ్వవిద్యాలయం (ఆర్వియు), లిబరల్ విద్యకు ఉద్దేశించబడిన భారతదేశపు కొత్త యుగపు, టెక్-డ్రివెన్ ప్రపంచ వ్యాప్త విశ్వవిద్యాలయం, 2023 ఆగస్టులో మొదలయ్యే రాబోయే అకాడెమిక్ సంవత్సరానికి మెరిట్ స్కాలర్షిప్స్ కోసం రూ.10 కోట్లు కేటాయించింది. ఇది 500 ప్లస్ అండర్ గ్రాడ్యువేట్, పోస్ట్ గ్రాడ్యువేట్ డిగ్రీ ప్రోగ్రాముల విద్యార్థులకు లబ్ధిని చేకూరుస్తుంది. ఈసందర్భంగా బెంగళూరు ఆర్వి విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎస్.ఆర్.మూర్తి మాట్లాడుతూ... తాము అర్హత వున్న విద్యార్థులకు ఈ మెరిట్ స్కాలర్షిప్స్ ప్రకటించడానికి అనందిస్తున్నామన్నారు. గత సంవత్సరాలలో తాము క్రమం తప్పకుండా స్కాలర్షిప్ ఫండ్సుని పెంచుతున్నామన్నారు. ప్రో ఛాన్సలర్, ఆర్వి విశ్వవిద్యాలయం అండ్ ఆర్ఎస్ఎస్టి, డా.(హెచ్.సి.) ఎ.వి.వస్. మూర్తి మాట్లాడుతూ... సమాజంలోని ప్రతి స్థాయి విద్యార్థులకు విద్యను అందుబాటులో వుంచాలన్నది తమ ట్రస్ట్ ఒప్పుకున్న లక్ష్యమన్నారు. కేవలం మూడవ సంవత్సరంలోనే ఆర్వియు కార్యకలా పాలలో తాము స్కాలర్షిప్ ఫండ్సుని 20 సార్లు పెంచామ న్నారు. ప్రెసిడెంట్, ఆర్ఎస్ఎస్టి, డా.ఎం.పి. శ్యామ్ మాట్లాడుతూ... అవసరంలోవున్న విద్యార్థులకు ప్రపంచ- స్థాయి విద్యను అందుబాటులోకి తేవాలన్న తమ ట్రస్ట్ మిషనుకి స్కాలర్షిప్స్ ఇవ్వడం అనే స్ఫూర్తి సరిపోతుందన్నారు.

30, 31 తేదీల్లో తారాష్ ఆభరణాల ప్రదర్శన

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఆధునిక సాంప్రదాయ మేలవింపుతో మహిళలు యువతులను ఆకట్టుకునే రాజస్థాని పోల్కి ఆభరణాలను ఎం.బీజే ఆధ్వర్యంలో ఈనెల 30, 31వ తేదీల్లో బంజారాహిల్స్లోని పార్క్ హయత్‌లో తారాష్ ఆభరణాల ప్రదర్శన నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సోనీ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ లోని పార్క్ హెూటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం మోడల్స్ వివిధ రకాల ఆభరణాలను ధరించి ప్రదర్శించారు. రెండు రోజులపాటు కొనసాగే ఈ ప్రదర్శనలో జైపూర్‌కు చెందిన రాయల్ పోల్కి వజ్ర ఆభరణాలను ప్రదర్శనలో ఉంచుతున్నట్టు మనీషా చెప్పారు. ఈ కార్యక్రమంలో మడల్స్ సోనీ, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే బాక్స్ డ్రయినేజీ పనులు పూర్తి

నవతెలంగాణ-అంబర్‌పేట



బాక్స్ డ్రయినేజీ పనులను త్వరలోనే పూర్తి చేస్తానని అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. అంబర్ పేట డివిజన్ పరిధిలోని పటేల్ నగర్ చౌరస్తాలో గల నాలా పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాలా పనులను వేగవంతంగా, త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు డీఈ సువర్ణ, ఏఈ మజీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు దుర్గ, రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, అంబర్ పేట డివిజన్ మహేష్ ముదిరాజ్, రఫీక్, సలీం, సంతోష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

భవన, ఇతర నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లను వెంటనే ఇవ్వాలి

- తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి కె.జంగయ్య
- హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా
- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-ధూల్‌పేట్/సిటీబ్యూరో





ప్రభుత్వం అసెంబ్లీలో భవన, ఇతర నిర్మాణ కార్మికులకు ప్రకటించిన మోటార్ సైకిళ్లను వెంటనే ఇవ్వాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి కె.జంగయ్య డిమాండ్ చేశారు. జిల్లాలోని భవన నిర్మాణ ఆధార్ కన్స్ట్రక్షన్స్ కార్మికులతో కలిసి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వెల్ఫేర్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లైమ్స్‌కు తక్షణమే నిధులు విడుదల చేయాలన్నారు. బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి, వెల్ఫేర్ బోర్డులోని సెస్సు నిధులు కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 54 వేల నష్టపరిహారాలకు నిధులను వెంటనే విడుదల చేయాలనీ, ప్రమాద మరణాలకిస్తున్న రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలన్నారు. సహజ మరణాలకి ఇస్తున్న రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచాలనీ, దహన సంస్కరణ ఖర్చులు, వివాహం, ప్రసూతి కానుకను రూ.30వేల నుంచి రూ.1 లక్షకు పెంచాలన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని వెంటనే కార్మిక సంఘాల నాయకులతో నియమించాలనీ, ఇన్వార్డ్ ఖాళీగా ఉన్న ఏఎల్, ఏసీఎల్, డీసీఎల్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్స్ తదితర పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కేంద్ర చట్టంలో ఉన్న పెన్షన్, స్కాలర్షిప్, గృహ వసతి, అడ్డాలో మౌలిక సౌకర్యాలు, ఇతర పథకాలన్నీ రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. కార్డు ఉండాలనే నిబంధనను ఎత్తివేయాలనీ, 2009 నుంచి వెల్ఫేర్ బోర్డులో నమోదు చేసుకున్న కార్మికుల కార్డులు యుద్ధ ప్రాతిపదికన రెన్యువల్ చేయాలన్నారు. 1979 వలస కార్మికుల చట్టాన్ని 1996 నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈశ్రమ్ గుర్తింపు కార్డులను కార్మికులందరికీ వెంటనే ఇవ్వాలనీ, వలస కార్మికుల పేర్లు నమోదు చేసి, వారికి గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి. పి.పుల్లారావు, తుపాకీ ఆంజనేయులు, నెమ్మాది కిరణ్, నెమ్మది గోపాల్, ఎస్.వెంకటేష్, వేముల అంజయ్య, కోటయ్య, నర్సమ్మ రాజు, సంజు, ఎస్.జంగయ్య, పెరోజ్, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న వాణిజ్యశాస్త్ర విద్యా ప్రాముఖ్యత

- అభ్యశిస్తే ఉపాధి అవకాశాలు పుష్కలం
- ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి

నవతెలంగాణ-ఓయూ



వాణిజ్యశాస్త్ర విద్యకు నానాటికీ ప్రాధాన్యత పెరుగుతుందనీ, ఈ కామర్స్ విద్యతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.ఆర్.లింబాద్రి అన్నారు. శుక్రవారం ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల ఆడిటోరియంలో కామర్స్ విభాగం (వాణిజ్య శాస్త్రం), విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల "ఆల్ ఇండియా కామర్స్ పోస్ట్-గ్రాడ్యుయేట్స్ మీట్-2023" ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నానాటికీ దేశ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు పెరుగుతున్న క్రమంలో ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఇందులో కామర్స్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు సులభతరంగా ఉన్నాయని తెలిపారు. ఓయూ వీసీ ప్రొ.డి.రవీందర్ మాట్లాడుతూ వాణిజ్య విభాగం కృషిని అభినందించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వాణిజ్య పాఠ్యాంశాల్లో మార్పులను ఆయన అంచనా వేశారు. కొన్నేండ్లుగా వాణిజ్యశాఖ చేస్తున్న కృషిని, ఉపాధి అవకాశాలను కల్పించడాన్ని ఆయన కొనియాడారు. వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి సీనియర్ ప్రొ. డి.చెన్నప్ప, కన్వీనర్ డా.జి.నరేష్‌రెడ్డి, బిఓఎస్ ప్రొ.వి. అప్పారావు మాట్లాడుతూ కామర్స్ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడం, వారిలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలు శక్తిని వెలికితీయడం, వారిలో నైపుణ్యాలను వెలికితీయడం, పోటీతత్వం పెంపొందించటం ఈ మీట్ ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థులకు కె స్టడీస్, బిజినెస్ ప్లాన్, బిజినెస్ క్విజ్, డేటా ఏనాలసిస్, మొదలైన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శన కనపరిచిన వారికి బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరు తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీలతో పాటు బెంగళూరు, కేరళ కామర్స్ విద్యార్థులు, అధ్యాపకులు, 356 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మీట్ కన్వీనర్ ప్రొ.జి.నరేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరాములు, డీన్ ప్రొ.గంగాధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయాలి

- మహారాష్ట్ర బ్యాంక్ ఎదుట ఉద్యోగుల ఆందోళన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకుల్లోని అన్ని క్యాడర్ల ఖాళీలను భర్తీ చేసి పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ మహా బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమాన్ టెక్డి లోని బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వద్ద వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన ధర్నాలో భాగంగా ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ కన్వీనర్ రేవంత్ కుమార్, కో-కన్వీనర్ కె.కాంతారావు మాట్లాడుతూ ఉద్యోగులు పని భారంతో ఒత్తిడికి గురవుతున్నారన్నారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రెండు నెలలుగా బ్యాంకుల్లో నియామకాల్లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. బ్యాంకుల్లో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనీ, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. పదోన్నతులు, మరణాల కారణంగా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పదేండ్ల కాలంలో బ్యాంకుల వ్యాపారం 250 శాతం కానీ సిబ్బంది 20 శాతం తగ్గారనీ, దీంతో బ్యాంకు ఉద్యోగుల పై పని భారం పడిందన్నారు. ఉద్యోగులు అన్ని రోజుల్లో సాధారణ పని వేళల గురించి పని చేయాల్సి వస్తుందనీ, సెలవు దినాల్లో సైతం రిపోర్ట్ చేయాల్సి ఉంటూ వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో తాము సమ్మెకు దిగాల్సి వచ్చిందనీ, వినియోగదారులు అర్థం చేసుకోవాలని కోరారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కో - కన్వీనర్ కాంతారావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అనయ హాస్పిటల్‌కు 'అఫడబుల్' అవార్డు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలోని పలు గ్రామాలు, పట్టణాలు, హైదరాబాద్ నగరంలోని అనేక బస్తీల్లోని నిరుపేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నందుకుగాను తమ వైద్య సేవలను గుర్తించి తమ హాస్పిటల్‌కు 'తెలంగాణ ది మోస్ట్ అఫడబుల్ అవార్డు'ను పలువురు కేంద్ర మంత్రులు అర్జున్ లాల్ మీనా, డాక్టర్ కిరీట్ సోలంకి, రాజేందర్ అగర్వాల్, బాలీవుడ్ సినీ నటి భాగ్యశ్రీ చేతుల మీదుగా అందుకున్నట్టు అనయ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రోషన్ రెడ్డి తెలిపారు. ఈ అవార్డు రావడం గర్వకారణం అన్నారు. కరోనా, డెంగ్యూ, డయేరియా, అర్షమొలలు, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, కడుపులో మంట, మైగ్రేన్, నార్మల్ డెలివరీ వంటి తదితర వ్యాధులపై పల్లె, పట్టణ, నగర ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తూ వేలకు పైగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. తాము చేసిన వైద్య సేవలకు గుర్తింపుగా పలు రాష్ట్రాల ప్రముఖుల నుంచి అవార్డులు, పురస్కారాలు లభించాయన్నారు. తమ హాస్పిటల్‌లో ప్లాస్టిక్, కాస్మోటిక్ సర్జరీ, పుల్మనాలజీ, స్లీప్ మెడిసిన్, ఈఎన్‌టీ, హెడ్, నెక్ సర్జరీ, అడ్వాన్సుడ్ లేజర్ ట్రీట్మెంట్, లేజర్ స్టాప్లర్ సర్క్యూమసిషన్, వారికోస్ వెయిన్స్, ఆల్ట్రా స్కాన్, యూరిన్, బ్లడ్ పరీక్షలు, పీ-స్కాన్ వంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ : 8182891928, www.anaya-hospitals.in లను సంప్రదించవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్సల్టెంట్ లేజర్ లాప్రోస్కోపీ, రోబోటిక్ సర్జన్ డాక్టర్ ఉదయ్ కిరణ్, కన్సల్టెంట్ ఫిజీషియన్, పుల్మనాలజిస్ట్, డయాబెటాలజిస్ట్, క్రిటికల్ కేర్, స్లీప్ స్పెషలిస్ట్ డాక్టర్ మహమ్మద్ వసీమ్, డమనోజీయాలజిస్, గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీగౌరీ పాల్గొన్నారు.



అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

నవతెలంగాణ-అంబర్‌పేట



అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గోల్నాక డివిజన్ పరిధిలోని శంకర్ నగర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అభివృద్ధే తమ ధ్యేయం అన్నారు. రెండేండ్లలో గోల్నాక డివిజన్ చాలా అభివృద్ధి చెందినట్టు తెలిపారు. రాబోయే మూడేండ్లలో పూర్తి అభివృద్ధి చేసి ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. పేద ప్రజలు ఇండ్లు కడుతుంటే కొంతమంది నాయకులు తమ పేరు చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడితే ప్రజలు నేరుగా వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలనీ, తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ భూములలో అక్రమ కట్టడాలు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు.

వికలాంగ విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

నవతెలంగాణ-ధూల్‌పేట్



వికలాంగులైన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమ ని జమాతె ఇస్లామి హింద్ మహిళా విభాగం అసిస్టెంట్ మోడరేటర్ నాసిరా ఖానుమ్, ఐఐసీడీ వైస్ చైర్మన్ సయ్యద్ ఖలీలుర్ రహ్మాన్ అన్నారు. ఆజంపురాలో గల ఐడియల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఫర్ డిసేబుల్డ్ (ఐఐసీడీ) లో 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 15 ఏండ్ల నుంచి వికలాంగ విద్యార్థులకు ఉచిత విద్యనందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉచిత విద్యనందిస్తున్న సంస్థతోపాటు, అందుకు సహాయ సహ కారాలు అందిస్తున్న వారందరూ అభినందనీయులన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు బహుమతు లను ప్రదానం చేశారు. ఉమ్మత్ సొసైటీ కార్యదర్శి ఖాలిదా పర్వీన్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయ బృందం, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పీపుల్స్ ప్లాజాలో హార్టికల్చర్, అగ్రికల్చర్ షో

నవతెలంగాణ-అంబర్‌పేట



నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆలిండియా హార్టి కల్చర్, అగ్రికల్చర్ షో నగర ప్రజలను ఆకట్టుకుంటోంది. ఈనెల 26వ తేదీ నుంచి కొనసాగుతున్న గ్రాండ్ నర్సరీ ప్రదర్శనలో రోబోటిక్ వ్యవసాయం, టెర్రస్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెనింగ్, హైడ్రోఫోనిక్ సిస్టమ్ వంటి నూతన టెక్నాలజీ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. 150కు పైగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో నర్సరీ స్టాల్స్ మెడిసినల్ ప్లాంట్స్ కిచెన్, అవుట్ డోర్, ఎక్ సోటిక్ టిక్, బల్బ్స్, సీడ్, సీడ్ లింక్స్, ఇండోర్, ఆడినియం, బోన్సాయ్, క్రీపర్స్, ఫ్లవర్స్, ఇంపోర్టెడ్ ప్లాంట్స్ అందుబాటులో ఉన్నాయి. డార్జిలింగ్, కోల్‌కతా, ఢిల్లీ, హర్యానా, ముంబయి, బెంగుళూరు, పూణే, షిర్డీ, కడియం, చెన్నై తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల నుంచి వచ్చిన ప్లాంట్స్ ప్రదర్శిస్తున్నారు. బోన్సాయ్ వృక్షాలు, పూలు, పండ్ల మొక్కలు అబ్బుర పరుస్తున్నాయి. నెక్లెస్ రోడ్డులో ఉదయం 9గంటల నుంచి రాత్రి 10గంటల వరకు అందుబాటులో ఉంటాయి. రూ.50 నుంచి రూ.1లక్ష వరకు మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా మేళా ఇన్‌చార్జి ఖలీద్ అహ్మద్ తెలిపారు.



విద్యార్థి సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్‌లో శుక్రవారం విద్యార్థి సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓయూ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు పిడమర్తి రవి, ఓయూ ప్రొ.ఇటుకల పురుషోత్తం హాజరై మాట్లాడారు. ఓయూ నిర్వహించిన పీహెచ్డీ ఎంట్రెన్స్ టెస్ట్ పరీక్షా విధానం సరికాదన్నారు. పరిశోధన పట్ల ఆసక్తి ఉన్న వారికి అవకాశం కల్పించాల్సిన బాధ్యత యూనివర్సిటీలకు ఉంటుందన్నారు. రీసెర్చ్ మెథడాలజీ లేని ఈ పరీక్ష విధానాన్ని వెంటనే సవరించి విద్యార్థులకు పరిశోధన చేయడానికి పీహెచ్‌డీ అర్హత పరీక్ష, మాతృభాషలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక మొదటితరం విద్యార్థులకు ఈ ఎంట్రన్స్ టెస్టుల పేరుతో పరిశోధనకు దూరం చేయడం అత్యంత బాధాకరం అనీ, ఇందులో పెద్ద కుట్ర దాగుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఒకే రకమైన పర్సంటేజీ అర్హత మార్కులు పెట్టడం దుర్మార్గమైన నిర్ణయం అన్నారు. వివిధ విద్యార్థి నాయకులు మాట్లాడుతూ పీహెచ్డీ ఎంట్రన్స్ టెస్ట్, ర్యాంకు కాకుండా నోటిఫికేషన్ ను సవరణ చేయాలని నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మార్కులతో సంబంధం లేకుండా ఇంటర్వ్యూలకు పిలవాలనీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ, సామాజిక విద్యార్థులకు 15 మార్కులు, ఓసీ విద్యార్థులకు 20 మార్కులు ఉండాలనీ, లేదా ఆర్డర్ ఆఫ్ మెరిట్ విధానం ద్వారా అడ్మిషన్‌లు నింపాలని ఓయూ అధికారులకు సూచించారు. పైన డిమాండ్ల సాధన కోసం వివిధ నిరసన, ఆందోళనలు ప్రజా సంఘాల నాయకులను, రీసెర్చ్ స్కాలర్ విద్యార్థులను కలుపుకొని గెరిల్లా ఉద్యమం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు కోట శ్రీనివాస్, నాగేశ్వర్ విద్యార్థి సంఘాల నాయకులు చటారి దశరథ్, రవి నాయక్, నల్గొండ అంజి, అశోక్ నాయక్, సుమంత్, స్వాతి, పల్లపు చందు, ప్రశాంత్, జంగయ్య, పూసల రమేష్, శ్రీకాంత్, మిథున్, తదితరులు పాల్గొన్నారు.



బీసీ జన గణనకు ఫిబ్రవరి 6న చలో ఢిల్లీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

దేశ వ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 6వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలంగాణ బీసీ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేంద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో చలో ఢిల్లీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో సగానికి పైగా ఉన్న బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు సర్వరోగ నివారిణి కేవలం బీసీ జనాలన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలని ఆదేశాలు జారీ చేసినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా బీసీ జన గణన చేపట్టడం లేదన్నారు. వచ్చే నెలలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో చలో ఢిల్లీ నిర్వహించ తలపెట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు కే.నరేష్, సతీష్ గౌడ్, రామకృష్ణ రాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

29న నారాయణ్ సేవా సంస్థాన్ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వికలాంగులు, పేదల పునరావాసం కోసం పని చేస్తున్న ప్రముఖ సేవా సంస్థ నారాయణ్ సేవా సంస్థాన్ ఆధునాతన వసతుల తో పునర్ నిర్మించిన భవనం ప్రారంభోత్సవం ఈ నెల 29వ తేదీన ప్రారంభిస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధులు అల్కా చౌదరి, జస్మత్ పటేల్, రిథిష్ జాగీదార్ తెలిపారు. శుక్రవారం ఇసామియా బజారులోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నారాయణ సేవా సంస్థాన్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరుకానున్నట్టు తెలిపారు. సేవా సంస్థ కేంద్రంలో వికలాంగులకు ఫిజియోథెరపీ సెంటర్, మొబైల్ రిపేరింగ్, కంప్యూటర్ ట్రైనింగ్, కుట్టు శిక్షణ అందిస్తామని తెలిపారు. వికలాంగ రోగులకు ఉచిత రోగనిర్ధారణ ద్వారా ఉదయ్ పూర్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు అందిస్తామన్నారు. కృత్రిమ అవయువాల పంపిణీ చేస్తున్నామన్నారు. అబిడ్స్‌లోని తాజ్మహల్ హెూటల్లో నారాయణ్ సేవా కేంద్రంలో విశేష సేవలు అందించిన ప్రముఖులను సత్కరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ముదిరాజ్‌లకు రూ.5వేల కోట్లతో ప్రత్యేక ఆర్థిక సహకార సంస్థను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-అడిక్‌మెట్



ముదిరాజ్‌లకు రూ.5వేల కోట్లతో ప్రత్యేక ఆర్థిక సహకార సంస్థను ఏర్పాటు చేయాలని ముదిరాజ్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ముదిరాజ్ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ ముదిరాజ్ సంఘాలు అన్ని ఏకమై ఒక జేఏసీగా ఏర్పడి సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ(డీ) నుంచి బీసీ(ఏ)లోకి తక్షణమే చేర్చి జీవో నెంబర్ 15 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో మత్స్యకారుల రక్షణ చట్టం తీసుకొచ్చి మత్స్యకారులకు రక్షణ కల్పించాలన్నారు.6 జీవోను వెంటనే అమలు చేయాలనీ, గ్రామాల్లో ముదిరాజ్‌లకు మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని కోరారు. 18 ఏండ్లు నిండిన యువతీ యువకులకు మత్స్యసహకార సొసైటీల లో సభ్యత్వాలు తక్షణం కల్పించాలన్నారు. తెలంగాణలోని ప్రాజెక్టుల్లో సోలార్ ప్లాంట్లు కేజీ కల్చర్స్ మల్టీ నేషనల్ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకతీతంగా సంఘాలు ఏవైనా ముదిరాజుల సమస్యల సాధన కోసం ఏకమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నిరాహార దీక్షలో ముదిరాజ్ జేఏసీ నాయకులు జగన్మోహన్, చెప్పురి శంకర్, లక్ష్మీనారాయణ, వినోద్ కుమార్, బొమ్మరి గోని రాజు, తెలంగాణ సంపత్, పిట్టల నగేష్, కొప్పుల జానకిరామ్, పరిటాల సుధాకర్, మద్దెల సంతోష్, జగడల శ్రీనివాస్, రస వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

కీరన్ పోలార్డ్‌కు బౌలింగ్ వేయాలని ఉంది

- సంచిత్ శర్మ

నవతెలంగాణ - హైదరాబాద్

డీపీ వరల్డ్ ఐఎల్టి20 లీగ్ కీరన్ పోలార్డు బౌలింగ్ చేసేందుకు వేచి చూస్తున్నానని జీతో ప్రత్యేకంగా మాట్లాడుతూ గల్ఫ్ జెయింట్స్ అండ్ యూఏఈ బౌలర్ సంచిత్ శర్మ తెలిపారు. ఫ్రాంచైజీ తరహాలో నిర్వహిస్తున్న టోర్నమెంట్ - డీపీ వరల్డ్ ఇంటర్నేషనల్ లీగ్ టీ 20లో ఆరు జట్లు అండ్ 34 మ్యాచ్లు ప్రస్తుతం యూఏఈలో నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు జీ లీనియర్ ఛానెళ్లు, డిజిటల్ ప్లాట్ఫారమ్, జీ5 అలాగే, జీ సినిమా ఎస్ఓ, జీసినిమా హెచ్, జీ అన్మోల్ సినిమా అండ్ పిక్చర్స్ హెల్డీ అండ్ ఫ్లిక్స్ ఎస్ఓ అండ్ ఫిక్స్ హెచ్, జీ జెస్ట్ ఎసీ, జీ జెస్ట్ హెచ్, జీ బంగ్లా సినిమా, జీ తిరై, యూఏఈ, ఎంఇఎన్ఏ ప్రాంతాల్లో క్రిక్లోఫ్లో ఈ ఉత్తేజకరమైన క్రికెట్ లీగ్ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించవచ్చు. కీరన్ పొలార్డ్కు బౌలింగ్ చేయాలని కోరుకుంటున్న విషయమై సంచిత్ శర్మ మాట్లాడుతూ... అవును, స్పష్టంగా చెప్పాలంటే, ప్రతి జట్టులో కొంతమంది ఆటగాళ్లకు తాను బౌలింగ్ చేయాలని కోరుకుంటూ, అవకాశం కోసం వేచి చూస్తున్నానన్నారు.

వజ్రాల తస్కరన కేసు ఛేదన

- అంతరాష్ట్ర నిందితుడి అరెస్టు
- రూ.18లక్షల విలువగల 64క్యారెట్ల వజ్రాలు స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఛాకచక్యంగా దృష్టి మళ్లించి రూ.లక్షలు విలువగల వజ్రాలను తస్కరించిన అంతరాష్ట్ర నిందితుడిని అఫ్జల్‌గంజ్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం డీసీపీ సునిల్‌దత్ వివరాల మేరకు కర్ణాటకకు చెందిన మహమ్మద్ రుహిలా 'జెమ్ స్టోన్స్ వ్యాపారం' చేస్తుంటాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో సులువుగా డబ్బులు సంపాదించాలని ఇతర రాష్ట్రాల్లోని వ్యాపారులను టార్గెట్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో గుజరాత్ రాష్ట్రానికి చెందిన వివేక్ జతిన్ అనే వజ్రాలా వ్యాపారిని టార్గెట్ చేశాడు. 'డైమాండ్స్ ఇన్ ఇండియా మార్ట్' పేరుతో ఆన్‌లైన్‌లో వజ్రాల వ్యాపారం వివేక్ చేస్తున్నాడు. వెబ్‌సైట్ ను చూసిన మహమ్మద్ డైమండ్స్ కొనుగోలు చేస్తామని వివేక్‌ను ఆన్‌లైన్‌లో సంప్రదించాడు. తన సోదరుడు హైదరాబాద్‌కు వస్తున్నాడనీ, హైదరాబాద్, అఫ్జల్‌గంజ్‌లోని అంబేద్కర్ లాడ్జ్‌లో కలుసుకోవాలని నిందితుడు సూచించాడు. దాంతో ఈ నెల 25వ తేదీన బాధితుని సోదరుడు లాడ్జిలో నిందితున్ని కలుసుకున్నాడు. డైమండ్స్ పరిశీలించినట్టు నటించిన నిందితుడు రూ.18లక్షల విలువగల 64క్యారెట్ల వజ్రాలను ఛాకచక్యంగా వారి దృష్టి మళ్లించి వాటిని తస్కరించాడు. అయితే ఆలస్యంగా గుర్తించిన బాధితులు అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అఫ్జల్‌గంజ్ ఎస్‌హెచ్‌వో ఎం.రవీందర్‌రెడ్డి ఆదేశాలతో డీఐ ఏ.సతీష్ విచారణ చేపట్టారు. సీసీటీవీ పుటేజీ ఆధారంగా నిందితున్ని గుర్తించిన పోలీసులు అరెస్టు చేశారు. ఈ సమావేశంలో సుల్తాన్‌బజార్ ఏసీపీ దేవేందర్, ఎస్‌హెచ్‌వో ఎం.రవీందర్‌రెడ్డి, డీఐ ఏ.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-ఓయూ

ఓ కార్యకర్త వివాహానికి హాజరయ్యేందుకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లోని చీరాలకు చేరుకున్న డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్‌కు స్థానిక బీసీ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. చీరాల పద్మశాలి సంఘం నేత మల్లికార్జున్‌తో పాటు గంగాపుత్ర, గౌడ సంఘాల నేతలు పద్మారావు గౌడ్ కు ఘనంగా పలికి సత్కరించారు. వివాహ వేడుకను ముగించుకున్న వెంటనే పద్మారావు గౌడ్ నగరానికి తిరుగు పయనమయ్యారు.



ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

నియోజకవర్గం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

శ్రీనివాస్‌నగర్ నల్ల పోచమ్మ గుడి అధ్యక్షుడిగా ఎన్నికైన బండారు సురేష్ నాయిని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గుడిలో అమ్మవారి ఆశీస్సులతో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ సీనియర్ లీడర్ నవాబ్ భాయి, నియోజకవర్గం అధ్యక్షులు ఏ రేణయ్య నాయి, ప్రధాన కార్యదర్శి కె.పరమేష్ నాయి, ఉపాధ్యాయులు ఎస్ఎంఎస్ సురేష్ నాయి, సలహాదారులు ఎం.బిక్షపతి నాయి, జెయింట్ సెక్రెటరీ జి.వెంకటేష్ నాయి, స్వామినాయి, జానకి రాములు నాయి, శ్రీనివాస్‌నగర్ కమిటీ సభ్యులు నరేందర్ నాయి ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేసి, బాధ్యతగా గుడి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

శివశంకర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శివశంకర్ కాలనీ వాటర్ పంప్ హౌజ్ లైన్‌లో ఎస్.టి.పి నిర్మిస్తున్నందు వల్ల ఎస్.టి.పి పనులకు సంబంధించిన మేఘా ఇంజనీరింగ్ బస్తీకి సంబంధించిన డ్రైనేజీ లైన్లను నిలిపివేయడంతో శుక్రవారం సమస్యను బస్తీలోని మహిళలు జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఫతే నగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు కార్పొరేటర్ సానుకూలంగా స్పందిస్తూ జలమండలి మేనేజర్ అనిల్ కుమార్‌తో కలిసి బస్తీ వసూలు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి సమస్యని వెంటనే వాటిని పరిష్కరించే విధంగా మెఘా ఇంజినీరింగ్ సిబ్బందితో చర్చించి సమస్యను పరిష్కరించ బడుతుందని బస్తీవాసులకు ఆయన హామీ ఇచ్చారు.

బాలానగర్ డివిజన్ అభివృద్ధికి ఎన్ని నిధులైనా వెచ్చిస్తాం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్, బాలానగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో రూ.1కోటి 33లక్షల 65 వేల రూపాయల సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో రాజీవ్ గాంధీ నగర్‌లో రూ.20లక్షలతో సీసీ రోడ్డు, దిల్‌సుఖ్‌నగర్‌లో రూ.25.19 లక్షల వ్యయంతో పీజేఆర్ విగ్రహం వద్ద రూ.66 లక్షలు, హరిజన బస్తీలో రూ.22.55 లక్షలు రోడ్ల నిర్మాణాలకు కేటాయించామని, ఎంతోమంది కార్మికులు నివసిస్తున్న బాలానగర్ ప్రాంతాన్ని గతంలో అనేక మంది ఉద్దండులు, కేంద్ర మంత్రులు ప్రాతినిధ్యం వహించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్న పరిస్థితుల్లో కూడా పట్టించుకున్న పాపాన పోలేదని, దశాబ్దాలుగా వారు ట్రాఫిక్, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలకు కూడా నోచుకోని స్థితిలో ఉండేవారని, నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో కేవలం ఎనిమిదేళ్ల కాలంలో వేలకోట్ల రూపాయలతో బాలానగర్ డివిజన్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దామని, అందుకు నిదర్శనమే కంటి ముందు కనిపిస్తున్న బాలానగర్ ఫ్లై ఓవర్, దిల్‌సుఖ్‌నగర్ రోడ్లు, ఇందిరానగర్ బస్తీ రోడ్లు, అదేవిధంగా పార్కులు, ఓపెన్ జిమ్‌లు, కమ్యూనిటీ హాల్స్ తదితర అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తూ అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం మరింత ముందుకెళు న్నామని ఎమ్మెల్యే కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ డైరీని ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

పీఆర్‌టీయూ టీఎస్ నూతన డైరీని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు బి.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.తిరుపతి రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్ రజిత, ముజతబ అలీ, మూర్తి, నటరాజ, అశోక్, రాజేంద్రప్రసాద్, నారాయణ, రవీందర్, వెంకటేష్, మేరాజ్ సుల్తానా, లోకేష్ పాల్గొన్నారు.

'స్పీక్ ఏ బుక్' కాంపిటీషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

- పుస్తక పఠనం ప్రపంచంలోని విజయవంతమైన నాయకుల అలవాట్లలో ఒకటి
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 120 పాఠశాలల్లో నిర్వహించనున్న పోటీలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పుస్తక పఠనం ప్రపంచంలో విజయవంతమైన నాయకుల అలవాట్లలో ఒకటని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. చింతల్ డివిజన్ పరిధిలోని చింతల్ భగత్‌సింగ్ నగర్ జిల్లాపరిషత్ పాఠశాలలో 26 జనవరి, రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ 'స్పీక్ ఏ బుక్' కాంపిటీషన్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 120 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే ఈ పోటీల లక్ష్యం, ఆవశ్యకత వివరించే కరపత్రం సర్టిఫికెట్‌ను ఆవిష్కరించారు. విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచటానికి వారిలో భావవ్యక్తీకరణ సామర్థ్యం పెంచటానికి ఈ పోటీలను 5ఈ ఛాంపియన్ ప్రొఫైల్ అనే సంస్థ ప్రతిపాదించిందని, ఈ మేరకు ఎమ్మెల్యే స్పందించి నియోజకవర్గంలోని 120 పాఠశాలల్లో నిర్వహించేందుకు కరపత్రాలు, సర్టిఫికెట్స్, బహుమతులు అందజేసేందుకు ముందుకు వచ్చారు. "స్పీక్ ఏ బుక్" పోటీల ద్వారా వారు ఆ ఛాలెంజ్‌ను కొంత వరకు అధిగమించగలుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులలో అకడమిక్ ఎక్సలెన్స్‌కు మించి, ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్, పర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ సాధించడానికి సెల్ఫ్ అవేర్‌నెస్ క్రియేట్ చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు.

ఛాంపియన్ ప్రొఫైల్‌లోని ఒక అంశము పుస్తక పఠనం, మన ఆలోచనా పరిధులను విస్తృతం చేస్తుందని, స్థానిక వాతావరణాన్ని మించి ప్రపంచ దృశ్యాన్ని అందిస్తుందని, మన లక్ష్యాలను సాధించడంలో ఒక ఉత్ప్రేరకంగా సహాయపడుతుందన్నారు.

మహిళా చైర్‌పర్సన్‌పై ఎమ్మెల్యే వేధింపులు తగదు

మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు జెన్ను మన్నెం



నవతెలంగాణ-దుండిగల్

బలహీనవర్గానికి చెందిన జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణిపై స్థానిక శాసనసభ్యుని వేధింపుల వల్ల తాను రాజీనామా చేస్తున్నట్టు తెలిపి రాజీనామా చేయడం పట్ల అధికార పార్టీ ఎమ్మెల్యేకు తగదని మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు జెన్ను మన్నెం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం బాచుపల్లిలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలలో విభేదాలు, అంతర్గత విషయాలు ఎట్లున్నా, సమస్యను పరిష్కరించవలసిందిగా భారత రాష్ట్ర సమితి అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవలసి ఉండగా, మహిళా చైర్‌పర్సన్‌పై కక్ష సాధింపు చర్యతో ఓ శాసనసభ్యుడు వేధింపులకు పాల్పడడం ఆయన స్థాయి మరిచి దిగజారుడుకు నిదర్శనమని తెలిపారు. ఒకప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజకీయంగా పద్మశాలీలు ఉన్నత స్థానం కల్పించారని, ఇటీవలి కాలంలో అదే జిల్లాకు చెందిన ఎల్. రమణకి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి పద్మశాలీలకు ముఖ్యమంత్రి కేసీఆర్ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలని, అదే నియోజకవర్గం నుండి ఇప్పుడు అదే పద్మశాలి సామాజిక వర్గంకి చెందిన భోగ శ్రావణిని పదవి నుంచి తొలగించడం పద్మశాలి సామాజికవర్గం అవమానంగా గుర్తిస్తుందని ఎమ్మెల్సీ కవిత ప్రోత్సాహం, కేటీఆర్ ఆశీర్వాదంతో గత మూడు సంవత్సరాలుగా చైర్‌పర్సన్ గా కొనసాగిన భోగశ్రావణి విషయంలో కేటీఆర్, కవిత స్పందించి అధికార పార్టీ ఎమ్మెల్యే తీరుపై అధిష్టానం చర్యలు చేపట్టి భోగి శ్రావణి రాజీనామా సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి కొలిపాక శ్రీనివాస్, పద్మశాలి సంఘం గౌరవ సలహాదారు పెద్ది మల్లేశం, ప్రధాన ప్రధాన కార్యదర్శి పుట్ట శివశంకర్, కోశాధికారి మాక మల్లేష్ పాల్గొన్నారు.

శ్రీ నల్లపోచమ్మ ఆలయ కమిటీ హాల్ ప్రారంభం





నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్‌నగర్ 130 డివిజన్ పరిధిలోని సుభాష్‌నగర్ నల్లపోచమ్మ ఆలయ కమిటీ వారు సుమారు రూ.85లక్షలతో నూతనంగా నిర్మించిన కమిటీ హాల్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆలయ కమిటీ హాల్‌ను ప్రారంభించడం పట్ల ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కమిటీ హాల్ స్థలాన్ని ఏళ్లుగా కాపాడి ప్రజలకు ఉపయోగపడేవిధంగా ముందుకు వచ్చిన కమిటీ సభ్యులను అభినందించారు. రాబోయే రోజుల్లో ఇదే ఐక్యమత్యంతో ఉంటూ ఎటువంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకు రావాలని, వాటి పరిష్కారం కోసం ఎల్లవేళలా ముందు ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అడ్వైజర్ సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణ, శ్రీనివాస్, శ్రీనివాస చారి, శ్రీకాంత్, బాలస్వామి, మోహన్‌రెడ్డి, డివిజన్ బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసిన రాచకొండ సీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

పహాడిషరీఫ్, బాలాపూర్ రెండు పోలీస్‌స్టేషన్లను శుక్రవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదులపై ఆరా తీశారు. బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు.

ఈ తనిఖీల్లో ఎల్బీనగర్ డీసీపీ సన్‌ప్రీత్ సింగ్, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, పహాడీషరీఫ్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రక్తదానం చేయడం అభినందనీయం

నవతెలంగాణ-దుండిగల్

ఆపదలో ఉన్న వారి కోసం ప్రగతి యూత్ అసోసియేషన్ వారు రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమని కార్పొరేట్ శ్రీరాములు తెలిపారు. ప్రగతి యువజన సంఘం 74వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్.శ్రీరాములు హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో 41 మంది పాల్గొన్నారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వారికి రక్తం దానం చేసారు. కార్పొరేటర్ వెంకటరామయ్య, సుందరయ్య భవన్ కన్వీనర్ మల్లయ్యచారి, జయబాబు యూత్ ప్రసిడెంట్ విప్లవ్, ప్రవీణ్, ధనుష్, మార్క్స్, ధినెష్, జీవన్, రాజేష్, కార్తిక్, రద్రసాగర్, రవి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా హలో! హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డులు - సౌత్

నవతెలంగాణ - హైదరాబాద్

మొదటి ఎడిషన్ హలో! హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డులు - సౌత్ ద్వారా పరిశ్రమల వ్యాప్తంగా విశిష్ట వ్యక్తులను గుర్తించడంతో పాటుగా కళాకారులు, ప్రొఫెషనల్స్, సంస్థలను సైతం అట్టహాసంగా జరిగిన భారీ వేడుకలో గౌరవించారు. ఆర్పీ-సంజీవ్ గోయెంకా గ్రూప్ కు చెందిన హలో మ్యాగజైన్ తమ మొట్టమొదటి సౌత్ ఎడిషన్ హలో ! హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డుల విజేతలను వెల్లడించింది. ఈ కార్యక్రమానికి హెూస్ట్ గా సోఫీ చౌదరి వ్యవహరించారు. ఈ సందర్భంగా హలో ఎడోటిరయల్ చైర్పర్సన్ అవర్ణ జైన్ మాట్లాడుతూ... అత్యంత ప్రతిష్టాత్మకమైన హలో ! హాల్ ఆఫ్ ఫేమ్ -సౌత్ అవార్డులను హలో ! నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సౌత్ స్టార్స్, పవర్, అద్భుతమైన ప్రతిభకు సాక్షిగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఓ బ్రాండ్గా హలో! ఎప్పుడూ కూడా సృజనాత్మక ప్రతిభకు మద్దతు అందించడాన్ని గౌరవంగా భావిస్తుందన్నారు. మరీ ముఖ్యంగా ఔత్సాహిక లేదా ఇప్పటికే గుర్తింపు పొందిన వ్యక్తులను ఫ్యాషన్, సాహిత్యం, థియేటర్, సినీ, క్రీడలు, దాతృత్వరంగంలో గుర్తిస్తుంటామన్నారు. హలో ! హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డులు - సౌత్ అనేది గత కొద్ది సంవత్సరాలుగా తాము ఏర్పరుచుకున్న సుదీర్ఘ బంధానికి ప్రతీక అని అన్నారు.

ఏఐఎల్‌యూ 4వ మహాసభను జయప్రదం చేయండి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె ఎస్. శర్మ



నవతెలంగాణ-బాలానగర్

అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఏఐఎల్‌యు) ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కె.ఎస్ శర్మ పిలుపు నిచ్చారు. నేడు మహాత్మా గాంధీ లా కాలేజ్, రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణంలో జరుగుతున్న ఈ మహాసభల్లో ప్రధాన వక్తగా జస్టిస్ డా.జి.రాధారాణి మహాసభను ప్రారంభిస్తారని, ఈ మహాసభలో న్యాయవాదులు ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అన్‌లైన్ ద్వారా 'పరీక్ష పే' చర్చలో ప్రధాని నరేంద్ర మోడీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

భారత ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులకు రానున్న వార్షిక పరీక్ష ఒత్తిళ్ళ నుండి ఏరకంగా బయటపడాలి, ఏ విధంగా చదవాలి అనే విషయాలకై ఏర్పాటు చేసిన పరీక్ష పై చర్చ కార్యక్రమం అన్ లైన్ ద్వారా స్ప్రింగ్స్ స్కూల్ భరత్‌నగర్‌లో విద్యార్థులతో పాటు వీక్షించి, వారి సందేహాలను మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్ కొడిచెర్ల నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వారికి ఎంత బిజీ పనులు ఉన్నప్పటికీ విద్యార్థులే రేపటి భావి భారత భవిష్యత్ అని, శుక్రవారం ఉదయం 11 గంటల నుండి ఒంటి గంట వరకు సుమారు 2గంటల పాటు, విద్యార్థుల యొక్క ప్రశ్నలకు సమాధానాలు చెప్పుతూ వారు ఏరకంగా పరీక్షలు రాయాలి, ఎలా చదవాలి, పరీక్ష సమయాలలో ఎలాంటి ఒత్తిడిలకు లోనుకాకుండా ఉండేందుకు, అనేక రాకాల సులభ మార్గాలు మెళకువలు వివరించడం గొప్ప విశేషం అన్నారు. ఇలాంటి కార్యక్రమం మా పాఠశాలలో ఏర్పాటు చేసినందుకు పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, మూసాపేట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పిట్ల మనోహర్, డాకయ్య , మల్లేష్ గౌడ్ ,ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలాకి కిషోర్, సతీష్ చారి, నాగరాజు, బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షులు రవి గౌడ్ , శ్రీకాంత్, మహిళ మోర్చ అధ్యక్షులు మంగమ్మ బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ ఇ, సాయి పాల్గొన్నారు.





భారత క్రీడారంగంలో ఆమెది ప్రత్యేక ప్రస్థానం. ఆటతో పాటు సమాజం ఛత్రాల సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని నిలిచిన చరిత్ర ఆమెది. మేరీకోమ్, సైనా నెహ్వాల్, పి.వి సింధు కంటే ముందే భారత క్రీడారంగ ముఖచిత్రంగా నిలిచిన సానియా మీర్జా గ్రాండ్‌స్లామ్ కెరీర్‌ను గ్రాండ్‌గా ముగించింది. 36 ఏండ్ల సానియా మీర్జా ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో గ్రాండ్‌స్లామ్ కెరీర్‌ను ముగించింది.

సరిలేరు సానియాకెవ్వరు

• ముగిసిన గ్రాండ్‌స్లామ్ కెరీర్ • భారత టెన్నిస్ ముఖచిత్రం

నవతెలంగాణ క్రీడావిభాగం

'నేను ఇప్పుడు కంటతడి పెడితే అవి ఆనందభాష్పాలే, బాధ నుంచి వచ్చినవి కావు' 2023 ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్స్ అనంతరం సానియా మీర్జా వ్యాఖ్యలు ఇవి. ఎక్కడైతే గ్రాండ్‌స్లామ్ కెరీర్ మొదలుపెట్టిందో, అక్కడే గ్రాండ్‌గా గ్రాండ్‌స్లామ్ కెరీర్‌ను ముగించింది సానియా మీర్జా. 36 ఏండ్ల సానియా మీర్జా ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ రన్నరప్ ట్రోఫీతో వీడ్కోలు పలికింది. టెన్నిస్ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టాలకు వేదికగా నిలిచిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఐకానిక్ కోర్టు భారత క్రీడా దిగ్గజం సానియా మీర్జా వీడ్కోలుకు వేదికైంది.

ఆమె దారి రహదారి

భారత్‌లో మహిళలు క్రీడల్లో రాణించాలంటే, తొలుత కుటుంబం, ఆ తర్వాత సమాజం.. ఆ తర్వాతే ప్రత్యర్థులతో పోటీ పడాలి. క్లిష్టమైన సవాళ్ల నడుమ ఆ పని చేసింది సానియా మీర్జా. మధ్యతరగతి ముస్లిం కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగిన సానియా మీర్జా ప్రస్థానం పూల బాట కాదు. టెన్నిస్ కోర్టులో రాకెట్ పట్టడానికి ముందే ఓ యుద్ధం చేసిన సానియా మీర్జా.. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నడూ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. ఎంసీ మేరీకోమ్, సైనా నెహ్వాల్, పి.వి సింధుల కంటే ముందుగానే భారత క్రీడా రంగ ముఖచిత్రంగా, ప్రత్యేకించి మహిళా అథ్లెట్లకు సూపర్‌స్టార్‌గా నిలిచింది సానియా మీర్జా. సంప్రదాయాలు, కట్టుబాట్లను దాటుకుంటూ సరికొత్త పంథాలో నడిచిన సానియా మీర్జా.. భారత క్రీడా రంగంలో మహిళా అథ్లెట్లకు దారి చూపిన బాటసారి. భారత్‌కు అసమాన విజయాలు సాధించినా, ఆమె దేశభక్తి ప్రశ్నార్థకమైంది. పాకిస్థాన్ క్రికెటర్‌తో వివాహంతో వ్యక్తిగత జీవితంపైనా విమర్శలు వెల్లువెత్తాయి. అయినా, సానియా మీర్జా అధైర్యపడలేదు. ఎంచుకున్న మార్గంలో విజయవంతమైన సానియా మీర్జా.. తనెంటో సాధించిన ఘనతలు, రికార్డులతోనే విమర్శలకు సరైన సమాధానం ఇచ్చింది. షోయబ్ మాలిక్‌తో ఓ బిడ్డకు జన్మనిచ్చిన సానియా మీర్జా.. ఎవరూ ఊహించని విధంగా టెన్నిస్‌లో రీ ఎంట్రీ ఇచ్చింది. తనయుడితోనే నిరుడు ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్లో పోటీపడిన సానియా మీర్జా.. ఈ ఏడాది కుమారుడు కండ్ల ముందు గ్రాండ్‌స్లామ్ టైటిల్ పోరులో తలపడింది. ఆ భావోద్వేగం సానియా మీర్జాలో స్పష్టంగా కనిపించింది.

టెన్నిస్ ముఖచిత్రం

భారత టెన్నిస్ ముఖచిత్రం సానియా మీర్జా. కెరీర్ తొలినాళ్లలోనే సంచలన విజయాలు సాధించిన సానియా మీర్జా.. అటు సింగిల్స్, ఇటు డబుల్స్ విభాగాల్లో తనదైన ముద్ర వేసింది. సొంతగడ్డ హైదరాబాద్‌లో తొలిసారి (2005) డబ్ల్యూటీఏ టైటిల్ సాధించిన సానియా మీర్జా.. అదే ఏడాది యుఎస్ ఓపెన్‌లో నాల్గో రౌండ్‌కు చేరుకుని చరిత్ర సృష్టించింది. రమేశ్ కృష్ణన్ (1987) తర్వాత మరో భారత టెన్నిస్ ప్లేయర్ న్యూయార్క్‌లో రెండో వారం రాకెట్ పట్టలేదు. గ్రాండ్‌స్లామ్ నాల్గో రౌండ్‌కు చేరిన భారత తొలి మహిళా అథ్లెట్‌గా సానియా నిలిచింది. 2005 మెల్‌బోర్న్‌లో ప్రపంచ టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్‌తో ముఖాముఖి పోరు సానియా మీర్జా కెరీర్‌లో హైలైట్. ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్ అనంతరం సానియా ఈ విషయం వెల్లడించింది. 'నా వరకు మెల్‌బోర్న్‌లో 18 ఏండ్ల వయసులో సెరెనా విలియమ్స్‌తో ఆడిన మ్యాచ్ అత్యంత ప్రత్యేకం. ఆ మ్యాచ్‌లో నేను 1-6, 4-6తో ఓటమి చెందినా.. నాలో ధృడమైన ఆత్మవిశ్వాసం నింపిన సమరం అది. ఓ సాధారణ భారతీయ అమ్మాయిగా నాపై నాకు విశ్వాసం కలిగించిన మ్యాచ్ అది' అని సానియా తెలిపింది.

అసమాన విజయాలు

భారత టెన్నిస్‌లో సానియా మీర్జా ఇప్పటికీ టాప్ క్రీడాకారిణి. డబ్ల్యూటీఏ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో (2017) నం.27గా నిలిచింది సానియా. సింగిల్స్‌కు దూరమైన పదేండ్లలో సైతం సానియా రికార్డు చెక్కుచెదరలేదు. ఇక మహిళల డబుల్స్ సర్క్యూట్‌లో సానియా మీర్జా ప్రపంచంలోనే మేటీ అథ్లెట్లలో ఒకరుగా నిలిచింది. ఆరు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన సానియా మీర్జా.. డబుల్స్ విభాగంలో 43 టూర్ టైటిళ్లు సొంతం చేసుకుంది. మహిళల డబుల్స్ నం.1 ఏకధాటిగా 91 వారాల పాటు కొనసాగింది. ప్రొఫెషనల్‌గా, పర్సనల్‌గా ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని, పరిస్థితులను పట్టించుకోకుండా ఎంచుకున్న మార్గంలో నడిచిన సానియా మీర్జా.. కెరీర్‌ను ముగించటంలోనూ అదే స్టయిల్ చూపించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ రన్నరప్ టైటిల్‌తో గ్రాండ్‌స్లామ్ కెరీర్‌ను ఘనంగా ముగించింది. వచ్చే నెల దుబాయ్‌లో డబ్ల్యూటీఏ 1000 ఈవెంట్‌తో సానియా మీర్జా అంతర్జాతీయ కెరీర్‌కు పూర్తిగా వీడ్కోలు పలుకనుంది.


ట్రోఫీలతో సానియా, బోపన్న, స్టెఫాని, రాఫేల్ జంట

రన్నరప్ సానియా జోడీ

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

మెల్‌బోర్న్ : భారత టెన్నిస్ దిగ్గజం, మహిళల డబుల్స్ మాజీ వరల్డ్ నం.1 సానియా మీర్జా ఆస్ట్రేలియా ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ రన్నరప్‌గా నిలిచింది. భారత వెటరన్ ఆటగాడు రోహన్ బోపన్న జంటగా మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌పై కన్నేసిన సానియా మీర్జా.. శుక్రవారం ఉదయం జరిగిన ఫైనల్లో వరుస సెట్లలో పోరాడి ఓడింది. బ్రెజిల్ జంట స్టెఫాని, రఫేల్ మాటోస్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 6-7(2-7), 2-6తో సానియా, బోపన్నలు ఫైనల్లో పోరాడి ఓడారు. తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో కోల్పోయిన సానియా, బోపన్నలు రెండో సెట్‌లో అంచనాలను అందుకోలేదు. 4 ఏస్‌లు, 2 బ్రేక్ పాయింట్లు సాధించిన సానియా, బోపన్నలు టైటిల్ ముంగిట నిరాశపరిచారు.



ఛేదనలో చతికిల

• రాంచి టీ20లో భారత్ ఓటమి • 1-0తో సిరీస్‌లో కివీస్ ముందంజ

నవతెలంగాణ-రాంచి : భారత పర్యటనలో న్యూజిలాండ్ బోణీ కొట్టింది. రాంచి టీ20లో భారత్‌పై 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. మంచు ప్రభావంలోనూ 176 పరుగుల స్కోరును కాపాడుకున్న కివీస్ బౌలర్లు.. టీ20 సిరీస్‌లో ఆ జట్టును 1-0తో ముందంజలో నిలిపారు. స్పిన్నర్ మిచెల్ శాంట్నర్ (2/11), మైకల్ బ్రాస్‌వెల్ (2/31), లాకీ ఫెర్గుసన్ (2/33) రాణించటంతో 177 పరుగుల ఛేదనలో భారత్ 155 పరుగులకే పరిమితమైంది. వాషింగ్టన్ సుందర్ (50, 28 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు), సూర్యకుమార్ (47, 34 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు) పోరాటం సరిపోలేదు. అంతకుముందు, టాప్ ఆర్డర్‌లో ఓపెనర్ డెవాన్ కాన్వే (52, 23 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), లోయర్ ఆర్డర్‌లో డార్లీ మిచెల్ (59 నాటౌట్, 30 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సులు) అర్థ సెంచరీలతో చెలరేగారు. టీ20 సిరీస్‌లో రెండో మ్యాచ్ ఆదివారం లక్నోలో జరుగనుంది.

బ్యాటర్లు విఫలం

177 పరుగుల ఛేదనలో భారత బ్యాటర్లు విఫలమయ్యారు. గిల్ (7), కిషన్ (4), త్రిపాఠి (0) కొత్త బంతిని ఎదుర్కొవటంలో తేలిపోయారు. సూర్యకుమార్ (47), హార్దిక్ పాండ్య (21) కీలక భాగస్వామ్యంతో భారత్‌ను రేసులోకి తీసుకొచ్చారు. కానీ వరుస వికెట్లు మళ్లీ భారత్‌ను దెబ్బతీసింది. వాషింగ్టన్ సుందర్ (50) అర్థ సెంచరీ సాధించినా, అప్పటికే భారత్ ఓటమి ఖరారైంది. దీపక్ హుడా (10) ఒత్తిడిలో రాణించలేకపోయాడు. 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులే చేసిన భారత్ 21 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.

డార్లీ, కాన్వే జోరు

టాస్ నెగ్గిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన న్యూజిలాండ్‌కు శుభారంభం లభించింది. ఓపెనర్లు ఫిన్ అలెన్ (35), డెవాన్ కాన్వే (52) తొలి వికెట్‌కు 43 పరుగులు జోడించారు. 4 ఫోర్లు, 2 సిక్సర్లతో జోరందుకున్న అలెన్‌ను, మార్క్ చాప్‌మన్ (0)ను అవుట్ చేసిన వాషింగ్టన్ సుందర్ భారత్‌కు బ్రేక్ సాధించాడు. గ్లెన్ ఫిలిప్స్ (17) నెమ్మదిగా ఆడగా.. అర్థ సెంచరీ అనంతరం కాన్వే వికెట్ కోల్పోయాడు. లోయర్ ఆర్డర్‌లో డార్లీ మిచెల్ (59 నాటౌట్) ధనాధన్ విశ్వరూపం కివీస్‌కు భారీ స్కోరు అందించింది. అర్షదీప్ సింగ్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లు కొట్టిన డార్లీ మిచెల్.. ఆ ఓవర్లో ఏకంగా 27 పరుగులు పిండుకున్నాడు.

స్కోరు వివరాలు :

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : 176/6 (డార్లీ మిచెల్ 59, డెవాన్ కాన్వే 52, వాషింగ్టన్ సుందర్ 2/22)

భారత్ ఇన్నింగ్స్ : 155/9 (సూర్యకుమార్ 47, వాషింగ్టన్ 50, శాంట్నర్ 2/11, బ్రాస్‌వెల్ 2/31)

అవమానం 'ఆరు'

• ఢిల్లీ చేతిలో హైదరాబాద్ ఓటమి



నవతెలంగాణ, హైదరాబాద్ : రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు అవమానం పరిపూర్ణం. ఎలైట్ గ్రూప్-బిలో ఏడు మ్యాచుల్లో ఏకంగా ఆరు పరాజయాలు మూటగట్టుకున్న హైదరాబాద్ అత్యంత చెత్త ప్రదర్శన చేసింది. చివరి రౌండ్ మ్యాచ్‌లో ఢిల్లీ చేతిలో 9 వికెట్ల తేడాతో ఓటమిపాలైన హైదరాబాద్ ఆరో ఓటమితో పరిపూర్ణ అవమానికి గురైంది. ఎలైట్ గ్రూప్-బిలో చివరి స్థానంతో సరిపెట్టుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో 124 పరుగులకు కుప్పకూలిన హైదరాబాద్.. ఢిల్లీకి 47 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. స్వల్ప లక్ష్యాన్ని ఓ వికెట్ కోల్పోయి 8.4 ఓవర్లలోనే ఛేదించింది ఢిల్లీ జట్టు. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ మెరిసినా.. బౌలర్ల వైఫల్యంతో ఢిల్లీని కట్టడి చేయలేకపోయింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో ఢిల్లీ బౌలర్ల దెబ్బకు హైదరాబాద్ విలవిల్లాడింది. తొలి మ్యాచ్‌లో తమిళనాడు చేతిలో వెలుతురు లేమితో ఓటమి నుంచి గట్టెక్కిన హైదరాబాద్.. ఆ తర్వాత వరుసగా పరాజయాలు చవిచూసింది.

ఫైనల్లో అమ్మాయిలు

• సెమీస్‌లో కివీస్‌పై ఏకపక్ష విజయం • ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్



జొహానెస్‌బర్గ్ : అమ్మాయిలకు ఎదురు లేదు. సమిష్టి ప్రదర్శన, ఏకపక్ష విజయాలతో ఐసీసీ మహిళల అండర్-19 టీ20 ప్రపంచ కప్‌లో టీమ్ ఇండియా అండర్-19 జట్టు ఫైనల్లోకి చేరుకుంది. శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్లో న్యూజిలాండ్ అండర్-19 అమ్మాయి లపై షెఫాలీ వర్మ సేన అదిరే విజయం నమోదు చేసింది. 108 పరుగుల లక్ష్యాన్ని మరో 34 బంతులు మిగిలి ఉండగానే ఛేదించిన భారత్ అమ్మాయిలు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్ టైటిల్ కోసం పోటీపడనుంది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ అండర్-19 స్పిన్నర్ పర్శవి చోప్రా (3/20) మాయకు 107/9 పరుగులే చేసింది. ప్లిమర్ (35), ఇస బెల్ల (26) రాణించటంతో కివీస్ వంద పరు గులు చేసింది. స్వల్ప లక్ష్యాన్ని భారత్ 14.2 ఓవర్లలోనే ఊదేసింది. ఓపెనర్ శ్వేత షెరావత్ (61 నాటౌట్, 45 బంతుల్లో 10 ఫోర్లు) ధనాధన్ అర్థ సెంచరీతో దంచి కొట్టింది. సౌమ్య తివారి (22) రాణించింది. 3 వికెట్లతో మాయ చేసిన పర్శవి చోప్రా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది.

తెలుగింటి సత్యభామ జమున ఇకలేరు

జమున..

ఈ పేరు వినగానే ఠక్కున గుర్తొచ్చేది సత్యభామ పాత్ర. రీల్ లైఫ్‌లోనే కాదు రియల్ లైఫ్‌లోనూ సత్యభామ పాత్రకి ఆమె ప్రతిబింబం. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో దాదాపు రెండు వందల చిత్రాల్లో నటించి తన ప్రత్యేకతను చాటుకున్న అలనాటి మేటినటి. అగ్ర హీరోలకు దీటుగా రాణిస్తూ, నటీమణుల స్వర్ణయుగానికి నాంది పలికిన నాయిక. మూడు దశాబ్దాలుగా ఎన్నో ఐకానిక్ పాత్రలతో ప్రేక్షకుల మదిపై చెరగని ముద్ర వేసిన జమున (86) ఇకలేరనే వార్త ఆమె అభిమానులనే కాదు తెలుగు చిత్ర పరిశ్రమ కూడా జీర్ణించుకోలేకపోతోంది.

కృష్ణ, కృష్ణంరాజు, కైకాల సత్యనారాయణ, చలపతిరావు వంటి హేమాహేమీలను కోల్పోయి శోకసంద్రంలోంచి తేరుకోలేని చిత్ర పరిశ్రమను జమున మరణం మరింత విషాదంలోకి నెట్టింది. గత కొంత కాలంగా వయో సంబంధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న జమున హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు.

అశేష ప్రేక్షకలోకాన్ని తన అద్భుతమైన నటనతో మైమరపించిన జమున సినీ జీవిత ప్రయాణంలోని కొన్ని విశేషాలు..




దిగ్గజ కథానాయకులు నాగేశ్వరరావు, ఎన్టీఆర్‌లతో జమున

- 1936 ఆగస్ట్ 30న నిప్పని శ్రీనివాసరావు, కౌసల్యాదేవి దంపతులకు జమున హంపీలో జన్మించారు. సినిమాల్లోకి రాకముందు ఆమెపేరు జానాబాయి. అయితే జ్యోతిషుల సూచనతో ఆమె పేరును జమునగా మార్చారు. తండ్రి వ్యాపార రీత్యా.. ఆమె బాల్యమంతా గుంటూరు జిల్లా దుగ్గిరాలలో గడిచింది. తల్లి దగ్గరే సంగీతం, హార్మోనియం నేర్చుకున్నారు. స్కూల్‌లో చదువుతున్నప్పుడు 'మాభూమి', 'ఢిల్లీ ఛలో' వంటి నాటికల్లో నటించారు. 'విందు' నాటికలో యశోదగా నటించారు. అంతేకాదు ఈనాటికకు దర్శకత్వంతోపాటు సంగీతాన్ని కూడా ఆమే సమకూర్చారు. చిన్నతనంలోనే హంపిసుందరిగా పేరొందారు.
- జమునకు నటుడు జగ్గయ్య గురువు. చదువుకునే రోజుల్లోనే జమునలోని నటనా ప్రతిభను గుర్తించిన ఆయన 'ఖిల్జీరాజు పతనం' అనే నాటకంలో ఎంపిక చేశారు. ఈ నాటకాన్ని చూసిన డా॥ గరికపాటి రాజారావు జమునకు తన 'పుట్టిల్లు' (1953) చిత్రం ద్వారా కథానాయికగా సినీ రంగ ప్రవేశం కల్పించారు.
- 'అంతా మనవాళ్లే' సినిమాతో ఆమె కెరీర్ మలుపుతిరిగింది. 'నిరుపేదలు, మా గోపి, బంగారుపాప' సినిమాలు ఆమెకు మంచిపేరు తీసుకొచ్చాయి. 'మిస్సమ్మ' సినిమాలో ఆమె నటన అందరినీ ఆకట్టుకుంది. రామారావు, అక్కినేని నాగేశ్వర రావు, జగ్గయ్య వంటి అలనాటి అగ్రహీరోల సరసన నాయికగా నటించినప్పటికీ.. ఆమెకు బాగా పేరు తెచ్చింది మాత్రం సత్యభామ క్యారెక్టరే. ఆ పాత్రలో ఆమెను తప్ప ఇంకెవరినీ ఊహించుకోలేమన్నట్టుగా జీవించారు.
- తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో దాదాపు 198 సినిమాల్లో ఆమె నటించారు. ఇందులో తెలుగులో 145 సినిమాలు ఉండగా, తమిళం 20, కన్నడం 7, హిందీలో 10 చిత్రాల చొప్పున ఉన్నాయి. 1959 నుంచి సావిత్రితోపాటే స్వర్ణయుగం చూసిన జమునకు తెనాలి రామకృష్ణ, భాగ్యరేఖ, భూకైలాస్, దొంగల్లో దొర, ఇలవేల్పు, ఇల్లరికం, ముద్దుబిడ్డ, చిరంజీవులు, మిస్సమ్మ, మూగమనసులు, శ్రీకృష్ణ తులాభారం, రాముడు-భీముడు, తోడు-నీడ, రాము, లేతమనసులు, పూలరంగడు, ఉండమ్మా బొట్టు పెడతా, గులేబకావళి కథ, బొబ్బిలియుద్ధం, మంచి మనిషి తదితర సినిమాలు మంచి పేరు తీసుకొచ్చాయి.
- ఒకానొక సమయంలో జమున స్టార్ స్టేటస్‌తో పాటు ఆమె తాలూకా కొన్ని విషయాలు నచ్చక అగ్ర కథానాయకులు ఎన్టీఆర్, ఏయన్నార్ నాలుగేండ్ల పాటు తమ సినిమాల్లో నటించకుండా చేశారు. తమకి క్షమాపణ చెప్పాలని పట్టుబడితే, సినిమాలైనా మానేస్తానని గట్టిగా సమాధానం చెప్పారు. అంతేకాదు ధైర్యంగా కొత్త హీరోలతో నటించి విజయాలు అందుకున్నారు. వీటిల్లో 'లేత మనసులు', 'పాల మనసులు', 'పెళ్ళి తాంబూలం' వంటి తదితర చిత్రాలు ఏకంగా 100 రోజులు ఆడాయి.
- పరిశ్రమలో సావిత్రితో జమునకి ప్రత్యేక అనుబంధం ఉంది. వీళ్ళిద్దరూ సినిమాల్లోనే కాదు నిజ జీవితంలోనూ అక్కాచెల్లెళ్ళుగా ఉన్నారు. అలాగే నటుడు హరనాథ్‌ని జమున వివాహం చేసుకుంటారనే వార్తలు అప్పట్లో సంచలనం సృష్టించాయి.

సినీ పరిశ్రమలో మగవారిని కాదని ఏమీ చేయలేమని, వారు చెప్పినట్లు చేస్తేనే మంచిదని, ఇండస్ట్రీలో గౌరవాన్ని కోల్పోకుండా ఏ స్టార్ కూడా ఉండలేరు అని ఓ సీనియర్ నటి అన్నప్పుడు ఎలా ఉండలేమో నేనూ చూస్తాను అని చెప్పాను. అదే విధంగా ఇప్పటివరకూ ఉన్నాను. ఈ విషయంలో నాకు భానుమతిగారు స్ఫూర్తి.

\- జమున

చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చిన తొలితరం నాయిక జమున కావడం విశేషం. ఇక్కడికి వచ్చిన తర్వాత నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆహ్వానంతో 1980లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1985లో మంగళగిరి నుంచి పోటీచేసి ఓడిపోయారు. అనంతరం 1989లో రాజమండ్రి నుంచి కాంగ్రెస్ ఎంపీగా గెలుపొందారు. రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా పనిచేశారు. రాజకీయాల్లో ఇమడలేక ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆ తర్వాత పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని విస్తృతంగా సేవలందించారు.

- 'హలో మేడమ్ సత్యభామ', 'అందాల ఓ చిలకా..', 'నన్ను దోచుకుందువటే..', 'ముత్యాల చెమ్మాచెక్క..', 'నీ మది చల్లగా..', 'గోదారి గట్టుంది..', 'గౌరమ్మ నీ మొగుడు ఎవరమ్మా..', 'మాను మాకుని కాదు..' వంటి తదితర ఎన్నో పాటల్లో జమున హావభావాలతో ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు.
- 'మూగ మనసులు' సినిమాకి ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు, 'మిలాన్' చిత్రంలో గౌరీ పాత్రకు బాలీవుడ్ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్, 2008లో ఎన్టీఆర్ జాతీయ పురస్కారం జమునను వరించాయి.

అలనాటి తార జమున అంత్యక్రియలు హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ మహాప్రస్థానంలో శుక్రవారం ముగిశాయి. జమున కూతురు స్రవంతి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తమ అభిమాన నటి జమునకు తుది వీడ్కోలు పలికేందుకు అభిమానులు, సినీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో మహాప్రస్థానానికి తరలివచ్చారు. అంతకుముందు ఆమె భౌతికకాయాన్ని ఆమె నివాసం నుంచి అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఫిలించాంబర్‌కు తరలించారు. అక్కడ సినీ ప్రముఖులు, అభిమానులు జమున పార్థీవ దేహానికి నివాళులర్పించారు. తెలుగింటి సత్యభామగా కోట్లాది మంది హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న జమునతో తమకి అనుబంధాన్ని గుర్తు చేసుకుని పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు. కొంత కాలం క్రితం జమున భర్త డా॥రమణారావు మరణించారు. ఆమెకు కొడుకు వంశీ, కూతురు స్రవంతి ఉన్నారు.



నవచిత్రం

ఆత్మాభిమానానికి ప్రతీక



వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఆత్మాభిమానానికి ప్రతీకగా నిలిచిన జమున మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆమె సాధించిన విజయాలను, సృష్టించిన చరిత్రను గుర్తుచేసుకుంటూ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

వెండితెర సత్యభామగా పేరుగాంచిన జమున పోషించిన పాత్రలు ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు ప్రతీకలు. ఆవిడ బహుభాషా నటి.

\- చిరంజీవి

అల్లరి పిల్లగా, ఉక్రోషంతో ఊగిపోయే మరదలిగా, ఉత్తమ ఇల్లాలిగా, అన్నింటికీ మించి తెలుగువారి సత్యభామగా మనల్ని ఎంతో మెప్పించారు జమున గారు. ఆ రోజుల్లోనే పలు హిందీ సినిమాల్లోనూ నటించి ఔరా అనిపించి అందరి ప్రసంశలు పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి.

\- బాలకృష్ణ

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అలనాటి తరానికి ప్రతినిధిగా ఉన్నారు. ఠీవీగాను, గడుసుగాను కనిపించే పాత్రల్లోనే కాకుండా అమాయకత్వం ఉట్టిపడే పాత్రల్లోనూ ప్రేక్షకుల మెప్పు పొందారు. ప్రజా జీవితంలో లోక్‌సభ సభ్యురాలిగా సేవలందించారు.

\- పవన్ కల్యాణ్

ఆమె చేసినవి అన్ని ఐకానిక్ పాత్రలు. పరిశ్రమకు ఆమె చేసిన సేవని తెలుగువారు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు.

\- మహేష్ బాబు

దాదాపుగా 30 సంవత్సరాలు తెలుగు సినిమా ఇండస్ట్రీలో మహారాణిలా కొనసాగారు. 'గుండమ్మ కథ, మిస్సమ్మ'లాంటి ఎన్నో మరుపురాని చిత్రాలు, మరెన్నో వైవిధ్యమైన పాత్రలతో మా మనసుల్లో చెరపలేని ముద్ర వేశారు.

\- ఎన్టీఆర్

లెజెండరీ నటి జమున మృతి చెందడం బాధాకరం. కెరీర్‌లో ఆమె చేసిన ఐకానిక్ పాత్రలు, తెలుగు సినీ పరిశ్రమకు చేసిన సేవలకుగాను ఆమెను సినీ ప్రేక్షకాభిమానులు ఎప్పటికీ ప్రేమగా గుర్తుంచుకుంటారు.

\- కె.రాఘవేంద్రరావు

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

గూడు కోసం పోరుబాట..

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భూ పోరాటం

- ప్రభుత్వ భూమిలో ఎర్రజెండాలు..
- వెలుస్తున్న వందలాది గుడిసెలు
- ఇండ్ల స్థలాలు సాధించడమే లక్ష్యంగా అడుగులు
- కేసుల నమోదవుతున్నా భయపడని వైనం..

నవతెలంగాణ-భూపాలపల్లి

గ్రామాల్లో వ్యవసాయం దెబ్బతిని, ఉపాధి కరువై.. చేతిలో పనిలేక పొట్ట చేతపట్టుకుని పట్టణాలకు నిత్యం పేదలు వలసలు వస్తూనే ఉన్నారు. వీరంతా నిలువ నీడ లేక దుర్భర జీవితాలు గడుపుతున్నారు. ఎక్కువగా కనీస సౌకర్యాలు లేని ఇరుకైన గదుల్లో కొందరు అద్దెకు ఉంటుండగా, మరికొందరు డ్రైనేజీల వెంట, అట్టముక్కలు, చీకిపోయిన చీరెలు, ఇరిగిపోయిన రేకులతో చిన్నచిన్న గుడిసెలు వేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో గూడు కోసం పేదలు పోరుబాట పడుతున్న నేపథ్యంలో వారికి సీపీఐ(ఎం) అండగా నిలుస్తుంది. మేమున్నామంటూ వారి ఇండ్ల జాగా కోసం



పోరాడుతోంది. గతంలోనూ సిపిఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో భూ పోరాటాలు నిర్వహించి అనేక కాలనీలు ఏర్పడగా అందులో వేలాది సంఖ్యలో పేదలు ఆత్మగౌరవంతో బతుకుతున్నారు. తాజాగా మళ్లీ జిల్లాలో సీపీఐ(ఎం) నేతృత్వంలో మూడు రోజులుగా భూ పోరాటాలు ఉధృతంగా కొనసాగుతున్నాయి.

జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువు సర్వే నెంబర్ 280, 283, 284, 285లో సుమారు 24 ఎకరాల ప్రభుత్వ భూముల్లో ఎర్రజెండాల నీడన గుడిసెలు వెలుస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు, పోలీసుల నుంచి కేసులు, బెదిరింపులు, వేధింపులు వస్తున్నప్పటికీ పిడికిలెత్తి పోరాటాన్ని మున్ముందుకు తీసుకెళ్తున్నారు. గతంలోనూ ప్రభుత్వాలతో కొట్లాడి.. కమ్యూనిస్టు పార్టీ పేదలకు ఇండ్ల జాగాలను సాధించిన విషయం తెలిసిందే. అంతేకాదు, పట్టణంలో ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న భూములనూ పేదలకు పంచాలని పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మొత్తంగా భూపాలపల్లిలో జరుగుతున్న భూపోరాటాలు రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

పేదలకు పట్టాలు అందే వరకు పోరాటాలు సాగిస్తాం : బందు సాయిలు, సీపీ(ఎం) జిల్లా కార్యదర్శి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా పదేండ్లుగా సుమారు 30 కేంద్రాల్లో భూ పోరాటాలు నిర్వహించాం. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా మండుటెండలో పోరుయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేశాం. ప్రధానంగా భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీలో సుమారు 1500 మంది, జవహర్ నగర్ కాలనీలో 1200 మంది నిరుపేదలకు గూడు కల్పించాం. అనంతరం పట్టాలు అందే వరకు పోరాటాలు నిర్వహించాం. శాంతినగర్ 250 మంది, రాజీవ్ నగర్ 300, ఇందిరానగర్ 300 మందికి పట్టాల కోసం నిరంతర పోరాటాలు జరుగుతున్నాయి. దినదినం అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లి పట్టణంలో పేదలకు ఇండ్లు కొనుగోలు చేసే శక్తి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నది. ఇష్టానుసారంగా కబ్జాలకు పాల్పడుతున్న కొంత మంది అధికార, ధనబలం కలిగిన వారిని ప్రభుత్వం ప్రశ్నించడం లేదు. ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నా పేదలకు కనీసం నివాసం ఏర్పాటు చేసుకునే పరిస్థితి లేకుండా పోతున్నది. అందుకే ప్రభుత్వ భూములు పేదల పరం చేసేందుకు పోరాటాలు సాగిస్తున్నాం. ఫిబ్రవరి 3వ తేదీన మున్సిపాలిటీలో దరఖాస్తులు ఇవ్వడంతో పాటు 9వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టాం. ఈ కార్యక్రమానికి గుడిసె వాసులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం..

బతకడం కష్టతరంగా మారింది : మల్లాడి సరిత, హనుమాన్ నగర్, భూపాలపల్లి



నా భర్త శ్రీనివాస్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సంపాదన రూ.11,000 మాత్రమే. ఇద్దరు అబ్బాయిలు. 20ఏండ్లుగా హనుమాన్ నగర్‌లో కిరాయి ఇంట్లో ఉంటూ నెలకు రూ.4000 అద్దె చెల్లిస్తున్నాము. చాలీచాలని వేతనంతో కిరాయితోపాటు ఇల్లు గడవడం కష్టంగా మారింది. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గుడిసె వేసుకున్నాం. ప్రభుత్వ అధికారులు స్పందించి ఇంటి స్థలం కేటాయించాలి.

ఇంటి స్థలం కేటాయించి ఆదుకోవాలి : కసుబోసుల అఖిలాష్, కారల్ మార్క్స్ కాలనీ, భూపాలపల్లి



18 సంవత్సరాలుగా కిరాయికి ఉంటూ జీవనం సాగిస్తున్నాం. కార్పెంటర్‌గా కూలి చేస్తూ నెలకు రూ.12,000 సంపాదిస్తున్నప్పటికీ ఇందులో రూ.3500 అద్దె చెల్లిస్తున్నాను. భార్య, ముగ్గురు పిల్లలతో జీవనం కష్టతరంగా మారింది. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గుడిసె వేసుకున్నాం. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి ఇంటి స్థలం కేటాయించాలి.

టీవీవీపీలో జీ.వో.317 అమలుకు అనుమతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంతోకాలంగా తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులు ఎదురు చూస్తున్న జీ.వో.నెంబర్ 317 అమలుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్‌ను అమలు చేసేందుకు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం.రిజ్వీ అనుమతించారు. గతేడాది డిసెంబర్ 12న జీ.వో.నెం.317ను అమలు చేసేందుకు అనుమతించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ లేఖ రాశారు. ఆ లేఖను సాధారణ పరిపాలనాశాఖ పరిశీలించి ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్‌ను అమలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఉద్యోగుల బదిలీలకు ఉన్న ఆటంకాలు తొలిగిపోయాయి. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పటికే నవతెలంగాణ పలుమార్లు కథనాలను ప్రచురించిన విషయం తెలిసిందే.

ధన్యవాదాలు .. టీయూఎంహెచ్ఇయూ

తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో జీ.వో.317 అమలుకు అనుమతించినందుకు తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ ఇయూ) కార్యదర్శి భైరపాక శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. టీవీవీపీ ఉద్యోగులు బదిలీల కోసం చేసుకున్న వినతిపై సానుకూలంగా స్పందించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగుల ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు.

ఆమె చివరి మజిలీ బీజేపీయే కావాలి

- విజయశాంతి 25 ఏండ్ల రాజకీయ ప్రస్థాన కార్యక్రమంలో బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సినిమా రంగం నుంచి వచ్చి 25 ఏండ్లుగా రాజకీయాల్లో కొనసాగడం మామూలు విషయం కాదనీ, తెలంగాణ ఉద్యమకారిణి అయిన విజయశాంతి తన చివరి మజిలీ వరకూ బీజేపీలోనే కొనసాగాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆకాంక్షించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి రాజకీయాల్లోకి వచ్చి 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బండి సంజయ్‌తో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, కేంద్ర మంత్రి జీ.కిషన్ రెడ్డి, తమిళనాడు సహాయ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు జితేందర్‌రెడ్డి, జీ.వివేక్, మాజీమంత్రి బాబూమోహన్, మాజీ ఎంపీలు చాడా సురేష్ రెడ్డి, రవీంద్ర నాయక్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి, రాణీరుద్రమ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలతో పార్టీని వీడినవారంతా తిరిగి రావాలని కోరారు. తాను తప్పుచేసినా ప్రశ్నించే హక్కు కార్యకర్తలకు ఉందని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో విజయశాంతి పాత్రను గుర్తు చేశారు. విజయశాంతి మాట్లాడుతూ..తనకు పదవులపై ఆశలేదనీ, తెలంగాణకు జరిగిన అన్యాయంపై పోరాడేందుకే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. ఒక రాక్షసుడు ఎదురై నమ్మించి మోసం చేశాడని విమర్శించారు. పార్లమెంట్ లో బిల్లు పెట్టినప్పుడు తెలంగాణ రాకూడదనే కేసీఆర్ సహా చాలా మంది ఎంపీలు భావించారన్నారు. 2024లోనూ మోడీయే ప్రధాని అవుతారనీ, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

జవహర్ నవోదయ విద్యాలయంలో ఫుడ్ పాయిజన్..!

- 30 మంది విద్యార్థులకు అస్వస్థత
- పదిమంది విద్యార్థులు ఇండ్లకు తరలింపు
- విద్యాలయాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ



నవతెలంగాణ- కూసుమంచి

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో మూడు రోజుల నుంచి రోజుకు కొంతమంది చొప్పున మొత్తం 30 మందికి ఫుడ్ పాయిజన్ అయింది. దాంతో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు నవోదయ విద్యాలయంకి వచ్చి పదిమంది పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. మిగిలిన విద్యార్థులకు వైద్యం అందిస్తున్నారు. ఇది ఇలా ఉండగా పాఠశాలలో వండిన చికెన్ కూరతో భోజనం చేయడం వల్లే అస్వస్థతకు గురైనట్టు విద్యార్థులు చెబుతున్నారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిందని సమాచారం తెలుసుకున్న వైద్యులు నవోదయ విద్యాలయంను సందర్శించి, విద్యార్థులను పరిశీలించి వైద్యం అందించారు. 30 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయినట్టు వైద్యులు తెలిపారు.

వైద్యశాఖ అధికారులను అప్రమత్తం చేసిన ఎంఎల్‌ఏ

జవహర్ నవోదయ విద్యాలయంలో ఫుడ్ పాయిజన్ విషయం తెలియడంతో వైద్యశాఖ అధికారులను పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అప్రమత్తం చేశారు. దాంతో జిల్లా వైద్య అధికారి డాక్టర్ మాలతి విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అవసరమైన వైద్యం అందించారు.

తిను బండారాలతోనే వాంతులు: పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రబాబు

విద్యాలయంలోని విద్యార్థులు సంక్రాంతి పండక్కి వెళ్లి, ఇంటి నుంచి తినుబండారాలను తమతో తీసుకొచ్చారు. ఈ తినుబండారాలు వారం కావడంతో అవి తిన్న విద్యార్థులకు వాంతులయ్యాయి. నవోదయ విద్యాలయంలో భోజనం తినడం వల్ల ఫుడ్ పాయిజన్ కాలేదు.

ఎకరాకు రూ.40 లక్షలు చెల్లించాలి

- రైతులను మెప్పించి భూములు తీసుకోవాలి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు



నవతెలంగాణ- వీపనగండ్ల

సింగోటం గోపాల్దిన్నె రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు ఎకరాకు రూ.40 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లాలో సింగోటం గోపాల్దిన్నె రిజర్వాయర్ లింకు కాల్వలో భూములు కోల్పోతున్న కొర్లకుంట, వల్లభాపురం, బొల్లారం, వల్లభాపురం తండ, సంగినేనిపల్లి కల్వరాల గ్రామాల భూనిర్వాసితులతో కలిసి వీపనగండ్ల మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.వెంకట్‌రాములు మాట్లాడుతూ.. రిజర్వాయర్ కాల్వలో 6 గ్రామాల్లో సుమారు 400 మంది రైతులు 400 ఎకరాల భూములు కోల్పోయారని తెలిపారు. రైతులకు ప్రభుత్వం మార్కెట్ ధరకనుగుణంగా ఎకరాకు రూ.40 లక్షలు చెల్లించాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి గ్రామపంచాయతీ ఆమోదంతో రైతులను మెప్పించి భూములు తీసుకొని కాల్వ తొవ్వాలి గానీ, అధికార యంత్రాంగం, పోలీసులు బల ప్రయోగంతో భూములు తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఎకరాకు ఐదు లక్షలు చెల్లిస్తామని చెప్పడం దారుణమన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు మూడింతల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో మామిడి తోటలు, వేరుశనగ, వరి పంటలకు భూములు సారవంతమైనవని చెప్పారు. ఇప్పటికే కొంతమంది రైతులు కాలువలో భూములు కోల్పోయి నష్టపోయారని గుర్తుచేశారు. ప్రాజెక్టులకు తాము వ్యతిరేకం కాదని నిర్వాసితుల సమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు. నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టంలో ఉన్న విధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం సంఘం జిల్లా అధ్యక్షులు ఇంద్రకంటి వెంకటేష్, సర్పంచులు మౌలాలి, నారాయణ, రైతు సంఘం మండల అధ్యక్షులు కష్ణయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దేవన్న మండల అధ్యక్షులు కార్యదర్శులు కృష్ణయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అనురాధకు పితృవియోగం

నివాళి అర్పించిన మంత్రి జగదీశ్‌రెడ్డి, సీపీఐ(ఎం) నేతలు చెరుపల్లి, మల్లు లక్ష్మి



నవతెలంగాణ-సూర్యాపేట

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, ఐద్వా యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణల తండ్రి అనుములపురి నర్సయ్య గురువారం రాత్రి మృతిచెందారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మీ తదితరులు శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రం అంబేద్కర్ కాలనీలోని మున్సిపల్ చైర్‌పర్సన్ నివాసంలో నర్సయ్య మృతదేహంపై పూలమాలలేసి నివాళి అర్పించారు. సీపీఐ(ఎం) సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శులు మల్లు నాగార్జునరెడ్డి, జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోటగోపి, మేక అశోక్‌రెడ్డి, కల్లూరి మల్లేశం, మాటూరి బాలరాజు, దాసరి పాండు తదితరులు నివాళి అర్పించారు. నర్సయ్య మృతదేహంపై విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆయన భార్య సునీత పూలమాలలేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నర్సయ్య మరణం ఆయన కుటుంబానికి తీరని లోటన్నారు. కుటుంబీకులను పరామర్శించిన వారిలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీలు సంజీవనాయక్, జీడి భిక్షం, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు పూర్ణ శశికాంత్, జిల్లా నాయకులు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

'యువగళం'.. మన'గళం'..!

- యువత కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో
- కుప్పంలో నారా లోకేష్ పాదయాత్ర

తిరుపతి : 'యువగళం... మన గళం. అదే ప్రజాబలం. నట సార్వభౌముడు ఎన్‌టిఆర్ తెలుగుజాతి కోసం చైతన్యరథమెక్కారు. ఆంధ్రా ప్రజల కోసం 'వస్తున్నా మీకోసం' అంటూ నారా చంద్రబాబునాయుడు పాదయాత్ర చేపట్టారు. యువత కోసం యువగళం పేరుతో నేను పాదయాత్ర తొలి అడుగు వేశాను. అని నారా లోకేష్ పేర్కొన్నారు. ఎన్ని అడ్డుకులు సృష్టించినా యువగళం యాత్రగానీ, పవన్ కల్యాణ్ చేపట్టనున్న వారాహి యాత్రగానీ ఆగదని తేల్చి చెప్పారు. జిఒ-1 బూచిచూపి యువగళం యాత్రకు అడ్డు తగిలితే తొక్కుకుంటూపోతామని హెచ్చరించారు. టిడిపి అధికారంలోకొస్తే యువత కోసం ప్రత్యేక ప్యాకేజీ అమలు చేస్తామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా నుంచి యువగళం పాదయాత్రను శుక్రవారం ఆయన ప్రారంభించారు. తన తండ్రి చంద్రబాబునాయుడు నియోజకవర్గమైన కుప్పంలోని లక్ష్మీపురం వరదరాజగుడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి ముహూర్తం ప్రకారం శుక్రవారం ఉదయం 11.03 గంటలకు పాదయాత్ర తొలి అడుగు వేశారు. ఈ యాత్ర 400 రోజులపాటు నాలుగు వేల కిలోమీటర్లు సాగనుంది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియనుంది. తొలిరోజు లక్ష్మీపురం నుంచి ప్రారంభమైన పాదయాత్ర పట్టణంలోని పిఇఎస్ మెడికల్ కళాశాల వరకూ ఎనిమిది కిలోమీటర్లు సాగింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మామ నందమూరి బాలకృష్ణ, బావ నందమూరి తారకరత్న, మాజీ మంత్రులు అమరనాథరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కళా వెంకట్రావు, కొల్లు రవీంద్ర, నక్కా ఆనందబాబు తదితరుల సారథ్యంలో ఈ యాత్ర ప్రారంభమైంది. ఎన్‌టిఆర్‌కు, అంబేద్కర్ విగ్రహాలకు లోకేష్ పూలమాలలు వేశారు.

సీపీఐ(ఎం) సానుభూతిపరులు.. అమృతమ్మ, చిన్యాలకు తమ్మినేని నివాళి



నవతెలంగాణ-కొణిజర్ల

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు, ప్రముఖ వైద్యులు జట్ల రంగారావు మాతృమూర్తి అమృతమ్మ వయోభారంతో గురువారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం అమృతమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మేకలకుంట గ్రామానికి చెందిన గిరిజన నాయకులు దరావత్ చీన్యా నాయక్ శుక్రవారం ఉదయం మృతిచెందారు. మృతదేహాన్ని తమ్మినేని సందర్శించి నివాళ్లర్పించారు. తమ్మినేని వెంట పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, మండల కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

అయ్యో బాబోయ్..ఆస్టరాయిడ్

- భూమికి అత్యంత సమీపానికి వచ్చి వెళ్లిన '2023బియు'
- ఇంత దగ్గరగా ఇంతకు ముందెప్పుడూ రాలేదు : నిపుణులు

వాషింగ్టన్ : రెండు రోజుల క్రితం అంతరిక్షంలో ఒక అద్భుతం జరిగింది. భూమికి తృటిలో ఒక పెద్ద ప్రమాదం తప్పింది. అంతరిక్షంలో గురువారం రాత్రి భూమికి కేవలం 3600 కిలోమీటర్ల దూరంలో నుంచి '2023బియూ' అనే ఆస్టరాయిడ్ వెళ్లిపోయింది. భూమికి ఇంత సమీపంగా ఒక ఆస్టరాయిడ్ ఎప్పుడూ రాలేదని అంతరిక్ష శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక ట్రక్ పరిమాణంలో ఉండే ఈ ఆస్టరాయిడ్ ఒకవేళ భూమిని తాకితే ఊహించని స్థాయిలో నష్టముంటుంది. భూమిని ఢీకొనేలా '2023బియూ' వచ్చుంటే, దానిపైకి అణ్వాయుధం ప్రయోగించి చిన్న చిన్న ముక్కలుగా చేయాల్సిన పరిస్థితి ఏర్పడేదని శాస్త్రవేత్తలు అంటున్నారు. గత కొద్ది రోజులుగా ఈ ఆస్టరాయిడ్ గమనాన్ని అంతరిక్ష శాస్త్రవేత్తలు గమనిస్తున్నారు. విశ్వం, అంతరిక్షంపై ఆసక్తి కలిగిన కొంతమంది క్రిమియా వద్ద నుంచి బైనాక్యులర్స్, టెలిస్కోపిక్ పరికరాలతో '2023బియు'ను చూసినట్టు వార్తలు వెలువడ్డాయి. దీంతో ఈ ఆస్టరాయిడ్ గమనాన్ని శాస్త్రవేత్తలు నిరంతరం గమనిస్తూ వస్తున్నారు.'2023బియూ' పరిమాణం 3.5 నుంచి 8.5 మీటర్ల వెడల్పుతో ఉండొచ్చని, ఒకవేళ ఇది భూమిని ఢీకొనే దిశగా వచ్చినా...వాతావరణంలో మండిపోతుందని, అప్పుడు చిన్న చిన్న ముక్కలుగా విడిపోతుందని ఒక శాస్త్రవేత్త వివరించారు. అయితే భూమి నుంచి 900 కి.మీ ఎత్తులో ఉన్న వేలాది శాటిలైట్స్ దెబ్బతినే అవకాశముంది. ఈ ఆస్టరాయిడ్ ఎటుపోతోంది? అన్నదానిపై శాస్త్రవేత్తలు అనేక లెక్కలు వేశారు. నాసా ప్రమాద, ప్రభావ అంచనా వ్యవస్థను ఆధారంగా చేసుకొని అనేకమంది నిపుణులు విశ్లేషించారు. '2023బియూ' ప్రశాంతంగా తన దారిలో పోతుందని అంచనావేశారు. వారు ఊహించినట్టుగానే అది తన కక్ష్యామార్గంలో వెళ్లిపోయిందని తెలుస్తోంది. ఇప్పటివరకూ ఏ ఆస్టరాయిడూ భూమికి ఇంత సమీపంగా రాలేదని, భూ గురుత్వాకర్షణ శక్తి ఆస్టరాయిడ్ గమనాన్ని ప్రభావితం చేసిందని నిపుణులు చెబుతున్నారు.

గాజాపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు

జెరూసలేం : గాజాపై ఇజ్రాయిల్ శుక్రవారం వైమానిక దాడులతో విరుచుకుపడింది. గురువారం ఓ వృద్ధ మహిళసహా తొమ్మిది మంది పాలస్తీనీయుల్ని ఇజ్రాయిల్ సైన్యం కాల్చి చంపిన తరువాత రోజే గాజాలోని అల్ మఘజీ శరణార్థుల శిబిరంపై ఇజ్రాయిల్ కనీసం 13 దాడులకు తెగబడటం గమనార్హం.

బీహార్‌లో 'ఆపరేషన్ కమలం'..

- నితీష్‌కుమార్ సన్నిహితునితో చర్చలు



పాట్నా : బీహార్‌లో బిజెపి ఆపరేషన్ కమలం ప్రారంభించింది. నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని కూల్చివేసే దిశగా బిజెపి పావులు కదుపుతోంది. జెడియు నేత, పార్లమెంటరీ బోర్డ్ చైర్మన్ ఉపేంద్ర కుష్వాహాతో చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అనారోగ్యంతో ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఉపేంద్ర కుష్వాహాను బిజెపి నేతలు శుక్రవారం కలిశారు. బిజెపి నేతలు ప్రేమ్ రంజన్ పటేల్, సంజరు టైగర్, యోగేంద్ర పాశ్వాన్‌లు పరామర్శిస్తున్న ఫోటో బీహార్ వ్యాప్తంగా వైరల్ గా మారింది. కుష్వాహను బిజెపిలోకి ఆహ్వానిస్తామని బిజెపి అధికార ప్రతినిధి అరవింద్ కుమార్ సింగ్ ప్రకటించారు. దీంతో ఉపేంద్ర కుష్వాహా జెడియును వీడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ కోరారు. అయితే తండ్రి ఆస్తిలో వాటా లేకుండా తాను పార్టీని వీడలేనని కుష్వాహా ఘాటుగా సమాధానమిచ్చారు. "బాగా చెప్పారు భారు.. అన్నయ్యల సలహా మేరకు తమ్ముళ్లంతా ఇళ్లలోంచి వెళ్లిపోతే..తమ్ముళ్లను బయటకు నెట్టేసి అన్నయ్యలు మొత్తం ఆస్తినంతా దోచుకుంటారా" అని మండిపడ్డారు. "ఆస్తిలో నా వాటాను వదిలి పెట్టి నేను ఎలా బయటికి వెళతాను" అని కుష్వాహ హిందీలో ట్వీట్ చేశారు. గతంలో జెడియులో తిరిగి చేరడానికి కుష్వాహా తన రాష్ట్రీయ లోక్ సమతా పార్టీని(ఆర్ఎల్ఎస్‌పీ)ని రెండేళ్ల క్రితం జెడియులో విలీనం చేసిన సంగతి తెలిసిందే. కుష్వాహా బిజెపిలో చేరకున్నా.. ఓ కొత్త పార్టీని స్థాపించి ఎన్‌డిఎలో చేరే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు భావిస్తున్నాయి.

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల శిక్షణా తరగతులను ప్రారంభించాలి

- డీహెచ్‌కు ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల జేఏసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు గతంలో శిక్షణ ఇచ్చే వారనీ, అయితే దాన్ని మధ్యలో నిలిపివేశారని తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల జేఏసీ తెలిపింది. ఇప్పుడు ఆ శిక్షణను తిరిగి ప్రారంభించాలని కోరింది. ఈ మేరకు ఆ జేఏసీ నాయకులు వెంకట్ రెడ్డి తదితరుల నేతృత్వంలో రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జీ.శ్రీనివాస రావును శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. 2015 జూన్ 29న జారీ చేసిన జీ.వో.నెంబర్ 428 ప్రకారం శిక్షణా తరగతులను నిర్వహించారని గుర్తుచేశారు. అయితే వాటిని మధ్యలోనే నిలిపేశారని తెలిపారు. అప్పటికే పూర్తయిన శిక్షణ వివరాలు ప్రభుత్వానికి సమర్పించి, వెయిటింగ్ జాబితాలో ఉన్న వారికి తాజాగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. పేద ప్రజలకు అతి తక్కువ ధరలకు వైద్యం చేస్తున్నరాష్ట్రంలోని 45 వేల మంది ఆర్ఎంపీ, పీఎంపీ పట్టణ, గ్రామీణ వైద్యులకు చట్ట భద్రతనిచ్చే విధంగా గుర్తింపు కార్డును, సర్టిఫికెట్లను ఇప్పించాలని కోరారు.

లక్ష మోటారు సైకిళ్లను వెంటనే ఇవ్వాలి

- బోర్డులోని భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లయిమ్స్‌ను పరిష్కరించాలి
- మంత్రి మల్లారెడ్డికి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులకు పంచుతామన్న లక్ష మోటారు సైకిళ్లను వెంటనే అందజేయాలని భవన, ఇతర నిర్మాణరంగ కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. వెల్ఫేర్‌బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని కోరింది. బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలనీ, బోర్డులోని సెస్సు నిధులను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డితోపాటు డిప్యూటీ కమిషనర్‌కు ఆ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంగూరు రాములు, ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వెల్ఫేర్ బోర్డులో రూ.3,700 కోట్ల సెస్సు నిధులున్నాయనీ, వాటిని బోర్డు అడ్వైజరీ కమిటీ నిర్ణయాలతో ఖర్చు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 54వేల క్లయిమ్స్‌ని వెంటనే క్లియర్ చేయాలని విన్నవించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఇచ్చే రూ.6 లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు, సాధారణ మరణాలకు ఇస్తున్న లక్ష రూపాయలను రూ.5 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. వివాహం, ప్రసూతి కానుకలు, కార్మికులు చనిపోతే దహన సంస్కార ఖర్చులకు ఇచ్చే రూ. 30 వేలను..లక్ష రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ శ్రమ్ కార్డులను కార్మికులందరికీ ఇవ్వాలని కోరారు. వలస కార్మికుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.



త్రిపుర ఎన్నికలు

- 46 స్థానాల్లో లెఫ్ట్ ఫ్రంట్
- 13 చోట్ల కాంగ్రెస్.. స్వతంత్ర అభ్యర్థికి ఒక స్థానం
- పోటీ నుంచి స్వచ్ఛందంగా వైదొలిగిన మాజీ సీఎం మాణిక్ సర్కార్
- సీపీఐ(ఎం) జాబితాలో 24 మంది కొత్త అభ్యర్థులు

న్యూఢిల్లీ : త్రిపురలో బీజేపీ పాలనకు ముగింపు పలకడానికి లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఒక్కట య్యాయి. 60 స్థానాలున్న త్రిపుర అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యం లో, సీట్ల పంపకాలపై దాదాపు 14 రోజులుగా వామపక్షాలు, కాంగ్రెస్ మధ్య జరుగుతున్న చర్చలు సఫలమయ్యాయి. 46 స్థానాల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల పేర్లను లెఫ్ట్ ఫ్రంట్ కూటమి శుక్రవారం ప్రకటించింది. 13 స్థానాల్ని కాంగ్రెస్‌కు, ఒక స్థానాన్ని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలబడుతున్న మానవ హక్కుల కార్యకర్త, న్యాయవాది పురుషోత్తమ్ రే బర్మన్‌కు కేటాయించారు. "మొత్తం 46 స్థానాల్లో వామపక్ష అభ్యర్థులు పోటీ చేయబోతున్నారు. ఇందులో 43 స్థానాల్లో సీపీఐ(ఎం), ఒక్కో స్థానంలో సీపీఐ, ఆర్‌ఎస్‌పీ, ఫార్వార్డ్ బ్లాక్ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలబడతారు" అని లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ నారాయణ్ కార్ మీడియాకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల అభ్యర్థుల పేర్లను ఇంకా విడుదల చేయాల్సి వుంది. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి సబ్రూమ్ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో నిలబడుతున్నారు.

మాజీ సీఎం మాణిక్ సర్కార్, బాదల్ చౌదరి, మాజీ మంత్రి భన్సూలాల్ సాహా, సాహిద్ చౌదరీ, తపన్ చక్రవర్తి, సహా 8మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీపీఐ(ఎం) పార్టీ టికెట్లు దక్కలేదు. కొత్త వారికి, యువతకు అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో సీనియర్ నాయకులు మాణిక్ సర్కార్ పోటీ నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి మీడియాకు తెలిపారు. కాగా, ఈ ఎన్నికల్లో 24 మంది కొత్త అభ్యర్థులకు లెఫ్ట్ ఫ్రంట్ టికెట్లు ఇవ్వటం గమనార్హం. ఇందులో ఇద్దరు మహిళా అభ్యర్థులున్నారు. ఈ సందర్భంగా నారాయణ్ కార్ మాట్లాడుతూ, "ఈ ఎన్నికలు ఈ దేశానికి ఎంతో కీలకమైనవి. మొత్తం రాజ్యాంగ వ్యవస్థలనే బీజేపీ ధ్వంసం చేస్తోంది. అరాచక, హింసాయుత పాలనకు వ్యతిరేకంగా వామపక్ష, లౌకిక, ప్రజాస్వామిక శక్తులు ఒక్కటయ్యాయి. బీజేపీకి వ్యతిరేకంగా వామపక్షాలు, కాంగ్రెస్ తమ పోరాటాన్ని కొనసాగిస్తాయి. బీజేపీ పాలనకు ప్రజాస్వామ్యయుతంగా ముగింపు పలకాలంటే ఎన్నికలు మంచి అవకాశం. మళ్లీ బీజేపీకి అధికారం రాకూడదనేది మా ప్రధాన లక్ష్య"మని చెప్పారు.

పాలసీదారులకు మెరుగైన సేవలు

- ఎల్ఐసి జోనల్ మేనేజర్ వెల్లడి

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) తమ పాలసీదారులకు మెరుగైన సేవలను అందిస్తుందని సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ ముక్కవిల్లి జగన్నాథ్ అన్నారు. గురువారం 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కార్యాలయం పరిధిలో జాతీయా జెండావిష్కరణ చేశారు. అనంతరం ఆయన ఉద్యోగులు, ఎజెంట్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంస్థ, వ్యక్తిగతంగానూ వృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్లు విద్యానంద్ ఝా, వినీత్ శ్రీవాస్తవ్, సాయినాథ్, కె మురళిధర్, సీనియర్ డిఎం రాజీవ్ బిస్వాస్ తదితరులు పాల్గొన్నారు.

అదానీపై ఆరోపణలు వాస్తవమే

- హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వెల్లడి
- రిపోర్టులకు కట్టుబడి ఉన్నాం
- కేసు వేస్తే మేము రెడీ

న్యూఢిల్లీ : గౌతం అదానీకి చెందిన అదానీ గ్రూపు తన షేర్లలో అవకతవకలకు పాల్పడుతోందని.. ఎకౌంట్స్‌లోనూ మోసాలు చేస్తోందని తాము ఇచ్చిన రిపోర్టులకు కట్టుబడి ఉన్నామని అమెరికాకు చెందిన ప్రముఖ



పెట్టుబడుల పరిశోధక సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ స్పష్టం చేసింది. తమ సంస్థపై ద్వేషంతో ఆధారాలు లేకుండా హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేసిందని అదానీ గ్రూపు స్టాక్ ఎక్స్ఛేంజీలు, రెగ్యులేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. హిండెన్‌బర్గ్ రిపోర్టును తప్పుబట్టింది. దీనిపై హిండెన్‌బర్గ్ గురువారం ఘాటుగా స్పందించింది. తాము ఇచ్చిన రిపోర్టు సరైనదని.. లేకపోతే ఆ కంపెనీ చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. అదానీ గ్రూపు చేతనైతే తమపై కోర్టుకెళ్లాలని సవాలు విసిరింది. తమ సంస్థ అమెరికా నుంచి పనిచేస్తోందని.. కాబట్టి అక్కడ దావా వేసుకోవచ్చని సూచించింది. ఒకవేళ ఈ విషయంలో అదానీ గ్రూప్ కనుక విఫలమైతే తమ వాదనలు సరైనవిగా భావించాలని సవాల్ విసిరింది. అదానీ గ్రూపులో గతంలో పనిచేసిన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, వేలాది పత్రాలు, ప్రభుత్వ, అంతర్జాతీయ సంస్థల నిఘా నివేదికలు, అదానీ గ్రూపు కంపెనీల శాఖలు ఉన్న 12కు పైగా దేశాలను పర్యటించి ఈ నివేదికను తయారు చేసినట్టు హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తెలిపింది. "మా రిపోర్టును విడుదల చేసి 36 గంటలు దాటిన ఒక్క అంశాన్ని కూడా అదానీ గ్రూపు స్పష్టంగా లేవనెత్తలేకపోయింది. మేము సూటిగా 88 ప్రశ్నలు వేశాము. ఇందులో అదానీ గ్రూపు ఏ ఒక్క ప్రశ్నకు ఇప్పటికీ బదులు ఇవ్వలేకపోయింది. రెండు ఏళ్లుగా అనేక పరిశోధనలు చేసి 32,000 పదాలతో 106 పేజీల రిపోర్టును రూపొందించాము. ఇందులో ఏ తప్పు ఉన్న మాపై న్యాయ చర్యలు తీసుకోవచ్చు. అదానీ గ్రూపు మా రిపోర్టును తప్పుబడుతూ చర్యలు తీసుకుంటామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాము. మేము ఇచ్చిన రిపోర్టుకు కట్టుబడి ఉన్నాము." అని హిండ్‌బర్గ్ రీసెర్చ్ ఓ ప్రకటనలో తెలిపింది. అదానీ గ్రూపు దావా వేస్తే తాము కూడా లీగల్‌గా ఆ కంపెనీ డాక్యూమెంట్లను కోరుతామని స్పష్టం చేసింది.

హిండెన్‌బర్గ్ రిపోర్టులోని ప్రధానాంశాలు... "అదానీ గ్రూపు సంస్థల ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన కుటుంబ సభ్యులు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ఆ కంపెనీ షేర్లను మానిప్యులేషన్ చేస్తుంది. ఎకౌంట్స్‌లో మోసాలకు పాల్పడుతుంది. షేర్ల ధరలను కత్రిమంగా పెంచింది. పన్ను ఎగవేత, మనీలాండరింగ్ మోసాల కోసం అనేక అడ్డదారులు తొక్కింది. అప్పుల కోసం మోసాలకు పాల్పడింది. కార్పొరేట్ ప్రపంచ చరిత్రలో ఇదో అతిపెద్ద కుట్ర. గౌతమ్ అదానీ నికర సంపద విలువ ప్రస్తుతం 120 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.9.78 లక్షల కోట్లు)గా ఉంది. మూడేళ్ల క్రితం ఇది 20 బిలియన్ డాలర్లు (రూ.1.62 లక్షల కోట్లు)గా ఉండేది. గత మూడేళ్లలోనే తన గ్రూప్‌నకు చెందిన 7 ప్రధాన లిస్టెడ్ కంపెనీల ముఖ విలువను ఎక్కువ చేసి, షేర్ల విలువను కత్రిమంగా పెంచి ఆదానీ మోసానికి పాల్పడ్డారు. ఈ సమయంలో ఆయా కంపెనీల షేర్ విలువ సగటున 819 శాతం పెరిగింది. దీంతో మూడేళ్లలోనే అదానీ సంపద 100 బిలియన్ డాలర్లకు పైగా (రూ. 8.1 లక్షల కోట్లు) పెరిగింది. ఈ ఏడు కంపెనీలు 85 శాతం నష్టాలను నమోదు చేశాయి. ఇవి రెడ్‌జోన్‌లో ఉన్న కంపెనీలు. అయినప్పటికీ.. ఆర్థిక అవకతవకలతో ఆయన ఈ కంపెనీల నష్టాలను బయటపెట్టలేదు. నష్టాలతో ట్రేడ్ అవుతున్న ఆ కంపెనీల వాటాలను తనఖా పెట్టి అదానీ గ్రూప్ భారీగా రుణాలను పొందింది. దీంతో అదానీ కంపెనీ వాటాదార్ల సొమ్మును, గ్రూప్ ఆర్థిక పరిస్థితిని ప్రమాదంలో పడేసినట్టే. అదానీ గ్రూప్ మనీలాండరింగ్, అవినీతి ఆరోపణలకు గానూ భారీగా డబ్బు వెచ్చించింది. రూ.1.4 లక్షల కోట్ల అవినీతి, మనీలాండరింగ్, పన్ను ఎగవేతకు సంబంధించి అదానీ గ్రూప్ ఇప్పటికే నాలుగు కేసుల్లో ప్రభుత్వ సంస్థల విచారణను ఎదుర్కొంటుంది." అని ఈ రిపోర్టు తెలిపింది.

'మన ఊరు-మనబడి' పనులు త్వరగా పూర్తి చేయాలి

బదిలీలు, పదోన్నతుల్లో అవకతవకల్లేకుండా చూడాలి

- కలెక్టర్లకు మంత్రి సబిత ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని పాఠశాల విద్యలో అద్భుతమైన మార్పునకు నాంది పలుకుతున్న 'మన ఊరు-మనబడి' కార్యక్రమం మొదటి విడతలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. శుక్రవారం పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం నుంచి 'మన ఊరు-మనబడి' కార్యక్రమం పురోగతిని మంత్రి సమీక్షించారు. పాఠశాలల స్వరూపం సమూలంగా మార్చి, కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా రూపుదిద్దాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల సదుపాయాలను ఏర్పాటు చేయించేలా ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు శ్రీకారం చుట్టారని వివరించారు. రాష్ట్రంలో 26,065 ప్రభుత్వ పాఠశాలలుంటే మొదటి విడతలో 9,123 బడుల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. ఇందుకోసం రూ.3,497.62 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. వాటిలో 7,479 పాఠశాలలు గ్రామీణ ప్రాంతాల్లో ఉండగా 1,644 పాఠశాలలు పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయని వివరించారు. మొదటి విడతలో చేపట్టిన పాఠశాలలను బాగు చేయడం ద్వారా 14,71,684 మంది విద్యార్థులంటే దాదాపు 63 శాతం మందికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించి ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేపట్టాలని జిల్లాల కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. శుక్రవారం నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలు ప్రకటించే ముందు ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని ఎలాంటి లోపాల్లేకుండా, ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా జాగ్రత్త వహించాల్సిన అవసరముందని సూచించారు. ఈ విషయంలో కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన తదితరులు పాల్గొన్నారు.

మాదక పదార్థాల రవాణాను కఠినంగా అణచివేయాలి

- అధికారులను ఆదేశించిన డీజీపీ అంజనీ కుమార్
- అధికారులకు ఒక రోజు శిక్షణనిచ్చిన సీఐడీ

నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో మాదక పదార్థాల రవాణా, వినియోగాలను నిరోధించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలనీ, అందుకు తగిన ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్‌డీపీఎస్ చట్టం అమలు, సమగ్ర దర్యాప్తులపై యాంటీ నార్కొటిక్ డ్రగ్ టీమ్‌లకు చెందిన అధికారులకు సీఐడీ ఆధ్వర్యంలో శుక్రవారం ఒకరోజు శిక్షణను ఇచ్చారు. ఈ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన అంజనీకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి మొదలైన మాదక పదార్థాల రవాణా, వినియోగాలను అరికట్టడానికి ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మాదక పదార్థాల తయారీ జరగనప్పటికీ.. డ్రగ్స్ మాఫియా హైదరాబాద్‌ను ఒక రాష్ట్రం నుంచి ఇంకో రాష్ట్రానికి రవాణా కేంద్రంగా ఉపయోగించుకుంటున్నారని అన్నారు. ముఖ్యంగా, యువతతో పాటు కొన్ని సామాజిక వర్గాలకు ఒక వ్యూహం ప్రకారం మాదక పదార్థాలను చేరవేస్తున్నారని, గొలుసుకట్టుగా సాగుతున్న ఈ లింకును తెంచాల్సిన అవసరం ఉన్నదని డీజీపీ అన్నారు. అందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని యాంటీ నార్కొటిక్ బ్యూరోకు చెందిన ప్రతి అధికారీ కలిగి ఉండాలనీ ఆయన నొక్కి చెప్పారు. గతేడాది డ్రగ్స్ రవాణాకు పాల్పడుతున్న 1277 మందిని అరెస్టు అయ్యారనీ, ఇందులో 218 మందిపై పీడీ చట్టం ప్రయోగం జరిగిందని అన్నారు. గత మూడేండ్లలో మాదక పదర్థాల రవాణా, వినియోగానికి పాల్పడుతున్న 7,478 మందిపై రాష్ట్రంలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేయటం జరిగిందని, ఇందులో 416 మందిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయటం జరిగిందని అంజనీ కుమార్ వివరిం చారు. రాష్ట్రంలో మాదక పదార్థాల రవాణాను కూకటివేళ్లతో పెకిలించి వేయడానికి ప్రత్యేకించి యాంటీ నార్కొటిక్ బ్యూరోను ఏర్పాటు చేసి అందకు అసవరమైన మౌలిక సదు పాయాలను కల్పించామని ఆయన తెలిపారు. సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడెక్కడ డ్రగ్స్ రవాణా, వినియోగం జరుగుతున్న ప్రాంతాల గురించి కూలంకశంగా వివరించారు. ముఖ్యంగా, ఏయే ప్రాంతాల నుంచి హైదరాబాద్ ద్వారా మాదక పదార్థా లు పక్క రాష్ట్రాలకు తరలుతు న్నది ఆయన వివరించారు. గత మూడేండ్ల లో 89 వేల కిలోల గంజాయితో పాటు 710 కిలోల మాదక పదార్థాలను రాష్ట్ర పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన వివరించారు. రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం సూపరింటెండెంట్ గంగా ధరన్ మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ యాక్ట్‌ను ఏ విధంగా వినియోగించాలి, అందుకు నిందితులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు సేకరించాలి, దర్యాప్తును ఏ విధంగా కొనసాగించాలి, అందుకు ప్రాథమికంగా పాటించాల్సిన జాగ్రత్త లు ఏమిటి.. తదితర అంశాలను ఆయన అధికారులకు వివరించారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ హైదరాబాద క్లూస్ టీమ్ డైరెక్టర్ వెంకన్న మాట్లాడుతూ.. మాదక పదార్థాలు పట్టుబడ్డ సమయంలో అక్కడ ఆధారాలను సైంటిఫిక్‌గా ఏ విధంగా సేకరిం చాలి? మొదలైన జాగ్రత్తలను వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమా నికి రాష్ట్రవ్యాప్తంగా యాంటీ నార్కొటిక్ సెల్‌కు చెందిన 228 మంది అధికారులు పాల్గొనగా యాంటీ నార్కొటిక్ బ్యూరో ఎస్పీ అనసూయ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

పైరవీ బదిలీలు ఆపాలి

- జీరో సర్వీసుకు అనుమతివ్వాలంటూ నేడు నిరసనలు : యూఎస్‌పీసీ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పైరవీ బదిలీలను ఆపాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) స్టీరింగ్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జీరో సర్వీసు బదిలీలకు అనుమతి ఇవ్వాలంటూ శనివారం జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను అపహాస్యం చేస్తూ, రాజకీయ పలుకుబడితో చేస్తున్న వందలాది పైరవీ బదిలీలను నిలిపేయాలని కోరింది. సాధారణ బదిలీల్లో కనీస సర్వీసు నిబంధనను తొలగించాలంటూ విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదని తెలిపింది. ఏ విధమైన అక్రమాలకు తావు లేకుండా బదిలీలు పారదర్శకంగా జరపాలని ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో సూచించిన ప్రభుత్వమే పైరవీ బదిలీలకు తెరలేపడం ఉపాధ్యాయుల్లో అశాంతికి కారణమౌతున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు హామీ ఇచ్చిన ప్రకారం పైరవీ బదిలీలను నిలిపేయాలని డిమాండ్ చేసింది. ఉపాధ్యాయులందరికీ బదిలీల్లో పాల్గొనే అవకాశమిచ్చి వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని కోరింది.

అక్రమ బదిలీలను రద్దు చేయాలి : తపస్

ఉపాధ్యాయ బదిలీల్లో ఉత్పన్నమవుతున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంతరావు, నవాత్ సురేష్ తెలిపారు. విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను శుక్రవారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. జీరో సర్వీసు ఉన్న ఉపాధ్యాయులకు కూడా బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. నాలుగో కేటగిరీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక పాయింట్లు ఇవ్వాలని తెలిపారు. స్పౌజ్ కోసం దరఖాస్తు చేసుకున్న హెచ్ఎం, ఎస్ఏ, ఎస్జీటీలందరికీ బదిలీలు చేపట్టాలని సూచించారు. పండితులు, పీఈటీల సమస్యపై ఉన్న కోర్టు స్టేను తొలగించి అడ్‌హక్ పద్ధతిలో పదోన్నతులు కల్పించాలని కోరారు. అక్రమ బదిలీలను రద్దు చేసి పదోన్నతులు పొందిన వారికి అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.

విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తాం : టీఎస్‌పీటీఏ

స్పౌజ్ బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ద్వితీయ శ్రేణి భాషా పండితుల విషయంలో స్పష్టత లేదని టీఎస్‌పీటీఏ అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, ప్రధాన కార్యదర్శి పిట్ల రాజయ్య తెలిపారు. శుక్రవారం విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని కలిసి తక్షణమే ఆదేశాలు జారీ చేయాలంటూ కోరామన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ దానిని కూడా పరిష్కరిస్తామని గతంలో ఇచ్చిన హామీనే పునరుద్ఘాటించారు. కానీ ఎప్పుడు చేస్తారో స్పష్టం చేయలేదని పేర్కొన్నారు. అధికారులు, విద్యామంత్రి ఇచ్చిన హామీపై శనివారం సాయంత్రంలోగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆదివారం పెద్ద ఎత్తున పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

తెలుగులోనూ న్యాయ విద్య ఉండాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింహ

నవతెలంగాణ - హైదరాబాద్

తెలుగులో కూడా న్యాయ విద్యను బోధించాలనీ, ఆ మేరకు విద్యార్థులకు ఆప్షన్ ఉండాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీ.ఎస్.నరసింహ చెప్పారు. తెలుగులో లా విద్యాబోధన కాలేజీలు ఏర్పాటు అవసరం లేదనీ, అయితే తెలుగును ఆప్షన్‌గా ఎంచుకునే అవకాశం విద్యార్థులకు ఉండాలన్నారు. కొన్ని కాలేజీల్లోనైనా ఆ విధమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా కోర్టుల్లోనైనా తెలుగు భాషలో వాదనలు, తీర్పులు వెలువడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అప్పుడే తమ కేసుల్లో ఏం జరిగిందో ప్రజలకు తెలుస్తుందని చెప్పారు. కింది కోర్టుల్లో కేసుల వాదనలు, తీర్పులు తెలుగులో ఉండాలని కోరారు. బ్రిటీష్ కాలం నాటి విధానంలో ఇంగ్లిషులో వాదనలు సాగుతుండటంతో చాలా మందికి తమ కేసు గురించి ఏం జరుగుతోందో తెలియడం లేదని చెప్పారు. బార్ అండ్ బెంచ్ సంబంధాలపై హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఇప్పటికీ ఆనాటి విధానాలే కొనసాగడం సరికాదంటూ, మన భాషలకు అనుగుణంగా మార్పులు రావాల్సి ఉందన్నారు. ట్రయిల్ బేసెస్‌పై కొన్ని కాలేజీల్లో తెలుగులో కూడా లా క్లాస్‌లను నిర్వహించాలని కోరారు. దీని వల్ల జిల్లా కోర్టులో తీర్పులు తెలుగులో వస్తాయనీ, అప్పుడు జనానికి కోర్టుల్లో ఏం జరిగిందో తెలుస్తుందన్నారు. సాధన ఉంటేనే వృత్తిలో గుర్తింపు, ఫలితంగా గౌరవం లభిస్తాయని చెప్పారు. పెండింగ్ కేసుల గురించి ఆయన మాట్లాడుతూ, అన్నదమ్ముల భూ పంచాయితీకి.. భార్యాభర్తల విడాకులకు.. దాదాపు 15 నుంచి 25 ఏండ్లు పడుతుంటే వారికి లభించే న్యాయం ఏ కోవకు చెందుతుందో ఆలోచన చేయాలన్నారు. కోర్టులంటే భయపడేలా ఉండకూడదని హితవు పలికారు. ఇలాంటి కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయ వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు.

ఆదిలాబాద్ లాంటి మారుమూల జిల్లా నుంచి ఎమ్మార్వో పైన్నో, ఇంకో అధికారిపైన్నో చిన్న కేసు కోసం హైకోర్టుకు వచ్చేలా కాకుండా అక్కడి జిల్లా కోర్టులోనే కేసు విచారించేలా మార్పులు చేయాల్సి ఉందని తెలిపారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు ఎప్పటికప్పుడు సాంకేతికను అందిపుచ్చుకోవడంతో పాటు న్యాయ వ్యవస్థలోనూ దాన్ని అమలు చేస్తే ఫలితాలు బాగుంటాయని చెప్పారు. హైకోర్టు బార్ అసోసియేషన్ ఛైర్మెన్ రఘునాథ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్‌భూయాన్, ఏజీ బీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి పువ్వాడ అజయ్‌కు హైకోర్టు నోటీసులు

నవతెలంగాణ - హైదరాబాద్

ఎంబీబీఎస్, పీజీ మెడికల్ ఫీజులకు సంబంధించి హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలంటూ మమత ఎడ్యూకేషనల్ సొసైటీ ఛైర్మెన్, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎస్.తుకారాంజీ డివిజన్ బెంచ్ నోటీసులు జారీ చేసింది.

విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయవద్దని, ఒకవేళ చేస్తే తిరిగి అధిక ఫీజు మొత్తాన్ని చెల్లించాలన్న ఉత్తర్వులకు విరుద్ధంగా తన నుంచి రూ.60 లక్షలకుపైగా వసూలు చేశారంటూ డాక్టర్ జి.నిఖిల్ దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌ను శుక్రవారం న్యాయస్థానం విచారించింది. ఇదే తరహా కోర్టు ధిక్కార కేసులతో కలిపి దీన్ని కూడా ఏప్రిల్ 17న విచారిస్తామని తెలిపింది.

దర్యాప్తు పురోగతిపై రిపోర్టు ఇవ్వండి

రంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో 25 ఎకరాల భూమిలో పది టవర్లతో 32 అంతస్తులతో గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్లను నిర్మిస్తామంటూ చెప్పి జనాన్ని మోసం చేసిన సాహితి శర్వాణి ఎలైట్‌కు సంబంధించి వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు పురోగతి నివేదిక సమర్పించాలని పోలీసులకు హైకోర్టు నోటీసులిచ్చింది. బాధితుల ఫిర్యాదులపై మూడు నెలల్లోగా దర్యాప్తు పూర్తి చేయాలని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను, ఆ కంపెనీ మాజీ డైరెక్టర్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎస్.తుకారాంజీల డివిజన్ బెంచ్ విచారించింది. ఫిబ్రవరి 10వ తేదీ నాటికి నివేదిక ఇవ్వాలంటూ ఆదేశించింది.

బాలికలకు సింక్రోనీ స్కాలర్‌షిప్‌లు

హైదరాబాద్ : వెనుకబడిన వర్గాల వారికి.. మరి ముఖ్యంగా చదువుకునే మహిళలకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్టు ఆర్థిక సేవల కంపెనీ సింక్రోనీ తెలిపింది. 'ఎడ్యుకేషన్ యాజ్ యాస్ ఈక్వలైజర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ కింద సింక్రోనీ ఫౌండేషన్ మద్దతును అందిస్తున్నట్టు పేర్కొంది. స్కాలర్‌షిప్‌లు, మెంటర్‌షిప్స్‌కు రూ.44 లక్షలు (55వేల డాలర్లు) కేటాయించినట్టు తెలిపింది.

బాలికా విద్య పట్ల కంపెనీ అధికంగా దృష్టి సారించడంతో సింక్రోనీ ప్రస్తుతం 119 మంది విద్యార్థులకు ఈ ప్రోగ్రామ్ ద్వారా మద్దతు అందిస్తుందని తెలిపింది. వీరిలో 88 శాతం మంది మహిళా విద్యార్థులు ఉన్నారని వెల్లడించింది.

విద్యార్థులు తమ సామర్థ్యంపై విశ్వాసం ఉంచాలి

- 'పరీక్షా పే చర్చ'లో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలపై విశ్వాసం ఉంచాలని ప్రధాని మోడీ విద్యార్థులకు సూచించారు. ఎలక్ట్రానిక్ పరికరాల (గాడ్జెట్స్) కన్నా మీరు సమర్థవంతులని.. వాటిని తెలివిగా, స్మార్ట్‌గా వినియోగించాలని అన్నారు. శుక్రవారం నిర్వహిం చిన "పరీక్షా పే చర్చ" కార్యక్రమంలో ప్రధాని మోడీ విద్యార్థులతో మాట్లా డారు. భారతదేశంలోని ప్రజలు సగటున ఆరుగంటలపాటు ఎలక్ట్రానిక్ పరికరాలను చూస్తున్నారని.. ఇది ఆందోళనకరమైన అంశమని అన్నారు. సగటున ఆరుగంటల పాటు గాడ్జెట్స్ వినియోగం తయారీ దారులకు ప్రయోజనం చేకూరుస్తుందని అన్నారు. ఇది ప్రజల సృజనాత్మకతను అడ్డుకుంటుందని అన్నారు. పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడటం, చీటింగ్ చేయడం వంటి వాటి గురించి కూడా ప్రస్తావించారు. కాలం మారు తున్నదని... అడుగడుగునా పరీక్షలను రాయాల్సివుంటుందని, చీటింగ్‌తో ఒకటి రెండు పరీక్షల్లో విజయం సాధించవచ్చు కానీ, జీవితంలో ఎప్పటికీ ఉత్తీర్ణత సాధించలేరని అన్నారు. విద్యార్థులు తమ సామర్థ్యాన్ని ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదని చెప్పారు. ప్రతి ఒక్కరిలోనూ నైపుణ్యాలు ఉంటాయని... వాటిగురించి తెలుసుకోవాలని అన్నారు.

భద్రతా వైఫల్యంతో నిలిచిన జోడోయాత్ర

శ్రీనగర్ :భద్రతా వైఫల్యం కారణంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నేతృత్వంలోని భారత్ జోడోయాత్రకు శుక్రవారం ఆటంకం ఏర్పడింది. షెడ్యూల్ ప్రకారం..; కాశ్మీర్ లోయలో నేడు 11 కి.మీ జోడోయాత్ర చేపట్టాల్సి వుంది. అయితే భద్రతా కారణాల రీత్యా కిలో మీటరు తర్వాత పాదయాత్రను నిలిపివేయాల్సి వచ్చిందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. రాహుల్ పాదయాత్ర జమ్ము నుంచి కాశ్మీర్‌లోకి ప్రవేశిస్తుండగా.. ఊహించని విధంగా కాశ్మీర్‌లో భారీ సంఖ్యలో ప్రజలు అక్కడికి చేరుకున్నారని... దీంతో యాత్రను నిలిపివేసినట్టు ఆ వర్గాలు తెలిపాయి. జమ్ముకాశ్మీర్ పాలనా యంత్రాంగం భద్రతా సిబ్బందిని ఆకస్మికంగా ఉపసంహరించుకుందనీ, ఇది తీవ్రమైన భద్రతా ఉల్లంఘన అని కాంగ్రెస్ మండిపడింది. శ్రీనగర్‌కు వెళ్లే మార్గంలో బనిహాల్ టన్నెల్ దాటిన తర్వాత భారీ జన సమూహం ఎదురవడం, తగినంత భద్రతా సిబ్బంది లేకపోవడంతో యాత్రను రద్దు చేయాల్సి వచ్చిందని తెలిపింది. వెంటనే ఆయనను ప్రత్యేక వాహనంలో వెనక్కు తీసుకెళ్లాల్సి వచ్చినట్టు పేర్కొంది. బనిహాల్ టన్నెల్ దాటిన అనంతరం పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారని కాంగ్రెస్ నేత కె.సి వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటి భారత్ జోడోయాత్రలో జమ్ముకాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా కూడా పాల్గొన్నారు.

'నాన్ గెజిటెడ్' క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణా నాన్ గెజిటెడ్ యూనిట్' క్యాలెండర్‌ను సంచాలకులు బీ రాజమౌళి ఆవిష్కరించారు. సమాచార శాఖ అదనపు సంచాలకులు నాగయ్య కాంబ్లీ, కిశోర్‌బాబు, సంయుక్త సంచాలకులు డీఎస్ జగన్, డీ శ్రీనివాస్, వెంకటరమణ, వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. టీఎన్జీవో నగర అధ్యక్షులు శ్రీరామ్, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బలిజలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- బెంగుళూరు సంకల్ప సభలో ఎంపీ రవిచంద్ర

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు నేతృత్వంలోని ప్రభుత్వం బలిజ కులస్తులకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నదని ఎంపీ రవిచంద్ర అన్నారు. బెంగుళూరులో జరిగిన బలిజల సంకల్ప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అన్ని కులాలు, మతాలకు సమ ప్రాధాన్యత ఇస్తూ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని మినీ భారత్‌గా మార్చారని కొనియాడారు. మున్నూరుకాపులకు సముచిత పదవులిచ్చి గౌరవిస్తున్నారని చెప్పారు. విదేశాల్లో ఉన్నత చదువులకు వెళ్ళే విద్యార్థులకు రూ.20 లక్షలు ఉచితంగా అందిస్తున్నారనీ, ఆత్మ గౌరవ భవనాల నిర్మాణానికి భూమి, డబ్బు కేటాయించారని తెలిపారు. కర్ణాటక బలిజల న్యాయమైన డిమాండ్స్ సాధనకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ఆయన ప్రస్తావించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మున్నూరుకాపు ప్రముఖులు ఆకుల రజిత్, మరికల్ పోత సుధీర్ కుమార్, ప్రముఖ వాస్తుశిల్పి ముద్దు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బీబీసీ డాక్యుమెంటరీని రాష్ట్రంలో ప్రదర్శించాలి : ఏఐవైఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం నిషేధించిన బీబీసీ డాక్యుమెంటరీని రాష్ట్రంలో ప్రదర్శించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె ధర్మేంద్ర, వలీ ఉల్లా ఖాద్రీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2002 గుజరాత్ అల్లర్లలో ప్రధాని నరేంద్ర మోడీ పాత్రను స్పష్టంగా బట్టబయలు చేస్తూ బీబీసీ ఇండియా 'ది మోడీ క్వశ్చన్' అనే డాక్యుమెంటరీ ని విడుదల చేసిందని తెలిపారు. దీన్ని రాష్ట్రంలో విస్తృతంగా ప్రదర్శించాలని కోరారు. మత రాజకీయాల ఆధారంగా ప్రధాని అయ్యి దేశాన్ని కించపరిచిన మోడీ నిజ స్వరూపాన్ని సమాజానికి తెలియజేయాలని సూచించారు. అంతర్జాతీయ సమాజంలో భారత దేశ ఖ్యాతిని, సామాజిక ఆర్థికాభి వృద్ధిని నాశనం చేసింది మోడీ అంటూ బీబీసీ ధ్వజమెత్తిందని తెలిపారు. త్వరలో ఈ డాక్యుమెంటరీని ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

40 వేల మంది ఉపాధ్యాయుల బదిలీ!

- 9,700 మందికిపైగా పదోన్నతులు
- నేటినుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సుమారు 40 వేల మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యే అవకాశమున్నది. ఒకే పాఠశాలలో ఎనిమిదేండ్ల సర్వీసు పూర్తి చేసిన ఉపాధ్యాయులు, ఐదేండ్లు పూర్తి చేసిన ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం) తప్పనిసరిగా బదిలీ అవుతారు. రాష్ట్రంలో వారు సుమారు 25 వేల మంది వరకు ఉంటారని విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బదిలీకి దరఖాస్తు చేసుకోవాలంటే కనీసం రెండేండ్ల సర్వీసు ఉండాలన్న నిబంధన ఉన్నది. దీంతో 15 వేల మంది దరఖాస్తు చేసుకునే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. 317 జీవో అమలు నేపథ్యంలో 22,418 మంది ఉపాధ్యాయులు గతేడాది బదిలీ అయ్యారు. వారికి ప్రస్తుత బదిలీల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. జీరో సర్వీసుతో బదిలీలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలంటూ ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రస్తుత బదిలీల ప్రక్రియలో మొత్తంగా 40 వేల మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలగనుంది. అయితే 9,700 మందికిపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశమున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో శుక్రవారం నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. దరఖాస్తుల సమర్పణకు గడువు ఈనెల 30 వరకు గడువున్నది. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు, మాన్యువల్‌గా పదోన్నతుల ప్రక్రియను చేపడతారు.

కార్ ఆఫ్ ది ఇయర్‌గా కియా కారెన్స్

హైదరాబాద్ : కార్ల తయారీ కంపెనీ కియా ఇండియా 2023 ప్రారంభంలోనే గొప్ప విజయాలు సాధించినట్లు పేర్కొంది. ఇండియన్ కార్ ఆఫ్ ది ఇయర్-2023గా కియా కారెన్స్‌కు గౌరవం దక్కినట్లు పేర్కొంది. కియా ఇవి6 గ్రీన్ కార్ అవార్డ్ 2023ని ఐకోటి ద్వారా గెలుచుకున్నట్లు పేర్కొంది. దీంతో ఒకే సంవత్సరంలో రెండు ఐకోటి అవార్డ్స్ గెలుపొందిన మొదటి బ్రాండ్‌గా కియా గుర్తింపు పొందిందని తెలిపింది.